www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

65 రోజులు.. 74 మ్యాచ్‌లు..

ఐపీఎల్-2025 షెడ్యూల్ విడుదల

మార్చి 22న లీగ్ షురూ.. మే 25న ఫైనల్

తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 11 మ్యాచ్‌లు

ఉప్పల్‌లో తొమ్మిది, విశాఖపట్నంలో రెండు

10



సోమవారం | 17-2-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 303 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: పంచమి తె. 4.54 తదుపరి షష్ఠి; నక్షత్రం: చిత్త పూర్తి; వర్జ్యం: ఉ. 1.32-3.20; దుర్ముహూర్తం: ఉ. 12.52-1.38, ఉ. 3.10-3.56; అమృతఘడియలు: రా. 12.21-2.10; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 6.14 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



విచిత్రాల వీధులు

మురికివాడకు రంగుల శోభ

రూపు మారిన తిరుపతి స్కావెంజర్స్ కాలనీ

హరివిల్లు నేలకు దిగినట్లు రకరకాల రంగులు! చూడగానే ఆకట్టుకునేలా మంచి మంచి బొమ్మలు! ప్రతి వీధీ 'చిత్ర' విచిత్రమే! ప్రతి గోడా వర్ణభరితమే! ఈ 'బొమ్మల కొలువు' చూడాలంటే తిరుపతికి వెళ్లాల్సిందే. ఇది.. నగరంలోని స్కావెంజర్స్ కాలనీ! మొన్నటిదాకా తిరుపతిలోనే అత్యంత మురికి వాడ! భరించలేని వాసన, చెత్త.. మధ్యే స్థానికుల జీవితాలు! ఇప్పుడు ఇక్కడ జీవన 'చిత్రం' మారిపోతోంది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా నిజమే! వీధుల పరిశీలనలో భాగంగా ఇటీవల స్కావెంజర్స్ కాలనీకి వెళ్లిన తిరుపతి మునిసిపల్ కమిషనర్ మౌర్య అక్కడి పరిస్థితులు చూసి చలించిపోయారు. కాలనీలో

మిగతా 3వ పేజీలో...



రీ సర్వే రచ్చ

కూటమి సర్కారు నెత్తిన జగన్ ప్రభుత్వ వైఫల్యాలు

8 నెలల్లో **7.42** లక్షల ఫిర్యాదులు

రెవెన్యూ శాఖవే **3.39** లక్షలు

ఇవన్నీ రీ సర్వేతో వచ్చిన సమస్యలే

అధికారులు, సిబ్బంది కొరతతో

నేడు సంక్లిష్టంగా పరిష్కారం




జగన్ సర్కారు దిగిపోయినా ఆయన చేసిన తప్పిదాలు ఇప్పటికీ రైతులను వెంటాడుతున్నాయి. వందలో, వేలో కాదు.. లక్షలాది మంది తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఈ నెల 6వ తేదీ వరకు అధికారిక లెక్కల ప్రకారం 7,42,301 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో సింహభాగం రెవెన్యూ శాఖకు సంబంధించినవే. అందులోనూ రీ సర్వే పేరిట జగన్ సర్కారు కొత్తగా సృష్టించిన సమస్యలే.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత సర్కారు సృష్టించిన సమస్యలపై కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఫిర్యాదులు, వినతులు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. వాటిని క్రోడీకరించగా రెవెన్యూ శాఖ పరిష్కరించాల్సినవే 3,39,047 ఉన్నాయి. మిగిలినవి ఇతర ప్రభుత్వ శాఖలు పరిష్కరించాల్సిన అంశాలు. అంటే... మొత్తం 7,42,301 సమస్యల్లో సగం ఒక్క రెవెన్యూ శాఖవే ఉన్నాయన్నమాట. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో జరిగిన కార్యదర్శుల సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారం (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం-పీజీఆర్ఎస్)పై ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వానికి వస్తున్న ప్రజాఫిర్యాదులు, విన్నపాల్లో ఎక్కువగా జగన్ సర్కారు చేపట్టిన రీ సర్వేపైనే ఉన్నట్టు వెల్లడైంది. పాలకుడు సమర్థుడైతే ప్రజలు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలను పరిష్కరిస్తారు. అదే పాలకుడు మరిన్ని కొత్త సమస్యలను సృష్టిస్తే ప్రజల జీవితాలు మరింత కష్టాలమయం అవుతాయి. అప్పటికే ఉన్న సమస్యలు తీరకపోగా, కొత్త సమస్యలు

మిగతా 11వ పేజీలో...



7 లక్షల కోట్ల పెట్టుబడులు

తెస్తున్నాం!

4 లక్షల మందికి ఉపాధి కల్పించనున్నాం

రాష్ట్రమంతా స్కిల్ సెంటర్లు పెడుతున్నాం

త్వరలో మెగా డీఎస్సీ ప్రకటించనున్నాం

కూటమి ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలివీ

వీటిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనది

కలిసికట్టుగా పనిచేసి కూటమిని గెలిపించండి

ఎమ్మెల్సీ ఎన్నికలపై నేతలకు సీఎం దిశానిర్దేశం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సుమారు రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి, 4 లక్షల మందికి ఉపాధి కల్పించనున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రాష్ట్రమంతా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు పెడుతున్నామని, త్వరలో మెగా డీఎస్సీతో 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నామని తెలిపారు. ఇవన్నీ 8 నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాలని, వీటిని

మిగతా 12వ పేజీలో...

తిరుపతిలో నేటి నుంచి ఆలయ సదస్సు

12

హాజరుకానున్న ఏపీ, గోవా, మహారాష్ట్ర సీఎంలు

జీబీఎస్‌తో జాగ్రత్త!

రాష్ట్రంలో పెరుగుతున్న కేసులు

ఇప్పటి వరకు 59 కేసులు వెలుగులోకి

ఇంకా ఎక్కువే ఉంటాయంటున్న అధికారులు

రాష్ట్రంలో రెండో మరణం నమోదు

ఇప్పటికే శ్రీకాకుళంలో ఆరేళ్ల బాబు మృతి

తాజాగా ప్రకాశంలో 50 ఏళ్ల మహిళ మరణం

ప్రస్తుతం ఆస్పత్రుల్లో మరో 14 మంది

నిమిషాల వ్యవధిలో ఒళ్లంతా పాకే వ్యాధి

లక్షణాలు కనిపించగానే ఆస్పత్రిలో చేరాల్సిందే

ఇంజెక్షన్ ధర రూ.6 వేల నుంచి 30 వేల వరకు

ప్రైవేటు వైద్యమంటే పేదలకు కష్టమే!

ప్రభుత్వమే యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి



ప్రకాశం జిల్లా అలసందలపల్లిలో జీబీఎస్‌తో మరణించిన మహిళ ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

'ప్రకాశం'లో మహిళ మృతి

గ్రామంలో క్లోరినేషన్.. వైద్య శిబిరాల ఏర్పాటు

గుంటూరులోనూ ఒకరి పరిస్థితి విషమం

జీజీహెచ్‌లో ఇప్పటి వరకు ఎనిమిది కేసులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో జీబీఎస్(గులియన్ బారే సిండ్రోమ్) విజృంభణ మొదలైంది. నెమ్మదిగా మరణాలూ పెరుగుతున్నాయి. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాల్లో ఆరేళ్ల బాలుడు దీని బారిన పడి మరణించగా, తాజాగా ప్రకాశం జిల్లాకు చెందిన 50 ఏళ్ల మహిళ ఈ వ్యాధితో గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రాణాలు కోల్పోయారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి కొన్ని చోట్ల ప్రత్యేక చికిత్సకు ఏర్పాట్లు చేశారు. అయితే, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లోనూ ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో 59 కేసులు వెలుగులోకి వచ్చాయి. అందులో 14 మంది మాత్రమే చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారు చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్నారు. చికిత్స అనంతరం ఇంటికి వెళ్లినవారిపై ఆరోగ్యశాఖ ప్రత్యేక నిఘా పెట్టింది.

సరైన సమయానికి వైద్యం అందకే మరణాలు..

వ్యక్తిగతంగా జీబీఎస్‌పై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. కరోనా కంటే జీబీఎస్ చాలా ప్రమాదకరంగా మారింది. కరోనా వచ్చినప్పుడు కనీసం వ్యాధి లక్షణాల ద్వారా తెలుసుకునే వెసులుబాటు ఉంది. వెంటనే మందులు వాడుకుని ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉండేది. కానీ, జీబీఎస్‌లో అలాంటి అవకాశం లేదు. వ్యాధి లక్షణాలు విచిత్రంగా ఉన్నాయి. ఏ మందు వేసుకోవాలో తెలియదు. వెంటనే వైద్యులను సంప్రదించకపోతే మృత్యువాతపడుతున్నారు. కాబట్టి జీబీఎస్ విషయంలో అత్యంత

మిగతా 11వ పేజీలో...



తొలి తెలుగు మహిళా నిర్మాత

కృష్ణవేణి కన్నుమూత

తొలి తరం నటి, గాయని, స్టూడియో అధినేతగా ముద్ర

'మనదేశం'తో ఎన్టీఆర్‌ను వెండితెరకు తెచ్చిన ఖ్యాతి

8

ఇద్దరు టీటీడీ మాజీ ముఖ్యులకు లుకౌట్ నోటీసులు?!

12

లడ్డూ కేసులో అనుమానితుల బ్యాంకు ఖాతాలపై సిట్ దృష్టి

కాల్ డేటా తెప్పించి విశ్లేషించనున్న అధికారులు



అమెరికా యుద్ధ విమానంలో భారతీయ అక్రమ వలసదారులు

మళ్లీ సంకెళ్లతోనే..

తీరు మార్చుకోని అమెరికా.. మలి విడతలోనూ 228 మంది భారతీయులకు సంకెళ్లు వేసి వెనక్కి పంపిన అగ్రరాజ్యం

తలపాగా కట్టుకోవడానికీ అనుమతించలేదన్న సిక్కు వలసదారులు

తీవ్రంగా ఖండించిన శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ

భారత్‌లో ఓటింగ్ పెంపునకు కేటాయించిన 182 కోట్లు రద్దు

చండీగఢ్, ఫిబ్రవరి 16: సరైన పత్రాలు లేకుండా అక్రమంగా అమెరికాకు వెళ్లిన 228 మంది భారతీయులను తాజాగా ఆ దేశం వెనక్కి పంపింది. శని, ఆదివారాల్లో రెండు విడతలుగా అమెరికా సైనిక విమానాల్లో వీరిని భారత్‌కు తీసుకొచ్చారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ విమానాలు ల్యాండ్ అయ్యాయి. తమ చేతులకు సంకెళ్లు వేసి, కాళ్లను గొలుసులతో బంధించి తీసుకువచ్చారని భారతీయ వలసదారులు వాపోయారు. విమానంలో ప్రయాణ సమయమంతా తమను ఇలాగే ఉంచారని, అమృత్‌సర్‌లో విమానం దిగిన తర్వాతనే సంకెళ్లు, గొలుసులు తొలగించారని చెప్పారు. తొలి విడతలో అమెరికా వెనక్కి పంపిన

మిగతా 2వ పేజీలో...

సంకెళ్లతో మోదీ కార్టూన్!

తమిళ వెబ్ పత్రిక 'వికటన్'లో ప్రచురణ

2

బీజేపీ ఫిర్యాదుతో కేంద్రం చర్యలు

వికటన్ వెబ్‌సైట్ నిలిపివేత

తమిళ నేతల ఖండన

అమెరికా అండ లేకుంటే.. ఉక్రెయిన్

మనుగడ కష్టమే!

ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్య

ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రకు మరో వారం రోజుల్లో మూడేళ్లు పూర్తి

18% భూభాగం కోల్పోయిన ఉక్రెయిన్.. రష్యా భూభాగంలో కొంత మేర ఆక్రమణ

అమెరికా, యూరప్ దేశాల మద్దతుతో రష్యా సేనలకు ముప్పుతిప్పలు

ట్రంప్ వచ్చాక మారిన పరిస్థితి.. సాయానికి సగం ఖనిజ నిక్షేపాలు రాసివ్వాలని షరతు


ట్రంప్‌పై ఆశలు పెట్టుకోలేమన్న జెలెన్‌స్కీ.. 'ఆర్మీ ఆఫ్ యూరప్' ఏర్పాటుకు పిలుపు



"అమెరికా అండ లేకపోతే.. రష్యా దాడులను ఎదుర్కొని ఉక్రెయిన్ మనుగడ సాగించే అవకాశాలు చాలా తక్కువ. బహుశా అది చాలా చాలా చాలా కష్టం"

..పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా తమ దేశం మీద దండయాత్రకు దిగిన అంత పెద్ద రష్యానూ మూడేళ్లుగా నిలువరించి వీరోచిత పోరాటం చేస్తున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తాజాగా చేసిన వ్యాఖ్యలివి! అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధికారపగ్గాలు అందుకున్న ట్రంప్.. పుతిన్‌కు ఫోన్ చేసి గంటన్నర సేపు మాట్లాడిన తర్వాత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన స్వరంలో కనిపించిన నిర్వేదం ఇది!! ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రకటించి వచ్చే

మిగతా 2వ పేజీలో...



12

వంశీ బ్యారక్‌కు పరదా!

విజయవాడ జిల్లా జైలులో భద్రతా చర్యలు

నేడు 164 వాంగ్మూలం నమోదుకు న్యాయాధికారి ముందుకు సత్యవర్ధన్

రేపు వంశీతో జగన్ ములాఖత్?

రైళ్ల పేర్లలో గందరగోళం వల్లే!

2

ఢిల్లీలో తొక్కిసలాటకు కారణమిదే!.. రైలు రాకపై ప్రకటనతో ప్రయాణికుల తికమక

14వ ప్లాట్‌ఫాం నుంచి 16వ ప్లాట్‌ఫాంకు ఒక్కసారిగా పరుగులు తీయడంతో తొక్కిసలాట.. 18కి చేరిన మృతులు.. 12 మందికి గాయాలు



భారత్‌లో ఓటింగ్ పెంపునకు అమెరికా కేటాయించిన రూ.182 కోట్లు రద్దు

» ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: భారత్‌లో ఓటింగ్ శాతం పెంచడానికి ఉద్దేశించిన రూ.182 కోట్ల సాయాన్ని రద్దు చేస్తున్నట్టు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) ప్రకటించింది. అమెరికాలోని పన్ను చెల్లింపుదారులు కట్టే సొమ్మును వివిధ దేశాల కోసం ఖర్చు పెడుతున్నారని, వాటన్నింటినీ నిలిపివేస్తున్నట్టు తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఆదివారం చేసిన పోస్టులో తెలిపింది. అలాగే బంగ్లాదేశ్‌లో రాజకీయ స్థిరత్వాన్ని బలోపేతం చేయడానికి కేటాయించిన రూ.215 కోట్లు, మొజాంబిక్ రూ.86 కోట్లు, నేపాల్ రూ.338 కోట్లు, లైబీరియా రూ.13 కోట్లు, మాలి రూ.121 కోట్లతో పాటు అనేక దేశాలకు కేటాయించిన సాయాన్ని కూడా డోజ్ రద్దు చేసింది. డోజ్ తాజా నిర్ణయంపై బీజేపీ నేత అమిత్ మాలవీయ స్పందించారు. 'దేశంలో ఓటర్ల శాతం పెంచేందుకు 21మిలియన్ డాలర్లా? ఇది భారతదేశ ఎన్నికల ప్రక్రియలో బాహ్య శక్తుల జోక్యం కాకపోతే మరేంటి? దీనినుంచి ఎవరు లాభపడుతున్నారు? కచ్చితంగా అధికార పార్టీ మాత్రం కాదు' అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, 2012లో ఎన్నికల సంఘానికి తాను నేతృత్వం వహించినప్పుడు దేశంలో ఓటింగ్ శాతం పెంచడానికి మిలియన్ డాలర్ల నిధుల కోసం అమెరికా ఏజెన్సీతో ఎంవోయూ చేసుకున్నట్టు వస్తున్న వార్తలు నిరాధారమైనవని మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషీ తోసిపుచ్చారు.

అమెరికా సైనికుల భోజనం నిధుల దారి మళ్లింపు!

వాషింగ్టన్, ఫిబ్రవరి 16: అమెరికాలో సైనికుల ఆహారం కోసం కేటాయించిన నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ మేరకు మిలటరీ డాట్ కాం కథనాన్ని ప్రచురించింది. ఆహారం కోసం ప్రతి నెలా ఒక్కో సైనికుడి జీతం నుంచి 460 డాలర్లు (సుమారు రూ.40 వేలు) కోత విధిస్తారు. ఇలా జమ అయిన సొమ్మును భోజనాల కోసమే వినియోగించాల్సి ఉంటుంది. కానీ దానిని ఇతరత్రా మళ్లిస్తున్నట్టు తేలింది. జీతాల నుంచి 225 మిలియన్ డాలర్లు (సుమారు రూ.1,950 కోట్లు) వసూలు చేయగా, అందులో కేవలం 74 మిలియన్ డాలర్లు (సుమారు రూ.640 కోట్లు) మాత్రమే ఆహారం కోసం ఖర్చు చేశారు. దేశంలోని 11 పెద్ద మిలటరీ బేస్‌ల్లో గత ఏడాది చేసిన వ్యయాలను పరిశీలిస్తే ఈ విషయం వెల్లడయింది. నిధుల మళ్లింపు కారణంగానే ఫోర్ట్ కార్సన్, కొలరాడోని మిలటరీ కేంద్రాల్లో ఆహార కొరత ఉందని వార్తలు కూడా వచ్చాయి.

టెక్స్‌టైల్ ఎగుమతుల్ని రూ.9లక్షల కోట్లకు పెంచడమే లక్ష్యం: మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: జౌళి ఉత్పత్తుల వార్షిక ఎగుమతుల్ని 2030 నాటికి ముందే రూ.9 లక్షల కోట్లకు పెంచడం ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని మోదీ ప్రకటించారు. ఢిల్లీలో ఫిబ్రవరి 14 నుంచి 17వ తేదీ వరకు జరుగుతున్న భారత్ టెక్స్ కార్యక్రమానికి మోదీ ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టెక్స్‌టైల్ రంగానికి బ్యాంకులు సహకారం అందించాలని, తద్వారా ఉపాధి పెంచేందుకు సహకరించాలని కోరారు. ప్రపంచంలో ఆరో అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఉన్న భారత్ గతేడాది 7% వృద్ధి నమోదు చేసిందని చెప్పారు. ప్రస్తుతం రూ.3లక్షల కోట్లుగా ఉన్న వార్షిక ఎగుమతుల్ని 2030 నాటికి ముందే మూడింతలు రూ.9లక్షల కోట్లకు పెంచడం ప్రభుత్వ లక్ష్యమన్నారు.

హిందూ మతమే బాధ్యతాయుత సమాజం

» భిన్నత్వాన్ని ఆమోదించేదీ అదే: మోహన్ భాగవత్

బర్ధమాన్, ఫిబ్రవరి 16: హిందూ సమాజాన్ని ఐకమత్యంగా ఉంచాల్సిన ఆవశ్యకత ఉందని ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ అన్నారు. ఎందుకంటే దేశంలో బాధ్యతాయుతమైన సమాజం అదొక్కటేనని చెప్పారు. భిన్నత్వాన్నే ఏకత్వంగా భావించేది కూడా అదేనని తెలిపారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఆరెస్సెస్ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. భిన్నత్వాన్ని స్వీకరించడమనే పునాదిపైనే హిందూ సమాజం ఆధారపడి ఉందని తెలిపారు. భిన్నతంలో ఏకత్వమని కాకుండా భిన్నత్వమే ఏకత్వమని హిందూ సమాజం నమ్ముతోందని వివరించారు.

మాలిలో బంగారం గని కూలి 42 మంది మృతి

బమాకో (మాలి), ఫిబ్రవరి 16: పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలిలో ఘోర ప్రమాదం జరిగింది. కెనీబా జిల్లాలో బంగారు గని కూలి 42 మంది దుర్మరణం పాలయ్యారని, అనేక మంది గాయపడ్డారని స్థానిక మీడియా, అధికారులు వెల్లడించారు. కెనీబా జిల్లా డాబియా కమ్యూన్‌లోని బిలాలీ టోకో వద్ద శనివారం రాత్రి బంగారు గని కూలిపోయినట్టు మాలియన్ టెలివిజన్ ప్రకటించింది. చైనాకు చెందిన వారు ఈ గోల్డ్ మైన్‌ను నడుపుతున్నారని, ఈ ప్రాంతంలో మట్టిపెళ్లలు విరిగిపడడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానిక అధికారులు ధ్రువీకరించారు.

అదనపు కట్నం ఇవ్వలేదని కోడలికి హెచ్ఐవీ సూది

సహరన్‌పూర్, ఫిబ్రవరి 16: అదనపు కట్నం ఇవ్వలేదనే కోపంతో అత్తమామలు కోడలిపై దారుణానికి ఒడిగట్టారు. ఆమెకు హెచ్ఐవీ వైరస్ అంటి ఉన్న ఇంజక్షన్‌ను ఇచ్చారు. ఈ ఘటన ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన యువతికి 2023 ఫిబ్రవరి 15న ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు చెందిన అభిషేక్‌తో వివాహమైంది. వివాహ సమయంలో యువతి తండ్రి వరుడికి కొంత నగదు, నగలతో పాటు ఓ కారు ఇచ్చారు. అత్తమామలు తమకు మరో రూ.25 లక్షల నగదు, మరింత పెద్ద కారు కావాలంటూ కోడలిని వేధించసాగారు. ఆమెను చంపేస్తే తమ కుమారుడికి మరో పెళ్లి చేయొచ్చనే దురాలోచనతో హెచ్ఐవీ వైరస్ అంటి ఉన్న ఇంజక్షన్‌ను ఎక్కించారు.

మారిషస్ మాజీ ప్రధాని జగన్నాథ్ అరెస్ట్

పోర్ట్ లోయిస్, ఫిబ్రవరి16: మారిషస్ మాజీ ప్రధాని ప్రవింద్ జగన్నాథ్‌ను మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ చేశారు. ఆయన నివాసాలు, కార్యాలయాలపై ఆ దేశ ఆర్థిక నేరాల కమిషన్ సోదాలు జరిపి కీలక పత్రాలను, ఖరీదైన గడియారాలు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీని స్వాధీనం చేసుకుంది. జగన్నాథ్ భార్య కోబితను కూడా అరెస్ట్ చేశారు. 2017 నుంచి 2024 వరకు ఆయన ప్రధానిగా కొనసాగారు. 2024లో జగన్నాథ్ రాజీనామా చేశాక నవీన్ రామ్‌గులామ్ నూతన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. జగన్నాథ్ హయాంలో కుదిరిన ఆర్థిక ఒప్పందాల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ కొత్త ప్రధాని దర్యాప్తునకు ఆదేశించారు.

రైళ్ల పేర్లలో గందరగోళం వల్లే!

ఢిల్లీలో తొక్కిసలాటకు కారణమిదే!.. రైలు రాకపై ప్రకటనతో ప్రయాణికుల తికమక

» 14వ ప్లాట్‌ఫాం నుంచి 16వ ప్లాట్‌ఫాంకు..

» ఒక్కసారిగా పరుగులు తీయడంతో తొక్కిసలాట

» 18కి చేరిన మృతులు.. 12 మందికి గాయాలు



ఆదివారం ప్రయాగ్‌రాజ్ రైల్వే స్టేషన్‌లో భక్తుల రద్దీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట ఘటనకు.. రైళ్ల పేర్లలో చోటుచేసుకున్న గందరగోళమే కారణమని భావిస్తున్నారు. ప్లాట్‌ఫాం పైకి రైలు రాకపై మైకులో రైల్వే సిబ్బంది చేసిన ప్రకటనతో ప్రయాణికులు తికమక పడటం వల్లే తొక్కిసలాట జరిగినట్లు పేర్కొంటున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయడం, ఈ క్రమంలో శనివారం రాత్రి ప్లాట్‌ఫామ్‌ల వద్ద తొక్కిసలాట జరగడం తెలిసిందే. కాగా, ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 18కి చేరింది. వీరిలో 11 మంది మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. మరో 12 మంది గాయపడ్డారు. దీనిపై పోలీసులు ఇప్పటికే దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా.. ప్రయాగ్‌రాజ్ స్పెషల్, ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ అనే రైళ్ల పేర్ల విషయంలో గందరగోళం తలెత్తడం వల్లే ఘటన జరిగిందని భావిస్తున్నారు. వారు చెబుతున్న వివరాల ప్రకారం.. మహాకుంభమేళాకు వెళ్లేందుకు ప్రయాగ్‌రాజ్ స్పెషల్ రైలు 16వ నంబరు ప్లాట్‌ఫాం పైకి వస్తోందంటూ రైల్వే సిబ్బంది మైకులో ప్రకటించారు. అయితే అప్పటికే 14వ నంబరు ప్లాట్‌ఫాం పైకి ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ వచ్చి ఉంది. ఆ రైలు ఎక్కాల్సిన ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఆ ప్లాట్‌ఫాం వద్ద ఉన్నారు. కానీ, సిబ్బంది ప్రకటనతో.. తాము వెళ్లాల్సిన రైలు 16వ ప్లాట్‌ఫాంపైకి వచ్చిందని భావించి ఒక్కసారిగా అక్కడికి పరుగులు తీశారు. దీంతో గందరగోళం చోటుచేసుకొని తొక్కిసలాట జరిగింది. పైగా ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లాల్సిన నాలుగు రైళ్లలో మూడింటి రాక ఆలస్యం కావడంతో ప్రయాణికుల రద్దీ పెరిగిందని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. అయితే రైల్వేశాఖ అధికారులు మాత్రం దీనిని ఖండించారు. కొందరు ప్రయాణికులు 14వ, 15వ ప్లాట్‌ఫాంలపైకి వచ్చేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి దిగుతూ.. కాలుజారి ఇతరులపై పడ్డారని, తొక్కిసలాటకు ఇదే కారణమై ఉంటుందని భావిస్తున్నామని నార్తర్న్ రైల్వే సీపీఆర్‌వో హిమాన్షు ఉపాధ్యాయ్ తెలిపారు. కాగా, ఘటనపై విచారణకు రైల్వేశాఖ ఇద్దరు అధికారులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. తక్షణమే విచారణ ప్రారంభించిన కమిటీ.. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాల్సిందిగా ఆదేశించింది. మరోవైపు తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు రైల్వేశాఖ రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. వారితోపాటు తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడ్డవారికి రూ.1 లక్ష చొప్పున ఇవ్వనున్నట్లు పేర్కొంది. తొక్కిసలాట జరిగిన ప్రాంతమంతా చెల్లాచెదురుగా పడిన ప్రయాణికుల వస్తువులతో హృదయ విదారకంగా మారింది. అక్కడ పడిపోయిన ప్రయాణికుల దుస్తులు, చెప్పులు, వాటర్ బాటిళ్లు, బ్యాగులను రైల్వే సిబ్బంది ఆదివారం తొలగించారు.

ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రి వద్ద విషాద ఛాయలు

మృతుల కుటుంబీకులతో లోక్‌నాయక్ జయప్రకాశ్ ఆస్పత్రి వద్ద విషాద ఛాయలు అలముకున్నాయి. పలువురి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వచ్చి తమ వారి మృతదేహాలను గుర్తించారు. ఏడేళ్ల తన కూతురికి తలలో మేకు గుచ్చుకొని చనిపోయిందంటూ ఓ తండ్రి విలపించాడు. 12 ఏళ్ల తన కుమారుడి మృతదేహాన్ని చూసి మరో తండ్రి కుప్పకూలాడు. తొక్కిసలాట ఘటనను ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ వైఫల్యంగా పేర్కొన్నాయి. ఢిల్లీ రైల్వేస్టేషన్ ఘటన రైల్వేశాఖ వైఫల్యాన్ని, ప్రభుత్వ బాధ్యతా రాహిత్యాన్ని మరోసారి స్పష్టం చేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్నప్పుడు రైల్వేస్టేషన్‌లో సరైన సౌకర్యాలు కల్పించాల్సిందని అభిప్రాయపడ్డారు.

లోకం తీరు



మరణాలపై ఢిల్లీ ఎల్జీ మాట మార్పు

తొలుత మృతులకు సంతాపం.. ఎక్స్‌లో పోస్టు

తర్వాత మరణాల ప్రస్తావన తొలగిస్తూ ఎడిట్

మరణాలను దాచాలనుకున్నారని విమర్శలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట ఘటనలో మరణాలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అరగంట వ్యవధిలోనే మాట మార్చారు. తొక్కిసలాటలో పలువురు చనిపోయారంటూ తొలుత మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటిస్తూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అరగంట తర్వాత ఆ పోస్టును ఎడిట్ చేశారు. మరణాల ప్రస్తావనను తొలగించారు. శనివారం జరిగిన ఈ ప్రమాదంపై స్పందిస్తూ సక్సేనా తొలుత రాత్రి 11.55 నిమిషాలకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఎంతో మంది గాయపడ్డారు. ఇది చాలా బాధాకరం" అని పేర్కొన్నారు. 12.24 గంటలకు ఆ పోస్టును ఆయన ఎడిట్ చేస్తూ.. మరణాల ప్రస్తావనను తొలగించి 'తొక్కిసలాట ఘటన దురదృష్టకరం' అని మార్చారు. ఇది రాజకీయంగా తీవ్ర వివాదాస్పదమైంది. సక్సేనా తన పోస్టును ఎడిట్ చేయడంపై ఆప్ సహా పలు విపక్ష పార్టీలు ఆరోపణలు గుప్పించాయి. తొక్కిసలాట ప్రమాదాన్ని కేంద్రంలో, ఢిల్లీలో అధికారంలో ఉన్న బీజేపీ తక్కువ చేసి చూపించాలని, మరణాలను దాచిపెట్టాలని భావించిందని ఆరోపించాయి. ఎల్జీ సక్సేనా ఎక్స్‌లో తన పోస్టును ఎడిట్ చేయడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నాయి.

అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చెయ్యాల్సిందే!

కాంగ్రెస్, టీఎంసీ, ఆర్జేడీ పార్టీల డిమాండ్

» న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాటపై విచారం

» కుంభమేళాకు అర్థం పర్థం ఉందా ? : లాలూ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) పార్టీలు పేర్కొన్నాయి. తొక్కిసలాట ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం, రైల్వేశాఖ నిర్లక్ష్యం వల్లే ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఘటనతో రైల్వేశాఖ వైఫల్యం మరోసారి బయట పడిందన్నారు. అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయకుంటే కేంద్రమే ఆయనపై వేటు వెయ్యాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియ శ్రీనతే డిమాండ్ చేశారు. తొక్కిసలాట ఘటన రైల్వే శాఖ మూకుమ్మడి వైఫల్యానికి నిదర్శనమని ఆప్ ఆరోపించింది. మహా కుంభమేళాకు బయలుదేరిన ప్రయాణికులు తొక్కిసలాటలో చనిపోవడం బాధాకరమని ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అన్నారు. కాగా, తొక్కిసలాట ఘటన దురదృష్టకరమన్న ఆర్జేడీ అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్.. అసలు మహా కుంభమేళాకు అర్థం పర్థం ఏమైనా ఉందా ?(కుంభ్ కా కోయి మతలబ్ హై.. ఫాల్తూ హై కుంభ్) అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కుంభమేళాపై లాలూ చేసిన వ్యాఖ్యలను బీజేపీ, హిందూ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. లాలూ శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించాయి. మరోపక్క, తొక్కిసలాట ఘటనను కప్పిపుచ్చేందుకు కేంద్రం ప్రయత్నించిందని టీఎంసీ ఆరోపించింది. తొక్కిసలాటలో 18 మంది మరణించారనే వార్త తన హృదయాన్ని కలచివేసిందని పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ పేర్కొన్నారు. మహా కుంభమేళా వంటి కార్యక్రమాల కోసం మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

త్రిభాషా విధానం పేరుతో బ్లాక్ మెయిలా?

» కేంద్ర మంత్రిపై స్టాలిన్ ఆగ్రహం



చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): త్రిభాషా విధానాన్ని అంగీకరించకపోవడం వల్లే తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) పథకం కింద నిధులు విడుదల చేయలేకున్నామంటూ కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ మండిపడ్డారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు రాష్ట్రాలను బ్లాక్ మెయిల్ చేసే ధోరణిలో ఉన్నాయని, రాష్ట్రానికి న్యాయపరంగా అందాల్సిన నిధులనే అడుగుతున్నామేగాని వారి సొంత ఆస్తులను అడగటం లేదని మండిపడ్డారు. రాష్ట్రాలన్నీ త్రిభాషా విధానానికి కట్టుబడి రాజ్యాంగం పరిధిలోకి రావాలని, అప్పుడే నిధులిస్తామని చెప్పడం గర్హనీయమని పేర్కొన్నారు. రాజ్యాంగంలో ఏ సెక్షన్‌లో త్రిభాషా విధానం ప్రస్తావన ఉందో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పగలరా? అని ప్రశ్నించారు. రాష్ట్రాలన్నీ కలిస్తేనే కేంద్రం అని, విద్య ఉమ్మడి జాబితాలోనే ఉందనే విషయం కేంద్రమంత్రి మరచి పోయారని వ్యాఖ్యానించారు. కాశీలో శనివారం జరిగిన కాశీ తమిళ్ సంఘం సమావేశంలో ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ కేంద్రం ప్రతిపాదించిన నూతన విద్యావిధానాన్ని, త్రిభాషా విధానాన్ని అంగీకరిస్తేనే కేంద్రం నుంచి తమిళనాడుకు ఎస్ఎస్ఏ కింద నిధులు విడుదలవుతాయన్నారు. కేంద్రం ఎప్పుడూ తమిళ భాష చదవకూడదని చెప్పటం లేదని, మూడోభాషగా ఒక భాషను అంటే హిందీని అంగీకరించాలని ఒత్తిడి చేయకుండా ప్రతిపాదిస్తున్నదని అన్నారు. ఈ ఏడాది ఎస్ఎస్ఏ కింద తమిళనాడుకు రావాల్సిన రూ.2152 కోట్ల నిధులను కేంద్రం నిలిపివేసింది.

మళ్లీ సంకెళ్లతోనే..

(మొదటి పేజీ తరువాయి)

భారతీయులు కూడా ఇలాంటి ఆరోపణలే చేసిన విషయం తెలిసిందే. ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారులపై దేశ బహిష్కరణ చర్యల్లో భాగంగా తొలి విడతలో ఈ నెల 5న 104 మంది భారతీయులను సైనిక విమానం సీ-17లో వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. రెండో విమానం 116 మందితో శనివారం రాత్రి 11.30 గంటలకు, మూడో విమానం 112 మందితో ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో అమృత్‌సర్‌లోనే దిగాయి. శనివారం దిగిన వారి వివరాలు పరిశీలించిన తర్వాత ఆదివారం సాయంత్రం ఇళ్లకు పంపారు. ఇక ఆదివారం దిగిన వారి వివరాలు పరిశీలించే ప్రక్రియ మొదలైంది. రెండో విడత విమానంలో 65 మంది పంజాబ్, 33 మంది హరియాణాకు చెందినవారు ఎక్కువగా ఉన్నారు. ఇకచ మూడో విమానంలో హరియాణాకు చెందిన 44 మంది, గుజరాత్‌కు చెందిన 33 మంది, పంజాబ్ నుంచి 31 మంది ఉన్నారు. ఇదిలా ఉండగా, రెండో విమానంలో వచ్చిన సిక్కుల్లో ఎవరూ తలపాగా చుట్టుకోలేదు. అందుకు అమెరికా అధికారులు అనుమతించలేదని సిక్కు వలసదారులు తెలిపారు. దీనిపై శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చట్ట ప్రకారం అమెరికాకు తీసుకెళ్తామని చెప్పి, తమ వద్ద పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని ట్రావెల్ ఏజెంట్లు మోసం చేశారని వలసదారులు వెల్లడించారు. డైరెక్ట్ ఫ్లయిట్‌లో అమెరికాకు



పంపిస్తామని ట్రావెల్ ఏజెంట్ నమ్మించి, 'డంకీ రూట్' ద్వారా తీసుకెళ్లారని పంజాబ్‌కు చెందిన దల్జీత్ సింగ్ చెప్పాడు. పిల్లల భవిష్యత్తు బాగుంటుందనే ఆశతో పొలాలు తాకట్టు పెట్టి కొందరు, పొలాలు, పశువులు అమ్మి మరికొందరు తల్లిదండ్రులు ఆ డబ్బుతో అమెరికాకు పంపారు. ఎకరా భూమిని రూ.50-55 లక్షలకు విక్రయించి, అమెరికాకు పంపామని గుర్విందర్ సింగ్ (27) అనే వలసదారు బంధువు తెలిపారు.

ఎయిర్‌పోర్టులోనే ఇద్దరి అరెస్ట్

రెండో విడతలో అమెరికా నుంచి వచ్చినవారిలో ఇద్దరు యువకులు ఓ హత్య కేసులో నిందితులుగా ఉన్నారు. పంజాబ్‌లోని పటియాలా జిల్లా రాజ్‌పురాకు చెందిన సందీప్ సింగ్ అలియాస్ సన్నీ, ప్రదీప్ సింగ్‌లను పోలీసులు విమానాశ్రయంలోనే అరెస్ట్ చేశారు. 2023లో రాజ్‌పురా పోలీస్ స్టేషన్‌లో వారిపై హత్య కేసు నమోదైంది.

సంకెళ్లతో మోదీ కార్టూన్!

తమిళ వెబ్ పత్రిక 'వికటన్'లో ప్రచురణ

బీజేపీ ఫిర్యాదుతో పత్రిక పోర్టల్‌ను నిలిపివేసిన కేంద్ర ప్రసార శాఖ

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అమెరికా నుంచి భారతీయులను సంకెళ్లు వేసి తరలిస్తున్న ఘటనపై ప్రధాని మోదీ మౌనం వహించడాన్ని ప్రశ్నిస్తూ కార్టూన్ ప్రచురించిన తమిళ డిజిటల్ మ్యాగజైన్ 'వికటన్' పోర్టల్ ప్రసారాలు గత రెండు రోజులుగా నిలిచిపోయాయి. ఈనెల 10వ తేదీన వికటన్ వెబ్ మ్యాగజైన్‌లో... అమెరికా అధ్యక్షుడి ముందు ప్రధాని మోదీ సంకెళ్లతో కూర్చున్నట్లు కార్టూన్ ప్రచురితమైంది. ఇది మోదీని కించపరిచేలా ఆ కార్టూన్ ఉందంటూ తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఈనెల 15న కేంద్ర సమాచార శాఖ మంత్రి ఎల్ మురుగన్‌కు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే, ఆ మ్యాగజైన్ పోర్టల్ ప్రసారాలు నిలిచిపోయాయి. వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయడానికి గల కారణాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ సంప్రదిస్తామని మ్యాగజైన్ నిర్వాహకులు పేర్కొన్నారు. వికటన్ వెబ్ పోర్టల్ ప్రసారాలను నిలిపివేయడాన్ని తమిళనాడు సీఎం స్టాలిన్, తమిళగ వెట్రి కళగం పార్టీ నేత, నటుడు విజయ్, కాంగ్రెస్ పార్టీ తమిళనాడు అధ్యక్షుడు సెల్వపెరుంతగై సహా పలువురు తమిళనాడు నేతలు తీవ్రంగా ఖండించారు. బీజేపీ ఫాసిస్టు ధోరణికి ఇదే నిదర్శనమని స్టాలిన్ అన్నారు.

అమెరికా అండ లేకుంటే..

ఉక్రెయిన్ మనుగడ కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

సోమవారానికి (ఫిబ్రవరి 24) నిండా మూడు సంవత్సరాలు. 2022 ఫిబ్రవరి 24న రష్యా దండయాత్ర మొదలైన సంగతి తెలిసిందే. ఈ యుద్ధంలో ఉక్రెయిన్‌ను రష్యా సులభంగా ఓడించేస్తుందని చాలా మంది భావించారు. కానీ.. అమెరికా, యూరప్ దేశాల సహకారంతో ఉక్రెయిన్ తన పోరాటాన్ని కొనసాగిస్తూ వస్తోంది. ఒక దశలో రష్యన్ యుద్ధట్యాంకులను, నల్ల సముద్రంలో రష్యా యుద్ధనౌకలను సైతం డ్రోన్లు, పాశ్చాత్య దేశాలు అందించిన క్షిపణుల సాయంతో నాశనం చేసి తీవ్ర నష్టం కలిగించింది. అంతేనా.. ఉక్రెయిన్ సైనికులు రష్యాకు చెందిన దాదాపు 1500 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని సైతం ఆక్రమించగలిగారు. కానీ అదే సమయంలో రష్యా ఉక్రెయిన్ భూభాగాన్ని గణనీయంగా ఆక్రమించుకోగలిగింది. ముఖ్యంగా ఉక్రెయిన్ తూర్పు భాగంలోని డోన్‌బాస్, కురఖోవ్‌ను ఆక్రమించి ఈశాన్యభాగంలోని పోక్రోవ్‌స్క్ దిశగా రష్యన్ సేనలు కదులుతున్నాయి. అటు దక్షిణాదిన ఇప్పటికే తమ భూభాగంలో విలీనం చేసుకున్నట్టుగా ప్రకటించిన ఖెర్సోన్, జాపోరిజియా, లుహాన్స్క్, డొనెట్స్క్ ప్రాంతాల్లో రష్యా మార్షల్ లా కూడా విధించింది. మొత్తమ్మీద ఈ యుద్ధం మొదలైనప్పటి నుంచి రష్యా తొలి ఆరు నెలల్లో 1,19,000 చదరపు కిలోమీటర్ల మేర ఉక్రెయిన్ భూభాగాన్ని ఆక్రమించిందని అంచనా. 2022కు ముందు ఆక్రమించుకున్న (క్రిమియా, డొనెట్స్క్, లుహాన్స్క్‌లోని కొన్ని ప్రాంతాలు) భూభాగం 42 వేల చదరపు కిలోమీటర్లను కూడా కలుపుకొంటే 1,61,000 చదరపు కిలోమీటర్లు అవుతుంది. ఇది ఉక్రెయిన్ భూభాగంలో దాదాపు 27 శాతం. అయితే, ఆ తర్వాత వీరోచితంగా పోరాడిన ఉక్రెయిన్.. రష్యా ఆక్రమించుకున్న భూమిలో 74,443 చదరపు కిలోమీటర్ల మేర వెనక్కి తీసుకోగలిగింది. అయినప్పటికీ ఉక్రెయిన్ భూభాగంలో 18 శాతం ఇప్పటికీ రష్యా అధీనంలోనే ఉంది. అంతేకాదు.. కర్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్ ఆక్రమించిన తమ భూభాగంలో 40 శాతం దాకా తిరిగి స్వాధీనం చేసుకోగలిగింది. కానీ, ఈ క్రమంలో ఆరున్నర లక్షల మందికిపైగా రష్యన్ సైనికులు ఈ యుద్ధంలో చనిపోయారని ఉక్రెయిన్ చెబుతోంది. తనకున్న అపార వనరులు, ఆయుధ సంపత్తి దృష్ట్యా.. చిట్టెలుకలాంటి ఉక్రెయిన్‌పై గెలవడానికి రష్యా ఇంత ఆపసోపాలు పడుతోందంటే, పూర్తిగా గెలవలేకపోతోందంటే.. అమెరికా, యూరప్ దేశాల మద్దతే అందుకు కారణం. ఆయా దేశాలన్నీ కలిపి ఇప్పటిదాకా ఉక్రెయిన్‌కు ఆర్థికంగా, ఆయుధపరంగా అందించిన సాయం విలువ దాదాపు రూ.25 లక్షల కోట్లు. అందులో దాదాపు రూ.5.7 లక్షల కోట్ల సాయం అమెరికా నుంచే అందింది.



ట్రంప్ వచ్చాక మారిందేంటి?

ఇన్నాళ్లుగా యూరప్ దేశాలతోపాటు తమకు అండగా ఉన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఎన్నికల్లో ఓటమిపాలు కావడం ఉక్రెయిన్‌కు పెద్ద దెబ్బే! ఎందుకంటే.. బైడెన్ హయాంలో ఉక్రెయిన్‌కు అమెరికా.. ఆర్థికంగా గానీ, ఆయుధాల రూపంలోగానీ అందించిన సాయం అపారం. శతఘ్నులు, రాకెట్ అమ్యూనిషన్, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ మిసైల్స్, ఏరియల్ బాంబులను ఉక్రెయిన్‌కు అమెరికా పెద్ద ఎత్తున సరఫరా చేసింది. రెండు ఎఫ్-16 యుద్ధవిమానాలను సైతం గత ఏడాది ఆగస్టులో ఉక్రెయిన్‌కు అమెరికా పంపించింది. ఇలా.. యుద్ధం మొదలైన 2022 ఫిబ్రవరి 24 నుంచి 2025 జనవరి 9 దాకా.. అమెరికా ఉక్రెయిన్‌కు అందించిన సాయం విలువ అక్షరాలా దాదాపుగా రూ.5.7 లక్షల కోట్లు. దిగిపోయే ముందు కూడా బైడెన్ ఉక్రెయిన్‌కు 500 మిలియన్ డాలర్ల ప్యాకేజీ ఇవ్వడానికి ఆమోదం తెలిపారు. ముందుగా చేసిన కేటాయింపుల ప్రకారం మరో 2.25 బిలియన్ డాలర్ల సాయం అమెరికా నుంచి ఉక్రెయిన్‌కు అందాల్సి ఉంది. కానీ.. ట్రంప్ వచ్చాక పరిస్థితి మారింది. పుతిన్‌తో గంటన్నరసేపు మాట్లాడిన ట్రంప్.. నాటోలో ఉక్రెయిన్‌ను చేర్చుకోవడం ప్రాక్టికల్‌గా సాధ్యమయ్యే పని కాదని, యుద్ధంలో పోగొట్టుకున్న భూభాగం మొత్తాన్నీ ఉక్రెయిన్ తిరిగి పొందే అవకాశాలు లేవని వ్యాఖ్యానించారు. బైడెన్ హయాంలో అందించిన మద్దతును కొనసాగించాలంటే.. ఉక్రెయిన్‌లో ఉన్న అత్యంత అరుదైన ఖనిజ నిక్షేపాల్లో 500 బిలియన్ డాలర్ల విలువకు సమానమైన జిర్కోనియం, గాలియం వంటి ఖనిజాలను అమెరికాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ, జెలెన్‌స్కీ అందుకు ఒప్పుకోవట్లేదు. ఒకవేళ ట్రంప్ గనక ఇదే ధోరణిలో వ్యవహరించి బైడెన్ తరహాలో సైనిక సాయాన్ని కొనసాగించకపోతే.. ఉక్రెయిన్ ఈ యుద్ధాన్ని నాలుగు నుంచి ఆరు వారాలకు మించి కొనసాగించలేకపోవచ్చని రక్షణ రంగ నిపుణుల అంచనా. అందుకే.. అమెరికా మద్దతు లేకుంటే ఉక్రెయిన్ మనుగడ కష్టమన్న వాస్తవాన్ని జెలెన్‌స్కీ బహిరంగంగా చెప్పారు!!

- సెంట్రల్ డెస్క్

అమెరికాపై ఆశ లేదు!

డొనాల్డ్ ట్రంప్ హయాంలోని అమెరికాపై యూరప్ ఖండం ఇక ఆశలు పెట్టుకోకూడదని.. తనను తాను రక్షించుకోవడానికి యూరప్ దేశాలు ఇక సొంత సైన్యాన్ని (యూరోపియన్ ఆర్మీ) ఏర్పాటు చేసుకోవాలని జెలెన్‌స్కీ పిలుపునిచ్చారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం వ్యవహారంలో ట్రంప్ యూరప్ దేశాలకు ఒక్క మాట కూడా చెప్పకుండా కొద్దిరోజుల క్రితం పుతిన్‌కు ఫోన్ చేసి గంటన్నరసేపు మాట్లాడడం.. ఆ తర్వాత నుంచి ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తుండడం వంటి పరిణామాల నేపథ్యంలో జెలెన్‌స్కీ ఈ పిలుపునిచ్చారు. "మనం నిజాయతీగా మాట్లాడుకుందాం. యూరప్ భద్రతకు ప్రమాదకరంగా పరిణమించే అంశాల్లో సాయం చేయడానికి అమెరికా నో చెప్పవచ్చు. కాబట్టి, యూరప్ సాయుధ దళాల ఏర్పాటుకు ఇదే సరైన సమయమని నేను బలంగా నమ్ముతున్నాను" అని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు.. ఉక్రెయిన్‌కు చోటు లేకుండా, తమ వెనకాల జరిగే ఒప్పందాలను తాము ఎన్నటికీ ఒప్పుకోబోమని ఆయన తేల్చిచెప్పారు. "ఉక్రెయిన్ లేకుండా ఉక్రెయిన్‌పై ఎలాంటి నిర్ణయాలూ తీసుకోలేరు. యూరప్ (ప్రాతినిధ్యం) లేకుండా యూరప్‌పై ఎలాంటి నిర్ణయాలూ తీసుకోలేరు" అని స్పష్టం చేశారు. నిజానికి యూరప్ దేశాలు కూడా ట్రంప్ తీరుతో ఇప్పటికే అప్రమత్తమయ్యాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ నేతృత్వంలో పలు దేశాలు భేటీ అయి ఈ అంశంపై చర్చించాయి. త్వరలో సౌదీఅరేబియాలో రష్యా-ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య శాంతి చర్చలు ఏర్పాటు చేయనున్నట్టు ట్రంప్ యంత్రాంగంలోని సీనియర్ అధికారులు ప్రకటించడం... తమ ప్రమేయం ఏమీ లేకుండా శాంతి చర్చలు జరగడం యూరప్ దేశాలకు మింగుడుపడట్లేదు.



తిరుపతి స్కావెంజర్స్ కాలనీలో ఓ ఇంటి గోడపై బొమ్మలను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ మౌర్య

విచిత్రాల వీధులు

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 300కు పైగా కుటుంబాలు నివసిస్తుండగా, ఇందులో సగానికి పైగా మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే పారిశుధ్య కార్మికులే. ఊరంతా శుభ్రం చేసే కార్మికులుండే ప్రాంతం కూడా అందంగా, శుభ్రంగా ఉండాలని కమిషనర్ భావించారు. స్మార్ట్ సిటీ-స్వచ్ఛ సర్వేక్షణ్ నిధులతో మురికివాడకు రంగులు వేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ అందమైన రంగులను వేయించారు. దీంతో స్కావెంజర్స్ కాలనీ సరికొత్త రంగులద్దుకుంది. ఇరుకిరుగ్గా సున్నం కూడా లేకుండా ఉండే ఇళ్ల గోడలపై హరివిల్లులు రూపుదిద్దుకున్నాయి. తాజాగా ఆదివారం స్కావెంజర్స్ కాలనీలో కమిషనర్ మౌర్య పర్యటించి బొమ్మలు వేసేవారికి కొన్ని సలహాలు ఇచ్చారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నాడు ఇలా..!



నేడు కళ.. కళ..!





పవన్ కల్యాణ్‌తో రాజేంద్రప్రసాద్ భేటీ



అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ఉదయం మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో వారు సమావేశమై సినిమా, రాజకీయ అంశాలపై చర్చించారు. అనంతరం పవన్ కల్యాణ్‌ను రాజేంద్రప్రసాద్ శాలువాతో సత్కరించారు.


విష్ణు దంపతులతో వెంకయ్యనాయుడు, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు లోకేశ్, నారాయణ, ఆనం, ఇతర నేతలు

ఘనంగా వెంకయ్య మనవడి వివాహ రిసెప్షన్

- హాజరైన హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, మంత్రి లోకేశ్

వెంకటాచలం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడు, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీప, వెంకట్‌రావు దంపతుల కుమారుడు విష్ణు, సాత్విక వివాహ రిసెప్షన్ ఆదివారం నెల్లూరు జిల్లా వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి సహా పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించారు.


సదస్సులో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నరసం ప్రతినిధులు

కొత్త జిల్లాలకు మహిళా ప్రముఖుల పేర్లు పెట్టాలి

- నరసం రాష్ట్ర సదస్సులో వక్తల విజ్ఞప్తి

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత దిశగా ముందుకు వెళుతున్న రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో కొన్ని జిల్లాలకైనా ఆ ప్రాంత మహిళా ప్రముఖుల పేర్లు పెట్టాలని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) 7వ రాష్ట్ర సదస్సులో పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. కర్నూలు జిల్లా కేంద్రంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం నరసం సప్తమ వార్షికోత్సవంగా సందర్భంగా రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. కొత్త జిల్లాలకు స్థానిక మహిళా ప్రముఖుల పేర్లు పెట్టడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సాహిత్య రంగంలో 50 శాతం పదవులు మహిళలకు కేటాయించాలని కోరారు. అలాగే ఉగాది, గిడుగు, గురజాడ పురస్కారాలను పునరుద్ధరించి, మహిళలకు అవార్డులు అందజేయాలని కోరారు. హంస అవార్డుల్లో 50 శాతం మహిళలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా, మహిళల సంరక్షణకు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, నరసం వ్యవస్థాపక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తేళ్ల అరుణ, పాతూరి అన్నపూర్ణ పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ వర్సిటీల విలీనం?

- కూటమి ప్రభుత్వం పరిశీలనలో ప్రతిపాదన
- అధ్యయనానికి త్వరలో నిపుణుల కమిటీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో వేర్వేరుగా ఉన్న వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశువైద్య విశ్వవిద్యాలయాలను విలీనం చేసే ప్రతిపాదనను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ నాలుగు వర్సిటీలు ఒకే గొడుగు కింద ఉంటే వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు, మత్స్య, పాడి రైతులకు అందే పరిశోధన ఫలితాల మధ్య అంతరాలను తొలగించే అవకాశం ఉంటుందని భావిస్తోంది. వర్సిటీల ఏకీకరణపై మేనేజ్‌మెంట్, ఇతర విభాగాల అధికారుల నుంచి సూత్రప్రాయంగా అభిప్రాయాలు సేకరించినట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఉద్యాన పరిశోధన విభాగాన్ని విడదీసి, పశ్చిమగోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలో ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం వ్యవసాయ వర్సిటీని గుంటూరు సమీపంలోని లాంలో నెలకొల్పారు. తిరుపతిలో పశువైద్య వర్సిటీ ఉండగా, దాని నుంచి గత ప్రభుత్వం మత్స్య విభాగాన్ని విడదీసి, నరసాపురం వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు గెజిట్ జారీ చేసింది. కానీ వర్సిటీకి తగిన భవనాలు నిర్మించలేదు. పరిపాలన విభాగాన్ని విజయవాడలోని అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు. నాలుగు వర్సిటీలకు వేలాది ఎకరాల భూములు, భవనాలు, వేలాది మంది ఉద్యోగులు ఉన్నా అయితే ఇవి వేర్వేరుగా ఉండటంతో ప్రభుత్వానికి ఆర్థిక భారం కావడంతో పాటు వాటి మధ్య సమన్వయం లోపిస్తోంది. ఈ నేపథ్యంలో వర్సిటీల ఏకీకరణ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ, ఉద్యాన వర్సిటీలను విలీనం చేసి, మత్స్య, పశువైద్య వర్సిటీలను యథావిధిగా కొనసాగించాలని కొందరు వాదిస్తున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు నిర్వహించిన వ్యవసాయ అనుబంధ శాఖల సమీక్షలో విలీన అంశం ప్రస్తావనకు వచ్చింది. దీనిపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. ముందుగా నిపుణుల కమిటీ వేసి, అధికారికంగా అభిప్రాయాలు సేకరించి, తదుపరి చట్టబద్ధంగా నిర్ణయం తీసుకునే అంశాన్ని ప్రభుత్వ పెద్దలు పరిశీలిస్తున్నారు. కాగా, వ్యవసాయ వర్సిటీలో సహజ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని ఉత్తర కోస్తాలో ఏర్పాటు చేయాలని, అటవీ విద్యల్లో యువతకు నైపుణ్యం కల్పించేలా ప్రకాశం జిల్లాలో కళాశాల, పరిశోధన సంస్థను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. ఇక ఉద్యాన వర్సిటీ కింద అనంతపురంలో ఔషధ, సుగంధ ద్రవ్యాల పరిశోధన కేంద్రం, విజయనగరం/ విశాఖలో ప్లాంటేషన్ పంటలపై పరిశోధన కేంద్రం, చిత్తూరులో డెయిరీ విద్యకు కళాశాల, పరిశోధన స్థానం, శ్రీకాకుళంలో రొయ్యలు, ఉప్పునీటి మత్స్య పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

కళ్లెదుటే నీరున్నా కరువే..!

- విభజన తర్వాత దిగువ రాష్ట్రంగా చాలా కోల్పోయాం
- 89 ప్రాజెక్టుల్లో 980 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్నా.. ఇంకా కోటి ఎకరాలకు సాగునీరు ఇవ్వలేక పోతున్నాం
- పోలవరం, బనకచర్లతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం
- 'ఆలిండియా వాటర్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్'లో గళం విప్పనున్న ఏపీ
- ఉదయ్‌పూర్ వేదికగా రేపు, ఎల్లుండి సదస్సు

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కళ్లెదుటే నీరున్నా.. తమది కరువు పరిస్థితేనని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. ఇదే విషయాన్ని రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించనున్న 'ఆలిండియా స్టేట్ వాటర్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్' దృష్టికి తీసుకురానుంది. 2047 నాటికి నీటి సురక్షిత దేశంగా భారత్' అనే థీమ్‌తో రెండు రోజులపాటు సాగే ఈ జాతీయ స్థాయి సదస్సు మంగళవారం మొదలవుతుంది. ఆఖరి రోజైన బుధవారం రాష్ట్రం తరఫున నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విభజనతో మిగిలిన విభాగాల తరహాలోనే జలాల్లోనూ తీవ్రంగా నష్టపోయామని కేంద్రం దృష్టికి తీసుకురానున్నారు. రాష్ట్రంలో నాలుగు కోట్ల ఎకరాలకు నీరందించే వీలున్నా.. రెండు కోట్ల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించగలుగుతున్నామని, మరో కోటి ఎకరాలకు సాగునీరందించేందుకు కృషి చేస్తున్నామని వివరించనున్నారు. రాష్ట్రంలో 89 ప్రాజెక్టుల్లో 980 టీఎంసీల జలాలను నిల్వ చేస్తున్నామని.. భూగర్భ జలాలను పెంచే విధానాలను అమలు చేస్తున్నామని చెప్పనున్నారు. ఎగువ రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల్లో కృష్ణా, గోదావరి జలాల నిల్వలు ఉన్నా.. దిగువ రాష్ట్రంగా ఏపీకి వచ్చేసరికి జలాల కొరత కనిపిస్తోందని వివరించనున్నారు. రాష్ట్రానికి కరువు, వరదలు కూడా ఎక్కువేనని.. అతివృష్టి, అనావృష్టిలతో తరచూ తీవ్రంగా నష్టపోతున్నామని కేంద్రం దృష్టికి తీసుకురానున్నారు. రాష్ట్రంలో సాగునీటి పారుదలను పెంచేలా పోలవరం ప్రాజెక్టు, గోదావరి-కృష్ణా నదుల అనుసంధాన పథకం బనకచర్లను పూర్తి చేస్తామని చెప్పనున్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా గోదావరి జలాలను తరలిస్తామని, రాయలసీమ ప్రాంతానికి కృష్ణా జలాలను పూర్తిగా తరలించి కరువు సీమను సస్యశ్యామలం చేసేలా కార్యాచరణను రూపొందిస్తున్నామని వివరించనున్నారు.



సరుబుజ్జిలి మండలం వెన్నలవలసలో మాట్లాడుతున్న వీఎస్ కృష్ణ

'థర్మల్'తో అభివృద్ధి.. బూటకమే!

- భావితరాలను కాపాడుకోవాలంటే పవర్‌ప్లాంట్ నిర్మాణ ప్రయత్నాన్ని విరమించుకోవాలి
- మానవ హక్కుల వేదిక కన్వీనర్ వీఎస్ కృష్ణ

శ్రీకాకుళం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): థర్మల్ పవర్ ప్లాంట్‌తో అభివృద్ధి అని చెప్పడం బూటకమని మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త వీఎస్ కృష్ణ పేర్కొన్నారు. మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జగన్నాథం, ప్రచారకర్త అనూరాధతో కలిసి శ్రీకాకుళం జిల్లాలోని థర్మల్ పవర్ ప్రాజెక్టు ప్రతిపాదిత గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధి వెన్నెలవలస, మసనపుట్టి, బొట్లపాడు, తిమ్మిడం, జంగాలపాడు గ్రామాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. అనంతరం వీఎస్ కృష్ణ మాట్లాడుతూ.. 'పంట భూములతో ఉన్న ఆదివాసీ ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ తెచ్చి మానవాళి మనుగడకు ప్రమాదం కల్పించొద్దు. ప్రపంచ దేశాలు 2050 నాటికి థర్మల్ పవర్ ప్లాంట్లను మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ సమయంలో థర్మల్ పవర్ ప్లాంట్‌ను తీసుకొస్తానని స్థానిక(ఆమదాలవలస) ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రకటించడం హాస్యాస్పదం. కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్ వంటి విషతుల్య కర్బన ఉద్గారాలను వెదజల్లే థర్మల్ ప్లాంట్‌తో అభివృద్ధి సాధ్యమని ఎలా చెప్పగలరు' అని ప్రశ్నించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. రాబోయే ప్రమాదాన్ని ముందుగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. భావితరాలను కాపాడుకోవాలంటే పవర్ ప్లాంట్ ఈ ప్రాంతంలో నిర్మించే ప్రయత్నాన్ని పాలకులు విరమించుకునేంత వరకు ప్రజలు పోరాటానికి ముందు వరుసలో ఉండాలని కోరారు.

చెందుర్తిలో బర్డ్‌ఫ్లూ కలకలం!

- కోళ్లఫాంలో 1,500కి పైగా కోళ్లు మృత్యువాత
- అధికారులకు సమాచారమివ్వని నిర్వాహకుడు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తిలో బర్డ్‌ఫ్లూ కలకలం రేగింది. గ్రామ శివారులోని పుష్కర కాలువ గట్టుపై బోనబోయిన కృష్ణకు చెందిన కోళ్లఫాంలో 1,500కి పైగా కోళ్లు చనిపోయాయి. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఇక్కడ ఐబీ కంపెనీకి చెందిన 2,500 కోళ్లను పెంచుతున్నారు. విషయం తెలుసుకున్న కంపెనీ ప్రతినిధులు వచ్చి నమూనాలు తీసుకెవెళ్లినట్టు చెబుతున్నారు. అయితే కోళ్లు చనిపోయిన విషయంపై కోళ్లఫాం నిర్వాహకుడు అధికారులకు సమాచారం ఇవ్వలేదు. గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది నుంచి సమాచారం అందుకున్న రెవెన్యూ ఉన్నతాధికారులు అప్రమత్తమై పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించారు. గొల్లప్రోలు ఏరియా ప్రభుత్వ పశువైద్యశాల ఏడీ శ్రీనివాసరావు ఆదివారం రాత్రి ఘటనా స్థలానికి వెళ్లారు. కోళ్లకు బర్డ్‌ఫ్లూ లక్షణాలున్నాయా, లేక మరేదైనా వ్యాధితో చనిపోయాయా అనే విషయం పరీక్షల అనంతరమే పూర్తిస్థాయిలో వెల్లడవుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, ఇద్దరు కుమారులు మృతి

రాజుపాలెం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం నెమలిపురి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, ఇద్దరు కుమారులు మృతి చెందారు. ప్రమాదంలో ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ నజీమ(46), ఆమె కుమారులు షేక్ నూరుల్లా(26), షేక్ హబీబుల్లా(24) మృతి చెందారు. నూరుల్లా భార్య నస్రీన్ సీమంతం కావడంతో హైదరాబాద్ నుంచి కారులో చీమకుర్తి వైపు వస్తున్నారు. మార్గమధ్యలో నెమలిపురి వద్ద ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ డివైడర్‌ను ఢీకొని కారుపై పడటంతో కారు నుజ్జునుజ్జయింది. అందులో ఉన్న తల్లి, చిన్న కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నూరుల్లాను చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. రాజుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివిధ

vividha@andhrajyothy.com సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

అనువాద నవలల ఆవిష్కరణ

చింతపట్ల సుదర్శన్ అనువాదం చేసిన ముల్క్‌రాజ్ ఆనంద్ 'అంటరానివాడు', ఆర్.కె. నారాయణ్ 'మాల్గుడి' నవలల ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 17 సా.6 గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ పుస్తకాలను ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు, ఆర్.వి రామారావు ఆవిష్కరిస్తారు. అధ్యక్షత కవి యాకూబ్. మామిడి హరికృష్ణ, కె.పి. అశోక్ కుమార్, ఏనుగు నరసింహారెడ్డి, కె. ఆనందాచారి, కొండపల్లి నీహారిణి ప్రసంగిస్తారు.

పాలపిట్ట బుక్స్

వట్టికోట నవలపై సదస్సు

తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి' నవలపై 'అజరామర అక్షరం' పేరిట పరామర్శ సదస్సు ఫిబ్రవరి 23 ఉ.10గంటలకు కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరుగుతుంది. ప్రధాన వక్త సంగిశెట్టి శ్రీనివాస్. నగునూరి శేఖర్, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం ఇతర వక్తలుగా ప్రసంగిస్తారు.

సి. వి. కుమార్

వేటకథలపై సదస్సు

సాహిత్య అకాడెమీ-స్ఫూర్తి సాహితీ సమాఖ్య, యానాం సంయుక్త నిర్వహణలో 'వేట కథలు' సదస్సు ఫిబ్రవరి 23 తేదీ ఉ.10గంటల నుంచి సర్వశిక్షా అభియాన్ సమావేశ మందిరం, హైస్కూల్ రోడ్, యానాంలో జరుగుతుంది. స్వాగతం చింతకింది శ్రీనివాసరావు, అధ్యక్షోపన్యాసం సి. మృణాళిని, ముఖ్య అతిథి ఆర్. మునిస్వామి, గౌరవ అతిథి దాట్ల దేవదానం రాజు. అల్లం శేషగిరిరావు కథలపై వాసిరెడ్డి నవీన్, జె.పి. వైద్య కథలపై అవధానుల మణిబాబు, పతంజలి కథలపై జె. నీరజ, పూసపాటి కృష్ణరాజు కథలపై మందలపర్తి కిషోర్, ఇతర రచయితలు రాసిన వేట కథలపై అద్దేపల్లి ప్రభు ప్రసంగిస్తారు.

సాహిత్య అకాడెమీ

కొలకలూరి పురస్కారాల ఫలితాలు

కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారానికి జూకంటి జగన్నాథం ('ఒక కప్పు చాయ్ - నాలుగు మెసేజ్‌లు'), కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారానికి టేకుమళ్ళ వెకంటప్పయ్య ('స్వర్గాదపి గరీయసీ'), కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారానికి గడ్డం మోహన్ రావు ('చిందోళ్ళ చరిత్ర, సంస్కృతి -సాహిత్యం') ఎంపికయ్యారు. వీరు ఒక్కొకరూ రూ.15 వేల నగదు బహుమతితో సత్కారాన్ని అందుకుంటారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 26న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

కొలకలూరి ఇనాక్

జీవనానందమైన కవిత్వం

కవిత్వమే ఒక జ్వరమై నిలువెల్లా కుదిపేసిన రోజులు, మళ్ళీ ఆ కవిత్వమే మందై ఊరడించిన రోజులు కవిత్వ ప్రేమికులందరి జీవితాల్లోనూ ఉంటాయి. అట్లాంటి అనుభవాలే ఇంకా ఇంకా ఆకలిగా కొత్త కవిత్వాలను వెదుక్కునేలా చేస్తాయి. రాసేలా చేస్తాయి. "నీకై బ్రదుకే ఒక తపమై వెదుకాడా"నంటాడు శ్రీశ్రీ అట్లాంటి పలవరింత లోనే. కానీ ఏమిటా కవిత్వం, ఎప్పటిది? పసివయసు సంభ్రమపు కళ్ళను కట్టి కూర్చోబెట్టిన అక్షరాలెవరివి? యవ్వనోద్రేకాల హృదయాన్ని ప్రేమ మంత్రాలై శాంతింపజేసిన పాదాలెవరివి?



అక్షరాల పొత్తిళ్ళలోనే జీవితం మళ్ళీ దొరకనుందని నమ్మకం కలిగించిన క్షణాలను, తీర్పరితనాలు ఎరుగని తోడై అక్షర మొక్కటే సేదతీర్చిన క్షణాలను కానుకిచ్చిన కవులు ఎవరు? 'మాటలనియెడి మంత్ర మహిమ' తెలియకుండానే ఉద్వేగాలను కాగితం పైకి నెట్టుకుని కవిత్వంగా మలచుకున్న సందర్భాల సౌందర్యం ఎట్లాంటిది?

ఒక్కొక్క పుటా తిరగేస్తుంటే కాలాలు మెలిపడిపోయి, ఒక్కొక్క ముడిలో ఒక్కొక్క జ్ఞాపకం తగిలి పాఠకులను మంత్రముగ్ధుల్ని చేసే పుస్తకం ఎన్. వేణుగోపాల్ గారి 'కవిత్వంతో ములాఖాత్'. రాజకీయార్థ విశ్లేషకుడిగా పిలిపించుకోవడం తనకిష్టమని చెప్పుకునే వేణుని ఈ పుస్తకం కవిగానూ, కవిత్వ ప్రియుడిగానూ సరికొత్తగా పరిచయం చేస్తుంది. ఊహ తెలిసిన నాడే చెవిన పడ్డ భక్తి కవిత్వాలు మొదలు విద్యార్థి దశలో ప్రభావితం చేసిన రాజకీయ కవిత్వం దాకా; ప్రాచీన కవిత్వం నుండి పాశ్చాత్య దేశాల కవిత్వం దాకా; ప్రభావాల నుండి పశ్చాత్తాపాల దాకా; రాయకుండా ఉండలేకపోయిన క్షణాల నుండి రాయని కవితల దాకా; కోపాల నుండి కన్నీళ్ళ దాకా... ఈ పుస్తకం ఒక ఉద్వేగాల పుట్ట.


ఒక గొప్ప కవిత తన మనసులో ఎలా అంకురించిందో కవి చెప్పలేకపోవచ్చునేమో కానీ, తనకు రససిద్ధి కలిగించిన కవితను తొలిసారి చదివిన క్షణాలను పాఠకుడు అంత త్వరగా మర్చిపోడు. ఆ ఉద్వేగభరితమైన క్షణాలను ఇతరులతో పంచుకునే ప్రయత్నం చేసినప్పుడు, ఆ కవితలోని బలమేమిటో స్పష్టమవడం ఒక్కటే కాకుండా, ఆ కాసిన్ని అక్షరాలతో ఒక మనిషి మరొక మనిషి మీద నెరపిన ప్రభావం కూడా అర్థమై, రాత అన్న ప్రక్రియ మీద గౌరవమూ ప్రేమా పెరుగుతాయి. ఈ సంపుటిలో వేణు ప్రస్తావించిన కవితలన్నిటి వెనుకా బలమైన జీవన నేపథ్యముంది. ఆయా కవితల నుండి విడదీసి చూడలేని సామాజిక రాజకీయ లేదా వ్యక్తిగత సందర్భముంది. రహస్యంగా తన జీవితం మొత్తాన్నీ పెనవేసుకున్న కవిత్వోద్వేగాన్ని ఒక మనిషి పునశ్చరణ చేసుకోవడముంది. ఎన్ని సందర్భాలు వేణుకి కవిత్వమూ జీవితమూ వేరు కాదని చెప్పాయో, అంతకన్నీ నిరూపించాయి కూడా.

పుస్తకంలో పంజాబీ కవి అవతార్ సింగ్ పాష్ గురించి రాసిన వ్యాసంలో- న్యూయార్క్ వీధుల్లో, ఒక టాక్సీలో డ్రైవర్‌తో మొదలైన మామూలు సంభాషణ కవిత్వంలోకెలా మళ్ళిందో, వాళ్ళు ఇద్దరూ కలిసి తమకు ఇష్టమైన కవిని ఎలా స్మరించుకున్నారో, ఎంత ఉద్వేగానికి లోనయ్యారో, ఒళ్ళు గగుర్పొడిచే కథనంతో రాసుకొస్తారు వేణు. "సబ్ సే కతర్నాక్ హోతా హై హమారే సప్నోఁ కా మర్నా" (మన కలలు చనిపోవడం అన్నిటి కన్నా ప్రమాదకరం) అని ఒక కవి రాసిన గీతాన్ని ఇట్లా అపరిచితులు గొంతు కలుపుకుంటూ పరాయి దేశంలో పాడుకోవడం కవికీ కవిత్వానికీ ఎట్లాంటి గౌరవం!

కైఫీ ఆజ్మీ కవిత్వం గురించి రాసిన వ్యాసం కూడా అట్లాంటిదే. కవిత్వమొక్కటే కాదు, దాని చుట్టూ ఉన్న జీవితం కూడా ఈ వ్యాసాల్లో కుదురుకున్నందుకేమో, ఈ పుస్తకం మామూలు కవిత్వ పుస్తకాల్లా అంతా ఒకేసారి చదవలేమనే ఇబ్బంది కలిగించదు. విప్లవం కూడా సరిగ్గా ప్రేమలానే ఒక కవితాత్మక భావన అన్న వాక్యానికి ఈ పుస్తకంలో దొరికిన వివరణ, తొలియవ్వన కాలాల్లోని విలువలను, ఆదర్శాలనూ మళ్ళీ కళ్ళ ముందుకు తెచ్చి హృదయాన్ని బరువెక్కిస్తుంది. అట్లానే వ్యాసాల్లో ఎక్కడికక్కడ కూర్చిన కవితల ఎంపిక, ఆ కవితల్లోని అందం రీడబిలిటీకి అదనపు బలం. కైఫీదే 'ముద్దు' అన్న కవిత:

"ఈ సౌందర్యభరితమైన కళ్ళను ముద్దాడినప్పుడల్లా
కటికచీకటిలో వందల దీపకళికలు వెలుగుతాయి
పూలూ, మొగ్గలూ, జాబిల్లీ,
నక్షత్రాలూ మాత్రమే కాదు
ప్రత్యర్థి కూడా ఆమె పాదాల
ముందు మోకరిల్లుతాడు."

ఒక నచ్చిన కవిత కోసం వెదుక్కోవడం, ప్రత్యేకించి అది వేరే దేశానిదైతే ఈ వెబ్ సెర్చ్ కాలాలకు ముందు ఆ వెదుకులాటలో ఉన్న తపన, ఆ వెదికింది దొరికితే అందే మహదానందం, నెరుడా మీద రాసిన వ్యాసంలో కనపడుతుంది. నెరుడా 'పోస్ట్‌మాన్' కథ కూడా వేణు అనువాదం చేశారు. అది నవలికే కానీ ఆ చిన్నపుస్తకం నిండా పరుచుకున్న కవిత్వ సౌందర్యానికి, శక్తికీ ఇది కూడా ఈ సంపుటిలో చేర్చవలసిన విషయమే.



గంభీరంగా చెప్పాలన్న ఆకాంక్షవల్లో ఏమో తెలుగు సాహిత్యంలో కవిత్వ విమర్శ, పరామర్శ కూడా చాలాసార్లు రసహీనంగా ఉంటాయి. రచనకు ఎడంగా నిలబడి పరామర్శించడం లోని నిష్పాక్షికత కన్నా, రచనతో మమేకమై పొందే అనుభవాన్ని పంచుకునే నిజాయితీ ఏ రకంగానూ తక్కువ కాదని ఈ పుస్తకం చదివితే నాకు అనిపించింది.

> **తెలుగులో ప్రస్తుతం, స్నేహితులైనందుకు తప్పక వెల్లడయ్యే పొగడ్తలున్నాయి. భావజాలానికి భిన్నంగా ఉన్నందుకు వచ్చిపడే విమర్శలున్నాయి. కానీ, సాహిత్య సందర్భాన్ని పంచుకుంటూ సాహిత్యం మీద ప్రేమ పెంచే పుస్తకాలు ఇప్పటి అసలు సిసలు అవసరం. కవిత్వం అర్థం కాని పదార్థమై జనాలకు ఎడమైపోకుండా ఉండాలంటే, కవిత్వంతో ముడిపడ్డ జీవితం మొత్తాన్నీ అక్షరబద్ధం చేసి ఉత్సవం చేసుకున్న ఇలాంటి పుస్తకాలు రావాలి.**

అనువాదాలేమిటీ, వార్షిక కవిత్వ సంకలనాలేమిటీ, 'పోయమ్స్ దట్ మేక్ గ్రోన్ మెన్ క్రై' లాంటి పుస్తకాల హృదయమేమిటీ - ఈ 'కవిత్వంతో ములాఖాత్' ఎన్నెన్ని విశేషాలను సహృదయస్పందన అన్న దారానికి కట్టిచూపిందో లెక్కే లేదు. 'సృజన' పత్రిక, బెజవాడ రోజులు ఒక తరం సాహిత్య చరిత్రను చెప్పినట్టే ఉన్నాయి. ఒక మాట నుండి ఇంకో మాటకి, ఒక కవిత నుండి ఇంకో కవితకి, ఇంకో పుస్తకానికి, అలవోకగా పాఠకుడిని లాక్కెళ్ళింది ఈ పుస్తకం. ఊరికే తీసుకువెళ్ళడమే కాదు, పాఠకుడు తాను స్వయంగా ఇవన్నీ వెదుక్కుని చదివేందుకు సమాయత్తపరచింది.

ఎందుకు ఇవన్నీ చెప్పుకోవాలి, నచ్చిన కవితలను ఎందుకు మననం చేసుకోవాలి? ప్రభావాలను గమనించుకోవడం, వాటిని వేణులా హృదయం పరిచి పంచుకోవడం సృజనాత్మకతను తట్టి లేపడానికి అతి సులభమైన, అత్యంత ప్రభావవంతమైన మార్గాలు. రాసుకోవడానికి జీవితం ప్రసాదించే వేల సందర్భాలను ఉదహరిస్తూ, "రాయాలి" అన్న ఊహనివ్వడం, "రాయగలను" అన్న నమ్మకాన్నివ్వడం మామూలు విషయాలు కావు. కవితలను జ్ఞాపకాల దీపకాంతిలో ఎత్తి చూపిస్తూ, ఏ వ్యక్తీకరణల్లో ఏ కొత్తదనం గల్లంతు చేసిందో గమనించుకోవడం రాసేవాళ్ళకు మరీ ఉపయోగకరం. ఆ రకంగా, ఈ పుస్తకం ఒక అధ్యయన గ్రంథం. కవిత్వం రాయడానికి పాఠాలు, ప్రత్యేకంగా క్లాసులు ఉండవు. ఉన్నా అవేం పని చేస్తాయన్న ఆశ నాకైతే లేదు. కవిత్వంతో ఈ తరహాలో మమేకమవ్వడం ఒక్కటే దానికి మార్గం.

తెలుగులో ప్రస్తుతం, స్నేహితులైనందుకు తప్పక వెల్లడయ్యే పొగడ్తలున్నాయి. భావజాలానికి భిన్నంగా ఉన్నందుకు వచ్చిపడే విమర్శలున్నాయి. కానీ, సాహిత్య సందర్భాన్ని పంచుకుంటూ సాహిత్యం మీద ప్రేమ పెంచే పుస్తకాలు ఇప్పటి అసలు సిసలు అవసరం. కవిత్వం అర్థం కాని పదార్థమై జనాలకు ఎడమైపోకుండా ఉండాలంటే, కవిత్వంతో ముడిపడ్డ జీవితం మొత్తాన్నీ అక్షరబద్ధం చేసి ఉత్సవం చేసుకున్న ఇలాంటి పుస్తకాలు రావాలి. దేశాలకూ భాషలకూ అతీతంగా మనుషులను ఏకం చేసే కళను, పొంగిపోయే హృదయంతో ఇట్లా స్మరించుకోవడం తెలియాలి. సుకవి జీవించు ప్రజల నాల్కల యందు అన్న మాటలను నోరు విప్పి నిజం చేయడం కావాలి. మన మన ఏకాంత మందిరాల్లో, నవ్వుల్లో, నిస్సత్తువగా సోలిపోయిన నీరసపు క్షణాల్లో, నిరసనల్లో, స్నేహాల్లో, ప్రేమల్లో - అమాంతం వచ్చి హత్తుకునే కవిత్వ పాదాలకు మొక్కి ఇట్లా, గుండెల మీదే ఉండనివ్వాలి.

■ **మానస చామర్తి**

manasa.chamarthi@gmail.com



కలస్వనం

మాట్లాడుకోవాల్సింది చానా వుండి
మౌనం సమాధి పలకల సాంద్రమైంది

దిగులు చీకటి
రెక్క విచ్చుకుని వాలింది
ఒంటరి వృక్షం కొమ్మకొమ్మనా
జ్ఞాపక పిచుకల పలవరింతలు
సద్దు పరిచే దిమ్మిస చప్పుళ్ళ
విస్కీ వగరు చప్పరింతలు
విఫల యత్నాలు

రేపటి సూర్యుడు
దీప ఖడ్గాన్ని బూని
మిత్రహరితం పొట్లం కట్టి తెచ్చాడు
విప్పదీయ
నిన్న లేనిదేదో వుండి
దినాన్ని దినుసుమీఱ చేస్తుంది
జీవ జవం కూడదీసుకుని
కొత్త చివురు వేయ

పలుకు తీపి పలుకులాయే
మరి
అది
నీతో నువ్వయినా!

■ **పిన్నంశెట్టి కిషన్**

© 97002 30310

నా మొదటి పుస్తకం

బివివి ప్రసాద్


"ప్రభూ! నిన్ను సేవించుదామని ఎన్నో సుందర పుష్పాలు ఏరి తెచ్చాను. తుదకు వాటి సౌందర్యంపై మోహంతో నిన్నే విస్మరించాను" చలం అనువదించిన టాగోర్ కవిత్వం చదువుకున్నాక రాసుకున్న వాక్యాలివి.



కవిత్వం పలికితే రాయటమే గానీ, పనిగట్టుకు రాయటం లేదు. ఇంటర్ చదివే రోజుల్లో సహజంగా ఉండే ఉద్రేకాలతో పాటు, శ్రీశ్రీ, సామ్యవాద సాహిత్యాల ప్రభావంతో సమాజాన్ని మార్చాలనే ఆవేశంతో రాస్తున్న కవితలు, టాగోర్‌ని చదివాక ఆగిపోయినట్టున్నాయి. బయటి చూపు లోపలికి మళ్ళాక, మారాల్సింది నేను అనిపించాక, రాసుకొనే కవిత్వం మారింది. దైవం, ప్రకృతి, మృత్యువు, ప్రేమ వంటి ఉదాత్తభావాలు కవితా వస్తువులయాయి.

బయటి చూపు లోపలికి మళ్ళాక రాసుకున్న కవితలు

డిగ్రీ చివర్లో, 1986లో చలం రాసిన 'భగవాన్ స్మృతులు' పుస్తకం దొరికింది. ఒక ఆధ్యాత్మిక గురువు అత్యంత సరళంగా, సహజంగా, సూటిగా, దయగా ఉండటం గమనించి శ్రీ రమణ మహర్షి పట్ల గురుభావం కలిగింది. వారి సహేతుకమైన బోధ 'నిన్ను నీవు తెలుసుకో' జీవిత లక్ష్యమైంది. ఆ తర్వాత వచ్చిన కవితలని, ఇంటర్ లోని తెలుగు మాష్టారు జీయస్వీ నరసింహారావుగారికి చూపిస్తే, చాలా బాగా రాస్తున్నావన్నారు. 1989లో వీటిని పుస్తకంగా తీసుకురావాలనిపించింది.



మా ఊరు తణుకులో సాహిత్య వాతావరణం చైతన్యవంతంగానే ఉండేది. నన్నయ్య భట్టారక పీఠం, రీడర్స్ ఫోరం సాహిత్య సభలు జరిపేవి. అయితే, స్వతహాగా ఉన్న బిడియం వల్ల ఎవరినీ కలవటం జరగలేదు.

సంస్కృతాంధ్రాల్లో పండితులైన చెరువు సత్యనారాయణ శాస్త్రిగారి దగ్గర కూర్చుని ఎడిట్ చేద్దాం అన్నారు జీయస్వీగారు. ఎడిటింగ్‌కి ముందు కొన్ని చిత్రమైన ప్రశ్నలు అడిగారు శాస్త్రిగారు. రైలు ఎక్కటానికి స్టేషన్‌కి టైముకి వెళతావా, ముందుగానా వంటివి. జవాబులు విని, నీ సాహిత్యం ప్రసిద్ధి పొందుతుంది వంటి మాటేదో అన్నారు. ఎడిటింగ్ జరిగింది. నేను చదవటం, వారిద్దరూ విని, సరి చేయటం. ముందుమాట అడిగితే రాసుకోమని, చెప్పుకుంటూ వెళ్ళారు శాస్త్రిగారు. ఆరాధన టైటిల్ నేననుకున్నానో, వారు చెప్పారో గుర్తులేదు. ఆరాధన భగవాన్‌కి అంకితమైంది.

మా ఊరిలోనే రవి ప్రింటర్స్ లో పుస్తకం అచ్చుకి ఇచ్చాను. కవర్‌పై నా ఫోటో వేసుకోవాలనే ఆలోచన అప్పటికే ఉన్నట్టుంది. పాలంగి లోని రాయల్ ఆర్ట్స్ దగ్గరికి వెళ్ళి, ఫోటో ఇచ్చి, బొమ్మ గీయించాము. 1989 చివర్లో పుస్తకం వచ్చింది. ఆవిష్కరణ సభ తలపెట్టలేదు. తొలికాపీ దేవుడి దగ్గర పెట్టి ఉంటాను. లేదా తల్లిదండ్రులకి ఇచ్చి వుంటాను. కొన్ని పత్రికలకి సమీక్షలకి పంపి ఊరుకున్నాను.

తర్వాత చలంగారి సన్నిహితులు చిక్కాల కృష్ణారావుగారికి పంపిస్తే, వారంలో ఉత్తరం వచ్చింది. మరునాడు ఇద్దరు వ్యక్తులు ఇంటికి వచ్చారు కృష్ణారావుగారు చెప్పారంటూ. ఆలపాటి రాంబాబుగారు, పుల్లేశ్వరరావుగారు. 2018లో వెళ్ళిపోయేవరకూ, సుమారు మూడు దశాబ్దాలు లోపలి అన్వేషణలో సహచరుడిగా, సంక్లిష్ట సమయాల్లో ఆప్తుడిగా ఉన్నారు రాంబాబుగారు.

తర్వాత రోజుల్లో చిరునామాలు దొరికిన ప్రముఖులకి పుస్తకాలు పంపించాను. "మీవి మాటలతో రాయబడినప్పటికీ, మాటలను దాటి వెళ్ళిపోయాయి, సంవేదనా జగత్తును వదిలి, శుద్ధవేదనా జగత్తుకు" అన్నారు సంజీవదేవ్. "కవి తన్ను తాను వెదుక్కునే ప్రయత్నంలోనే కవిత్వం పుడుతుంది. అందుకనే నిజమైన, స్వచ్ఛమైన కవిత్వం రాయగలిగారు" అన్నారు ఇస్మాయిల్. "పట్టుపురుగులోంచి పట్టు వచ్చినట్లు, మీలోంచి కవిత్వం నిర్గతమవుతోంది" అన్నారు శేషేంద్ర.

2017లో ఆరాధన మూల కవితలు చదివితే, ఎడిటెడ్ కన్నా అవే మరింత సహజంగా తోచాయి. వాటినే కాలక్రమంలో కూర్చి, ఆరాధన రెండో ప్రతి తయారు చేసి ఆన్లైన్ లో ఉంచాను. కవర్ పై సవరించిన ప్రతి అని రాశాను గానీ, నిజానికి సవరించని ప్రతి అని రాయాలి.

1994లో తణుకు వచ్చి, నన్ను వెదికి పట్టుకున్న కొప్పర్తి గారి స్నేహం తర్వాత, 1995 లో నా తొలి హైకూ సంపుటి 'దృశ్యాదృశ్యం' వచ్చింది. తణుకులో ఆవిష్కరణసభకి చేరా, ఇస్మాయిల్, కె. రామ్మోహన్ రాయ్ గార్లు వచ్చారు. బివివి ప్రసాద్ అప్పటి నుండి సాహిత్య ప్రపంచానికి తెలియటం మొదలైంది. తర్వాతి కాలంలో నాగభైరవ, ఓల్గా, అద్దేపల్లి 'ఆరాధన' చదివి సాంద్రమైన అనుభూతితో స్పందించారు.

■ 90320 75415

అతి అలంకారాల్లేని కవిత

ప్రియ పద్యం



గాఢ అనుభూతిని చిక్కటి కవిత చేయడం ఒక పద్ధతి. ఓ మామూలు భావనను సింపుల్ నరేటివ్‌గా కవిత చేయడం ఇంకో పద్ధతి. కవి సామర్థ్యం ఆయా కవితల నాణ్యతను నిర్ణయిస్తుంది. నిర్గుణ్ రెండో పద్ధతిలో అల్లిన కవిత 'Outdated Parents'.

ముందుకెళ్ళిపోయిన తరం వెనక్కైనా తిరిగి చూడకుండా నడిచొచ్చిన దారి తెలివితేటలను తూకంవేసి అవి తుక్కు అని నిర్దాక్షిణ్యంగా ముద్ర వేయడం ఇక్కడ ఇతివృత్తం.

ప్రతి తరం తన ముందు తరంతో ఎలా వ్యవహరించిందో అదే విధంగా తన తరువాతి తరం తనతోనూ వ్యవహరించడం అనే సహజ న్యాయసూత్రాన్ని సహించలేకపోవడంలోని ప్రహేళికను కవి సమర్థంగా పొరలు పొరలుగా పేర్చుకుంటూ పోయాడు. నాకు బాగా నచ్చిన అంశం కవి తన సారాన్ని రూపంతో అతిగా అలంకరించకపోవడం. మేఘాలు, పూలు, తేనెలు, పక్షులను అక్కడక్కడా చల్లకపోవడం. రూపకాన్నో ఇంకేదో అలంకారాన్నో పట్టుకు వేళ్ళాడకపోవడం. తన భావనను సూటిగా బాణమంత నేరుగా గురిపెట్టడం.

ముసలోళ్లను పర్ణశాలల్లో పడేయడమే కాదు మీకేమీ తెలియదు అనడం కూడా వదిలించుకోవడమేనని కవి చెప్పాడు. ఈ వదిలించుకోవడమనే డిలీట్ ఆప్షన్ ఇప్పుడు మానవ జీవన కీ బోర్డులో కీలకం అని, తరాల అంతరాలలో deletion is key అనీ చెపుతున్నాడు కవి. దాన్ని ముందు తరాలకోసం కొత్త తరమే ఆవిష్కరించాలని కల కంటున్నాడు కవి.

అవుట్‌డేట్ అనే పాతముద్రకూ అప్‌డేట్ అనే పాదముద్రకూ మధ్య జరిగే సంఘర్షణలో తల్లితండ్రుల వేదనను సంయమనంతో నిర్వహించడం కవి గొప్పతనం. ఎక్కడా తరవాతి తరాన్ని తిట్టకపోవడం, నిందించకపోవడం నాకు నచ్చిన మరో అంశం.

ఇప్పుడిది నిస్సందేహంగా మంచి కవిత. నిర్మాణం విషయంలో ఇంకొంచెం శ్రద్ధ పెట్టి ఉంటే గొప్ప కవిత అయి ఉండేది. ఎంచుకున్నది కొత్త ఇతివృత్తం కనుకా, ఇతివృత్త ప్రధాన కవిత కనుకా కవిని ఆ మేరకు క్షమించేసి మనస్ఫూర్తిగా అభినందించవచ్చు.

■ ప్రసేన్

Outdated Parents

సరే... అన్నీ మీకే తెలుసు!
ఊరోళ్లమేనని చెప్పుకోవడానికి మేం సిగ్గుపడం

సరే.. మీ భాషలో మేం అవుట్‌డేటెడ్

మా కాలం లోనే ఇంకా ప్రయాణిస్తూ
మీ కాలపు ఉరుకు పరుగులలో
మేమింకా వెనుకబడేవున్నాం

ఆట బొమ్మలతో ఎలా ఆడుకోవాలో
మీకు నేర్పిన మమ్మల్ని
ఎలా బుడి బుడిగా నడవాలో
ఎలా ముద్దుముద్దుగా మాట్లాడాలో
మీకు నేర్పిన మేం
అవుట్‌డేటెడ్ అయ్యామా
అవుట్‌డేటెడ్ చేశారా

ఈ కాలం మీ కాలంలా లేదని
మాకెందుకు మీరు విడమరచి చెప్పడం లేదో
ఏదీ చెప్పకుండానే మీకేం తెలియదులే అని
మమ్మల్ని Outdated Parents ని
ఎందుకు చేస్తున్నారో తెలియడం లేదు

నీకేం తెలియదు డ్యాడ్ నీకు తెలియదులే మమ్మీ
అనే మాట కూడా ఒకటుంటుందని
మీరు పలికాకే మేము కూడా ఈ మాటను
మా అయ్యా అమ్మలపై వాడామని

ఇప్పుడిప్పుడే గుర్తుకొస్తోంది

మీలా ఇన్ని గందరగోళాలు
మా మెదడు కీ బోర్డులో అప్పట్లో లేక
ఆ మాటను మేమూ అప్పుడు డిలీట్ కొట్టలేదు

ఆ మాట
ఇప్పుడు మీరూ డిలీట్ చేసుకోలేరు
మీ తరం కూడా డిలీట్ చేసుకోవడానికి అంగీకరించదేమో
Updated Children కదా మీరు
మీ దగ్గర బోలెడు డిలీట్ ఆప్షన్స్ ఉంటాయి కదా


బోధి వృక్షాలున్నాయి తథాగతుడే లేడు
ఏ తరంలోనైనా ఆ మాట
తల్లిదండ్రుల మనసులు తెగేసే ఖడ్గమవుతుంది

అనాథ శరణాలయాల్లో పడేయడం మాత్రమేనా
ఊర్కోండంటూ తల్లిదండ్రుల్ని తోసిరాజనడమూ
అవుట్‌డేటెడ్ పేరెంట్స్ అని గంట కట్టడమే

ఇప్పుడిక డిలీషన్ సాఫ్ట్‌వేర్ కావాలి
లేకుంటే రాబోయే తరాలు
అసలు డిలీట్ ఆప్షన్ లేకుండానే పుడతాయి

తరతరాలుగా ఇది తీరం దాటని తుఫాన్
నిత్యం కురుస్తూనే ఉంటుంది కుండపోతగా...

■ **ఇబ్రహీం నిర్గుణ్**



పల్లా కవితా పురస్కారం


'పల్లా జాతీయ కవితా పురస్కారం 2025' కోసం తెలుగు కవులు తమ కవితా సంపుటాలను పంపగోరుతున్నాం. ఉత్తమ కవితా సంపుటి కవికి రూ.7500 నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపిక, శాలువాతో సత్కారం ఉంటుంది. మీ వచన కవితా సంపుటాలు మూడు కాపీలను మార్చి 15లోపు చిరునామా: పల్లా కృష్ణ, CSSR & SRRM డిగ్రీ పీజీ కళాశాల, 13-522, రెడ్డి కాలనీ, కమలాపురం - 516289, వైఎస్ఆర్ కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు పంపాలి. ఫోన్: 9985193868.

పల్లా కృష్ణ

పెన్నా సాహిత్య పురస్కారం

పెన్నా రచయితల సంఘం, నెల్లూరు ఇచ్చే పెన్నా సాహిత్య పురస్కారానికి జనవరి 2023 నుంచి డిసెంబర్ 2024 వరకు ముద్రితమైన కవితా సంపుటాలు మూడు కాపీలను మార్చ్ 31 లోగా పంపాల్సిన చిరునామా: గోవిందరాజు సుభద్రాదేవి, ఇం.నెం.26-15-494, స్నేహ నగర్, కొండాయపాలెం రోడ్, నెల్లూరు - 524004. వివరాలకు ఫోన్: 9848627158.

పెన్నా రచయితల సంఘం



బీజేపీలోకి కేశినేని నాని!

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆంతరంగిక సమావేశాలు

- ఆటోనగర్‌లో శనివారం ఆత్మీయులతో రహస్యంగా భేటీ
- నందిగామ మండలం బిళ్లనపాడులో మనసులో మాట వెల్లడి
- కొద్దికాలంగా ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరితో మంతనాలు
- గొల్లపూడి, తిరువూరులో కూడా ఆంతరంగిక సమావేశాలు
- పెళ్లి వేడుకలో జగన్‌ను కలిసినా.. రాజకీయ ప్రస్తావన లేదు
- ఆంతరంగిక సమావేశాల్లో గడ్కరీని ఆకాశానికెత్తుతున్న కేశినేని నాని

నెల రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్న నాని


పురందేశ్వరి


కేశినేని నాని

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) రాజకీయ సన్యాసంపై రూటు మార్చారు. వైసీపీలో చేరి ఆ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. గతేడాది జూన్ 10న ఇక మీదట రాజకీయాల్లో కొనసాగబోనని.. వైసీపీకి గుడ్‌బై చెప్పిన కేశినేని శ్రీనివాస్ మళ్లీ తన స్టాండ్‌ను మార్చుకున్నారు. తాజాగా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరితో గత కొంతకాలంగా టచ్‌లో ఉంటున్నారు. దాదాపుగా ఆయన బీజేపీలో చేరటానికి లైన్ క్లియర్ అయినట్టు తెలుస్తోంది. కేశినేని శ్రీనివాస్‌ను బీజేపీలోకి తీసుకువచ్చేందుకు పురందేశ్వరి గట్టి ప్రయత్నాలు చేసినట్టుగా తెలుస్తోంది. పలుమార్లు ఇద్దరూ భేటీ అయినట్టు సమాచారం.

రాజకీయాల్లోకి రీ ఎంట్రీ!

పక్షం రోజులుగా విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కేశినేని శ్రీనివాస్ రహస్యంగా ఆంతరంగిక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 6వ తేదీన నందిగామ మండలం బిళ్లనపాడులో జరిగిన ఆంతరంగిక సమావేశంలో కేశినేని చేసిన వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో మిగతా 6లో..

ఎవరి పాత్ర ఎంత?

సత్యవర్ధన్ కేసులో లోతుగా పోలీసుల విచారణ

సిద్ధమైన నిందితుల పూర్తి జాబితా ● జైలులో ఐదుగురు.. పరారీలో ఆరుగురు

- దేశ సరిహద్దులు దాటకుండా లుక్ అవుట్ నోటీసు జారీ
- నేడు న్యాయాధికారి ముందుకు సత్యవర్ధన్?

ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసును పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. అతని విషయాన్ని వంశీ అనుచరులకు ఉప్పందించింది ఎవరు? హైదరాబాద్‌లో ఉన్న సత్యవర్ధన్ విజయవాడకు వస్తున్నాడని ఎలా తెలిసింది? కిడ్నాప్ చేయడానికి ఎన్ని నెలల నుంచి ప్రణాళిక రూపొందించారు? ఎవరెవరు ఎంతెంత పాత్ర పోషించారు? అనే వివరాలను రాబడుతున్నారు. ఇప్పటికే నిందితుల జాబితాను సిద్ధం చేశారు. ఐదుగురు జైలులో ఉండగా.. ఆరుగురు పరారీలు ఉన్నారు. వీరి కోసం వేట ముమ్మరం చేశారు. దేశ సరిహద్దులు దాటకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు.


అరెస్టు సమయంలో వంశీ (ఫైల్)

విజయవాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదుదారుడిగా ఉన్న సత్యవర్ధన్ యూటర్న్ తీసుకోవడంతో వంశీ అనుచరుల్లో అవధులు లేని ఆనందం కనిపించింది. తిరిగి అతికొద్ది రోజుల్లోనే సత్యవర్ధన్ అన్నయ్య కిరణ్ ఇచ్చిన ఫిర్యాదుతో అనుచరులకు షాక్ తగిలింది. విజయవాడ పోలీసులు వంశీని హైదరాబాద్‌లో అరెస్టు చేసిన తర్వాత ఆయన శిబిరంలోని పక్షులు తలో దిక్కుకు చెదిరిపోయాయి. ఈ కేసులో మొత్తం 11 మంది నిందితులుగా ఉన్నారు. దర్యాప్తులో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ 11 మందిలో ఐదుగురిని ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నారు. వారిలో కొమ్మా కోట్లు, ఓలుపల్లి మోహనరంగారావు ముఖ్యమైన నిందితులుగా పోలీసులు భావిస్తున్నారు. కేసులో ఉన్న 11 మంది ఒక్కో బాధ్యతను నిర్వర్తించినట్టు పోలీసులకు సమాచారం అందింది. జిల్లా సరిహద్దులు దాటేసిన నిందితులు దేశ సరిహద్దులు దాటకుండా పోలీసులు వారిపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మైహోం భూజాలో వంశీ నివాసం ఉంటున్న మిగతా 6లో..

కబ్జాలు, దందాలతో గన్నవరాన్ని నాశనం చేశారు

చేసిన పాపాలకే శిక్ష అనుభవిస్తున్నారు.. మేం కక్ష సాధించటం లేదు



- భూ రికార్డులను ట్యాంపరింగ్ చేశారు.. వాటిపై విచారణను కోరుతున్నా
- ఎమ్మెల్యే కాగానే గ్రీవెన్స్ నిర్వహిస్తే 5 వేల మంది వచ్చారు
- అన్నీ భూ కబ్జా కేసులే.. వీటిలో కొన్నింటిని విచారించాం
- నాపై ట్వీట్లు చేసే వైసీపీ నేతలు కలుగులో కాకుండా బయటకు వచ్చి మాట్లాడాలి 6
- 'ఆంధ్రజ్యోతి'తో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

'వంశీ అరెస్టు సక్రమమే. మహానుభావులు గెలిచిన గన్నవరం గడ్డ మీద కబ్జాలు, దందాలు, అక్రమాలు చేశారు. ఎందరి మీదో అక్రమ కేసులు బనాయించారు. చేసిన పాపాలకే ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నారు. కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని వంశీపై జగన్, ఇతర నేతలు మొసలి కన్నీరు కారుస్తూ ట్వీట్లు పెట్టడం కాదు. దమ్ముంటే బయటకు వచ్చి మగాళ్లలా మాట్లాడాలి. వంశీని నేనెప్పుడూ రాజకీయ ప్రత్యర్థిగానే చూశా. కక్ష పూరితంగా చూడలేదు. ఆయన నన్ను శత్రువుగానే చూశాడు. ఐదేళ్లు వాళ్లు విధ్వంసం చేస్తే నేను అభివృద్ధి చేస్తున్నా' అని గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. వంశీ అరెస్టు నేపథ్యంలో యార్లగడ్డ వెంకట్రావుపై వైసీపీ మూకలు సోషల్ మీడియా వేదికగా దాడి చేస్తున్న నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. ఆయన మాటల్లోనే ..

మధురానగర్ తూర్పున రైల్వే ఓవర్ బ్రిడ్జి!

సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌కు ప్రత్యామ్నాయం

నేతాజీ రోడ్డు చివర నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు వరకు సరికొత్త ఆర్‌వోబీ

సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌కు ప్రత్యామ్నాయంగా సెంట్రల్ నియోజకవర్గంలో రైల్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) సాకారం కాబోతోంది. మధురానగర్ తూర్పున ఇది ఏర్పాటు కానుంది. ఇప్పటికే ఈ బ్రిడ్జి కోసం వీఎంసీ, రైల్వేశాఖలు సర్వే పూర్తి చేశాయి. నేతాజీ రోడ్డు చివర నుంచి మొదలై రైవస్ కాల్వ, విజయవాడ - గుడివాడ రైల్వేలైన్ మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డుకు అనుసంధాన మవుతుంది. బుడమేరు ఉత్తర ప్రాంత వాసులు నగరంలోకి ప్రవేశించడానికి మార్గం సుగమం కానుంది. నూతన ఆర్‌వోబీపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- సిద్ధమైన డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు
- సర్వే పూర్తి చేసిన వీఎంసీ, రైల్వేశాఖలు
- బుడమేరు ఉత్తర ప్రాంత వాసులు నగరంలో ప్రవేశానికి మార్గం సుగమం


ఇటీవల అధికారులు వేసిన మార్కింగ్

ఆంధ్రజ్యోతి-మధురానగర్: సెంట్రల్ నియోజకవర్గంలో బుడమేరుకు ఉత్తరాన ఉన్న ప్రాంతవాసులు నగరంలోకి రావడానికి ప్రధానంగా సింగ్‌నగర్ ఫ్లైవోవర్ ఒక్కటే దారి. దీంతో రోజువారి ట్రాఫిక్ సమస్య అంతా ఇంతా కాదు. ఇపుడు ఈ సమస్యకు చెక్ పెట్టడానికి ఈ నియోజకవర్గంలో రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మించడానికి రైల్వే శాఖ డిటైల్డ్ ప్రాజెక్టు డ్రాయింగ్, అంచనాలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు ఎక్కడ నిర్మించాలనే దాని మీద నాలుగు రోజుల కిందట వీఎంసీతో కలిసి రైల్వేశాఖ అధికారులు సర్వే చేశారు. సింగ్‌నగర్, పాయకాపురం, వాంబేకాలనీ, ఆంధ్రప్రభ కాలనీ, కుందావారి కండ్రిక, ఇందిరా నాయక్ నగర్, దేవినగర్, దావు బుచ్చయ్య కాలనీ వాసులు దేవినగర్ మీదుగా మధురానగర్ దేవినగర్ వంతెన మీదుగా నగరంలోకి వస్తున్నారు. అయితే రద్దీ సమయంలో ఇక్కడ ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. దీంతో మధురానగర్ పప్పుల మిల్లు వద్దకు ట్రాఫిక్ వస్తోంది. ఇక్కడ రైల్వే గేటు ఉండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. ఈ సమస్య పరిష్కారం కోసం మొదటి దశలో గుడివాడ రైల్వే లైను మీద మరో వంతెన ప్రతిపాదన వచ్చింది. ఈ ప్రతిపాదన మేరకు నేతాజీ రోడ్డు చివర అనువుగా ఉంటుందని నిర్ణయించారు.

సర్వేతో స్థానికుల్లో ఆందోళన

సర్వే చేసిన వీఎంసీ, రైల్వే అధికారులు నేతాజీ రోడ్డులో రెండు వైపులా ఇళ్లకు మార్కింగ్ చేశారు. దీంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. వైసీపీ హయాంలో ఇళ్ల పట్టాల పేరుతో ఎన్నికల ముందు ఈ ప్రాంతంలో రెవెన్యూ అధికారులతో సర్వే చేయించారు. మాస్టర్ ప్లాన్‌లో బుడమేరు, దాని పక్కనే ఉన్న ఏలూరు కాల్వల నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డుకు పక్కన ఉన్న రైవస్ కాల్వకు అనుసంధానంగా ఒక కాల్వ ఉండేది. ఈ కాల్వకు రెండు పక్కల కట్ట ఆక్రమణలకు గురై ఇపుడు రెండు మూడు అంతస్తుల భవనాలు వెలిసాయి. వీటిలో కొంత మేర 1981లో ఇందిరాగాంధీ హయాంలో పట్టాలు ఇచ్చారు. అదే కాల్వ కాలక్రమంలో నేతాజీ రోడ్డుగా మారింది. ఈ ఆక్రమణలను గుర్తించి ఖాళీ చేయించడమా లేక పట్టాలు ఇవ్వడమా అనే మిగతా 6లో..

ప్రజల సమక్షంలో మరోసారి సర్వే



మొదట ఆర్‌యూబీ అన్నారు. కానీ నేతాజీ రోడ్డు చివర రైవస్ కాల్వ, డ్రైనేజీ అడ్డు వస్తున్నాయి. అందుకే ఇక్కడ ఆర్‌వోబీ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీని కోసం అధికారులు చేసిన సర్వే వల్ల నేతాజీ కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఆ కాలనీ వాసులు నా దగ్గరకు వచ్చారు. వీఎంసీ, రైల్వే అధికారులు ఎక్కడ నుంచి ఎక్కడి వరకు సర్వే చేసారో చూడాలి. అందుకని మరోసారి నేనే దగ్గరుండీ సర్వే చేయిస్తా.

-బొండా ఉమామహేశ్వరరావు, సెంట్రల్ ఎమ్మెల్యే

తగ్గేదే లే..

వైసీపీ కబ్జా గ్యాంగ్ తీరు ఇది

- కబ్జా స్థలంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అధికారులను భయపెట్టే ప్రయత్నం
- కార్పొరేషన్ స్థలం కోర్టు వివాద స్థలంగా చిత్రీకరణ
- ఫ్లెక్సీలను తొలగించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు
- స్థలాలు కొని మోసపోయిన బాధితుల ఆందోళన
- కబ్జా గ్యాంగ్‌పై క్రిమినల్ చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వేడుకోలు



కబ్జా గ్యాంగ్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

నగర శివారుల్లోని పాయకాపురం కండ్రిక కాలనీ సరిహద్దులో కార్పొరేషన్ స్థలాన్ని కబ్జా చేసిన వైసీపీ కబ్జా గ్యాంగ్ తగ్గేదే లే.. అంటోంది. కబ్జా వ్యవహారంపై అధికారులు చర్యలు చేపట్టకుండా ముందస్తుగానే కబ్జా చేసిన కార్పొరేషన్ స్థలాన్ని కోర్టు వివాదంలో ఉన్న ప్రైవేట్ స్థలం వ్యవహారంగా చిత్రీకరించింది. అంతటితో ఆగకుండా అధికారులను భయపెట్టే విధంగా కబ్జా స్థలంలో ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేసి అధికారులు ప్రభుత్వ భూమిలో అడుగు పెట్టకుండా ఉండాలని కుయుక్తులు పన్నింది. అయితే టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కబ్జా స్థలం వద్దకు వచ్చి ఆదివారం ఫ్లెక్సీలను తొలగించివేశారు. అదే సమయంలో కబ్జా గ్యాంగ్ వద్ద స్థలాలు కొని మోసపోయిన బాధితులు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు.


కబ్జా స్థలం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

పాయకాపురం/విజయవాడ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కండ్రిక కాలనీ సమీపంలోని ఆంధ్ర సిమెంట్ ఫ్యాక్టరీ ఎంప్లాయీస్ అండ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ హౌస్ సొసైటీ లిమిటెడ్ వెంచర్‌కు ఆనుకుని ఉన్న కార్పొరేషన్‌కు చెందిన రూ.10 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైన విషయమై ఆదివారం 'కబ్జా గ్యాంగ్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అధికారుల కన్నా ముందే కబ్జా గ్యాంగ్ స్పందించింది. తెల్లవారు జామునే కబ్జా స్థలంలోకి చేరుకుని సదరు స్థలం కోర్టు వ్యవహారమని ఇతరులు ఎవరు స్థల వివాదంలో జోక్యం చేసుకోరాదంటూ పదుల సంఖ్యలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఫ్లెక్సీలను చూసి కంగారు పడ్డారు. కోర్టు వ్యవహారంలో ఉన్న ప్రైవేట్ స్థలంగా కాసేపు భ్రమలో పడిపోయారు. అయితే పైఅధికారులను సంప్రదించగా అది కార్పొరేషన్‌కు చెందిన స్థలంగా నిర్ధారించుకుని అనంతరం యాక్షన్‌లోకి దిగిపోయారు. కబ్జా భూముల్లో ఏర్పటు చేసిన ఫ్లెక్సీలను మొత్తం పూర్తిగా తొలగించారు.

సరిహద్దు రాళ్లను తొలగిస్తాం : బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్

కార్పొరేషన్ భూమి కబ్జా విషయమై బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సునీత స్పందించారు. ఆదివారం ఫ్లెక్సీలను సిబ్బందితో తొలగింపజేసిన ఆమె సదరు స్థలం కార్పొరేషన్ స్థలంగా ధ్రువీకరించారు. అలాగే ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లను సోమవారం తొలగించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎమ్మెల్సీ అనుచరుడే కీలకం

కబ్జా వ్యవహారంలో ఎమ్మెల్సీ అనుచరుడు, వైసీపీ సానుభూతిపరుడు బండారు దుర్గారావు కీలకంగా వ్యవహరించినట్లు బయటపడింది. ఆదివారం రోడ్డెక్కిన బాధితులు బండారు దుర్గారావు తమకు సిమెంట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ స్థలంగా నమ్మబలికి అమ్మినట్లు బాధితులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా 2021లోనే కార్పొరేషన్ స్థలాన్ని కబ్జా చేసి 36 ప్లాట్లుగా విడగొట్టి నకిలీ పత్రాలు సృష్టించినట్లు తేలింది. మొత్తం రూ.10 కోట్లు విలువ చేసే 4000 గజాల స్థలానికి పక్కనే ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ సర్వే నంబరు డాక్యుమెంట్ల ద్వారా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించినట్లు స్పష్టమవుతుంది.

బాధితుల ఆందోళన

కార్పొరేషన్ స్థలాన్ని సిమెంట్ ఫ్యాక్టరీ అసోసియేషన్‌కు చెందిన స్థలంగా భావించి స్థలాలు కొనుగోలు చేసి కబ్జా గ్యాంగ్ చేతుల్లో మోసపోయిన బాధితులు ఆదివారం రోడ్డెక్కారు. కబ్జా భూముల వద్దకు చేరుకుని తాము మోసపోయామంటూ గగ్గోలు పెట్టారు. తమను నమ్మించి నట్టేట ముంచేశారని, తాము దాచుకున్న డబ్బుతో కొన్న స్థలాలు ప్రభుత్వ స్థలాలని తెలియడంతో వారంతా బోరుమంటున్నారు. రెండేళ్ల కిందటే తక్కువ ధరలకు వస్తున్నాయని స్థలాలు కొన్నామని ఇలా మోసపోతామని గ్రహించలేకపోయామని, తమకు స్థలం అమ్మిన వ్యక్తులపై అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.

వీరమ్మ తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

రేపు శిడిబండి వేడుక


6లో

దుర్గగుడిలో సంకట హర గణేశుడికి అర్చన


క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు

6లో

చికెన్ షాపులు వెలవెల

బర్డ్ ఫ్లూతో నిలిచిపోయిన కోడిమాంసం, గుడ్ల అమ్మకాలు

- ధర తగ్గించినా అటువైపు చూడని వినియోగదారులు
- కిటకిటలాడిన చేపల దుకాణాలు


జి.కొండూరులో చికెన్ దుకాణాలు

(ఇబ్రహీంపట్నం /జీ కొండూరు, ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ దెబ్బకు చికెన్, కోడిగుడ్లు కొనేవారు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. ధర తగ్గించి పెట్టినా ఆ వైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. ఎన్టీఆర్ జిల్లాలో గంపలగూడెం మండలం అనుముల్లంకలో బర్డ్ ఫ్లూ సోకి సుమారు 15 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ కోళ్ల నుంచి తీసిన శాంపిల్స్‌ను రోగ నిర్ధారణకు పశు సంవర్ధకశాఖ అధికారులు భోపాల్‌కు పంపారు. 10 కిలో మీటర్ల వరకు రెడ్ జోన్‌గా ప్రకటించి చికెన్ అమ్మకాలను నిలిపివేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య 12 సరిహద్దు బోర్డర్లలో 36 మంది సిబ్బందికి డ్యూటీలు వేసి కోళ్ల రవాణా జరగకుండా చర్యలు చేపట్టారు. రోగ నిర్ధారణ అయ్యే వరకు చికెన్, కోడి గుడ్లు తినకుండా ఉంటే మంచిదని ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లాలోని 116 కోళ్ల ఫారాల్లోని కోళ్ల నుంచి ఏడాదికి 5,592 టన్నుల కోడి మాంసం ఉత్పత్తి అవుతుంది. ఈ లెక్కన రూ.55.92 కోట్ల వ్యాపారం జరుగుతోంది. అలాగే కోడి గుడ్ల నుంచి రూ.206.95 కోట్లకు పైగా వ్యాపారం సాగుతోంది. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ దెబ్బకు అందులో 10వ వంతు వ్యాపారం కూడా నేడు సాగడం లేదు. బర్డ్ ఫ్లూ నిర్ధారణ పరీక్షలు ఆలస్యం అయితే జిల్లాలో ఉన్న పౌల్ట్రీ పరిశ్రమ మరింత కుదేల్ అయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. కాగా, చేపల దుకాణాలు కొనుగోలుదారులతో ఆదివారం కళకళలాడాయి. బారులుతీరి మరీ చేపలు కొనుగోలు చేశారు.

గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయండి

ఎంపీ కేశినేని శివనాథ్ 6లో



వీరమ్మ తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు





వీరమ్మ ఆలయం వద్ద జనసంద్రంలా భక్తులు, అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు వెళుతున్న పారుపూడి వంశస్థులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. తిరునాళ్లలో చివరి ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు లక్షకుపైగా భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జాము 4 గంటల నుంచి అర్ధరాత్రివరకు ఆలయం వద్ద భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ ప్రాంగణం, పట్టణ రహదారులు కిక్కిరిసి జనసంద్రంలా మారాయి. ఉమ్మడి, పొరుగు జిల్లాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలనుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పాలపొంగళ్లు తయారుచేసి పసుపు కుంకుమ, చీర సారె సమర్పించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు.

వీరమ్మ శిడిబండి వేడుక రేపు

వీరమ్మ తిరునాళ్లలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న శిడిబండి వేడుకు మంగళవారం సాయంత్రం నిర్వహించనున్నారు. తిరునాళ్లలో 11వ రోజు అత్యంత వైభవంగా జరిగే శిడిబండి వేడుక తిలకించేందుకు పలు ప్రాంతాలనుంచి భక్తులు వేలాదిగా తరలి రానున్నారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఓదళిత కుటుంబానికి చెందిన వివాహానికి సిద్ధంగా ఉన్న యువకుడి (పెళ్లికొడుకు)ని శిడిబండికి కట్టిన ఉట్టి బుట్టలో కూర్చుండబెట్టి మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ ఊయల స్తంభాలు, ఆలయ ప్రదక్షిణ చేసి, అమ్మవారి దర్శనం చేయిస్తారు. ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసారు.

దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో
సంకట హర గణేశుడికి అర్చన





భక్తులతో కిటకిటలాడిన క్యూలైన్లు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సంకటహర చతుర్థి తిధి సందర్భంగా ఆదివారం గణపతికి విశేష అర్చన నిర్వహించారు. గణపతికి అభిషేకం, అర్చన, హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా, వేదోక్తంగా నిర్వహించారు. భక్తుల సుఖశాంతులు కోరుతూ వారి ఈతి బాధలను నివారించాలని సంకల్పిస్తూ పూజాధికాలను నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు గణేశుడికి పూజలు చేశారు.

● మాఘమాసం, ఆదివారం సందర్భంగా దేవస్థానం అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సమస్త జనుల ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ, తదితర సేవలను నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తి చిత్రపటానికి శోడశోపచార పూజలు నిర్వహించి, అర్చనాది కార్యక్రమాలను పూర్తిచేసి మంత్రపుష్పం, హారతి, ఆశీస్సులు అందజేశారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. భక్తులు పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలలో భక్తులను నియంత్రించారు. క్యూలైన్లలో పరిస్థితిని, భక్తుల రాకపోకలను తగు సూచనలు చేసి క్రమబద్ధీకరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయండి

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఎన్ఐఆర్డీలో శిక్షణ పూర్తిచేసుకున్న 33 మంది పంచాయతీ చాంపియన్లతో ఆదివారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఇటీవల కేశినేని ఫౌండేషన్ సహకారంతో శిక్షణ పొందిన 33 మందితో హైదరాబాద్‌లో సమావేశమైన ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు చేరువ కావాలన్నారు. ప్రధాని మోదీ ఆశయం వికసిత్ భారత్, ప్రతి కుటుంబంలోను ఒక ఎంటర్ ప్రెన్యూర్ అన్న ఏపీ సీఎం చంద్రబాబు లక్ష్యం నెరవేరాలంటే పంచాయతీ చాంపియన్లే లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. ఈ నెల 10 నుంచి 16 వరకు శిక్షణ పొందిన యువకులకు ఎన్ఐఆర్డీపీఆర్ డైరెక్టర్ జనరల్ బి.నరేంద్ర కుమార్‌తో కలిసి ఎంపీ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం వారు తమ గ్రామాలను ఏవిధంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నారన్న దానిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలోని 295 గ్రామాలలో జరిగే అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలబడాలన్నారు. నాలుగు నియోజకవర్గాలలో శానిటరి నాపికిన్స్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేసి తక్కువ ధరకు విక్రయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రభుత్వ నిధుల పైనే ఆధారపడకుండా సిఎస్ఆర్ నిధుల ద్వారా కృషి చేయాలన్నారు. సీనియర్ కన్సల్టెంట్ మహమ్మద్ ఖాన్, అసోసియేట్ ప్రొఫెసర్ రంజన్ కుమార్ బాంజా, అసోసియేట్ ప్రొఫెసర్ సి.కపిరాజన్, ప్రాజెక్టు టీమ్ లీడర్ దిలీప్ కుమార్ పాల్, అసోసియేట్ ప్రొఫెసర్‌లు ఆర్.రమేష్, పార్థ ప్రతీన్ సాహా, అనురాధ పల్లా, ఎన్ఐఆర్డి అధికారి మురళీకృష్ణ, ప్రోగ్రామ్ సమన్వయకర్తలు కొంగా సంజయవర్మ, జి.వి.నరసింహారావు పాల్గొన్నారు.

జనగణనతో పాటే కులగణన జరపాలి

» కేసన శంకర్‌రావు



వన్‌టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కేటాయించాలన్నా, జస్టిస్ రోహిణి కమిషన్ సిఫార్సుల మేరకు ఓబీసీల వర్గీకరణ జరపాలన్నా ఈసారి చేపట్టే జనగణనతోపాటే కులగణన చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు అన్నారు. ఆదివారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన ఎన్టీఆర్ జిల్లా నాయకులతో జలగణనలో సమగ్ర కులగణన అంశంపై సమావేశం నిర్వహించి పలు అంశాలను తీర్మానించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జనగణనతో పాటు సమగ్ర కుల గణన ఒక్కటే పరిష్కార మార్గమని తెలిపారు. గతంలో మోదీతో పాటు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్‌లు దేశంలోని ప్రతి ఒక్కరినీ కులాలతో సహా లెక్కిస్తామని వాగ్ధానం చేసి ఇప్పుడు తాత్సారం చేయటం తగదన్నారు. అన్ని విధాలుగా వెనుకబడి ఉన్న ఓబీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నా ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ చట్టంలో బీసీ మహిళలకు సబ్ కోటానిస్తూ సవరణ చేయాలన్నా కుల గణన చేయటం అవసరమన్నారు. దీనిపై త్వరలో విజయవాడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు.



10కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల,

మడకా సత్యఆదిత్య ప్రసాద్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న డా.కెకెఆర్స్ గౌతమ్ డైరెక్టర్ అవినాశ్

క్రీడలతో ఉజ్వల భవితకు పునాది

» ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో స్టేడియం రూపకర్త కీ.శే పర్వతనేని జగన్మోహనరావు మెమోరియల్ 10కే రన్ పోటీలను ఆదివారం ఎమ్మెల్యే వెనిగండ్ల జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల అభివృద్ధికి స్టేడియం కమిటీ చేస్తున్న కృషిలో భాగంగా ప్రతి ఏడాది 10కె రన్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్రీడాకారులు పట్టుదలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, ఐఎంఏ నాయకులు మాగంటి శ్రీనివాస్, అంతర్జాతీయ ఖో-ఖో రిఫరీ మడకా ప్రసాద్, కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మడకా మనుమడికి ప్రత్యేక బహుమతి

స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 10కే రన్ పోటీల్లో అంతర్జాతీయ రిఫరీ మడకా ప్రసాద్ మనుమడు మడకా సత్యఆదిత్య ప్రసాద్ 4కె రన్‌ను పూర్తి చేశాడు. అతితక్కువ వయస్సులో 4కె రన్ పూర్తి చేసిన మడకాకు డా.కెకెఆర్స్‌గౌతమ్ పాఠశాల డైరెక్టర్ కె.అవినాశ్ చేతులమీదగా ప్రశంసాప్రతంతో పాటు నగదు బహుమతిని అందజేశారు.

విధ్వంసం నుంచి స్వేచ్ఛ దిశగా..

మండలి ఎన్నికల్లో చారిత్రాత్మక మెజారిటీ సాధిద్దాం » చట్టం నుంచి నానీలు తప్పించుకోలేరు : మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, చిత్రంలో మంత్రి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణ ప్రసాద్, వెనిగండ్ల రాము

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : శాసనమండలి సమావేశంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చారిత్రాత్మక మెజారిటీ సాధించి తీరుతారని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం బస్టాండ్ వద్ద ఉన్న జిల్లా టీడీపీ కార్యాలయంలో శాసన మండలి ఎన్నికలపై మంత్రులు, శాసనసభ్యులు, కూటమి నాయకులతో విస్తృత సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, ప్రతి గ్రాడ్యుయేట్‌ను కలిసి అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసేలా ఒప్పించాలన్నారు. ఐదేళ్లపాటు అణచివేత ధోరణిలో ఉన్న రాష్ట్రానికి మళ్లీ పోలవరం, అమరావతి రాజధాని వస్తున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల ప్రాజెక్టుగా మార్చేసిందని, కేంద్ర ప్రభుత్వ సాయంతో ఆ పథకానికి జవసత్వాలు వచ్చాయన్నారు. ప్రధాన మంత్రి రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు రెండు లక్షల కోట్ల పెట్టుబడులు అందించి శంకుస్థాపనలు చేశారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసాన్ని.. కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను యువతకు వివరించాలన్నారు. ఖర్మ ఫలం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, వంశీకి ఏ విధమైన పరిస్థితి వచ్చిందో అదే విధంగా గుడివాడ గుట్కా రాయుడు, బందరు బియ్యం దొంగలు చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, సమన్వయంతో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో శాసనసభ్యులతో పాటు నాయకులు, కార్యకర్తలు మెజారిటీపై దృష్టి సారించాలన్నారు. గత ప్రభుత్వం టీచర్లను ఎలా ఇబ్బంది పెట్టిందో గుర్తుచేయాలన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ప్రతి 30 మంది ఓటర్లకు ఒక కూటమి నాయకుడు పనిచేయాలన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.వెంకటకోటేశ్వరరావు మాట్లాడుతూ, కొందరు టీచర్లు పీఆర్సీ, డీఏలపై ఆశలు పెట్టుకున్నారని, త్వరలో వాటిని కూటమి ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. సమావేశంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, బయోడస్ట్ చైర్మన్ విజయకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, గొర్రెపాటి గోపీచంద్, మండలి రాజా, కొనకళ్ల జగన్నాథరావు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, బీజేపీ నాయకుడు పుప్పాల రామాంజనేయులు, కొండలరావు, గొట్టిపాటి రామకృష్ణ, శంకరబాబు, గోపు సత్యనారాయణ, బత్తిన దాసు, కుంచే నాని, స్వర్ణలత, పిప్పళ్ల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఎవరి పాత్ర ఎంత?

(5వ పేజీ తరువాయి)

ఎఫ్ బ్లాక్ సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన విజయవాడ పోలీసులు వాటిని తీసుకుని వచ్చారు. ఆ ఫుటేజీలను సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో విశ్లేషించిన తర్వాత కోర్టులో సాక్ష్యాధారంగా సమర్పించాలని భావిస్తున్నారు.

ఇదీ నిందితుల జాబితా

ముదునూరి సత్యవర్ధన్‌ను బెదిరించి, కిడ్నాప్ చేసిన కేసులో ఉన్న 11 మంది నిందితుల పేర్లు మొత్తం బయటకు వచ్చాయి. సత్యవర్ధన్ అన్నయ్య కిరణ్ ఫిర్యాదుతో పటమట పోలీసులు క్రైం నంబరు 86/2025తో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో వల్లభనేని వంశీమోహన్ (ఏ1), కొమ్మా కోట్లు (ఏ2), భీమవరపు రామకృష్ణ (ఏ3), ఘంటా వీర్రాజు (ఏ4), ఓలుపల్లి మోహనరంగారావు (ఏ5), వజ్రేశ్వరరావు (ఏ6), ఏలినేని వెంకట శివరామకృష్ణప్రసాద్ (ఏ7), నిమ్మ లక్ష్మీపతి (ఏ8), పొట్టి రాము (ఏ9), వేలూరి వంశీబాబు (ఏ10), చేబ్రోలు శ్రీను (ఏ11) నిందితులుగా ఉన్నారు. వారిలో వంశీ, ఘంటా వీర్రాజు, శివరామకృష్ణప్రసాద్, లక్ష్మీపతి, వంశీబాబును పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. నిందితుల్లో వంశీ ప్రధాన అనుచరులు కొమ్మా కోట్లు, ఓలుపల్లి మోహనరంగావుకు మొత్తం ప్రణాళిక తెలుసని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. వారిద్దరూ ఎక్కడున్నా సంకెళ్లు వేయాలని భావిస్తున్నారు. వారి కోసం ఒక ప్రత్యేక బృందం పనిచేస్తోంది. కాగా, సోమవారం న్యాయాధికారి ముందు సత్యవర్ధన్‌ను ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం.

బీజేపీలోకి కేశినేని నాని!

(5వ పేజీ తరువాయి)

ఆయన రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్టు చాలా స్పష్టంగా చెప్పారు. విజయవాడ నగరం అంటే తనకు పిచ్చి మమకారమని, తనను ప్రజా సేవ చేసేందుకు రెండు సార్లు ఇక్కడి ప్రజలు తనకు అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. తానెప్పుడూ స్వార్థం లేకుండా పనిచేశానని, తన ఎంపీ పదవిని ఎప్పుడూ కూడా తన స్వార్థ ప్రయోజనాలకు వాడుకోలేదని తెలిపారు.

బీజేపీ అగ్రనేత, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో పరిచయాలు

తనకు రతన్ టాటాతో పాటు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్ఫూర్తిదాయకులని నాని చెప్పుకొచ్చారు. టాటా ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలో ఎవరూ చేయని సేవలు చేశానని చెప్పారు. గడ్కరీతో ఉన్న పరిచయం కారణంగా విజయవాడ నగర అభివృద్ధికి ఎన్నో ప్రాజెక్టులను తీసుకువచ్చానని తెలిపారు. బీళ్లనపాడు తర్వాత గొల్లపూడి, తిరువూరులో కూడా రహస్యంగా కేశినేని శ్రీనివాస్ అంతరంగిక సమావేశాలు నిర్వహించారు. అలాగే శనివారం ఆటోనగర్‌లో కూడా తన ఆత్మీయులతో రహస్యంగా భేటీ అయ్యారు. గడ్కరీతో ఉన్న పరిచయాలు, ఎన్డీఏ ప్రభుత్వంతో ఉన్న సత్సంబంధాలు కేశినేని శ్రీనివాస్‌ను ఆ పార్టీ వైపు అడుగులు వేసేలా పురిగొల్పాయని తెలుస్తోంది.

టీడీపీలోకి వెళ్లే అవకాశం లేదు!

టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే అవకాశం లేదు. వైసీపీకి పూర్తిగా గుడ్‌బై చెప్పారు. ఇటీవల బెంగళూరులోని ఓ వివాహ ఫంక్షన్‌లో వైసీపీ అధినేత జగన్‌ను కేశినేని నాని ఆయన కుటుంబ సభ్యులు కలిశారు. సరదాగా మాట్లాడుకున్నారే తప్ప ఇద్దరి మధ్య రాజకీయాల ప్రస్తావన కూడా రాలేదని తెలిసింది. వైసీపీకి గుడ్‌బై చెప్పిన తర్వాత తిరిగి ఆ పార్టీలోకి వెళ్లటం కేశినేని నానికి కూడా ఇష్టం లేదని తెలుస్తోంది. ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కేశినేని శ్రీనివాస్‌ను బీజేపీలోకి ఆహ్వానించే ప్రయత్నాలు చేయడంతో ఆయన మనసు మార్చుకున్నట్టు సమాచారం. కేశినేని శ్రీనివాస్ తన నిర్ణయాన్ని మరో నెల రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

కబ్జాలు, దందాలతో గన్నవరాన్ని
నాశనం చేశారు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: కుప్పలు తెప్పలుగా భూకబ్జాలపై అర్జీలు.. నియోజకవర్గ స్థాయిలో గీవెన్స్ నిర్వహిస్తే ఐదువేల మంది వచ్చారు. ఎక్కువుగా భూ కబ్జాల పైనే ఫిర్యాదులు వచ్చాయి. కొన్నిటిపై విచారణ కూడా జరిగింది. నూరుశాతం భూ కబ్జాలకు పాల్పడ్డారు. మా దగ్గర ఆధారాలు ఉన్నాయి. గన్నవరం, బాపులపాడు మండలాలకు నరసింహారావు అనే తహసీల్దార్‌ను ఒక్కడినే పెట్టి ఇష్టానుసారంగా భూ రికార్డులను ట్యాంపరింగ్ చేశారు. జగనన్న ఇళ్ల పట్టాల కోసం భూములను సేకరించే విషయంలో అంతులేని అక్రమాలకు పాల్పడ్డారు. అప్పటి తహసీల్దార్, జేసీ మీద కూడా విచారణ జరిపితే భూకబ్జాల బాగోతం వెలుగులోకి వస్తుంది. ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో కూడా కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. వాటిపైనా విచారణ జరుగుతోంది.

పరిశ్రమలను తన్ని తరిమేశారు

టీడీపీ ప్రభుత్వంలో మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్ ఏర్పాటు చేశారు. దానిని వారు పట్టించుకోకుండా తన్ని తరిమేశారు. నేను ఎన్నికల ముందు అశోక్ లేల్యాండ్‌ను తిరిగి తీసుకువస్తానని చెప్పా. అన్నట్టుగానే మళ్లీ పునః ప్రారంభమయ్యేలా చర్యలు చేపడుతున్నా. మల్లవల్లిలో భూముల ధరలను భారీగా పెంచేశారు. ఎంఎస్ఎంఈలు ఎన్నింటినో సాగనంపారు. పరిశ్రమలు అనేవి లేకుండా పోయాయి. మల్లవల్లిలో పరిశ్రమలను తీసుకువచ్చే పని చేపడుతున్నా. సుప్రీం సొల్యూషన్స్ అనే పెద్ద సంస్థ త్వరలో వస్తోంది. మరో 479 ఎకరాలతో మల్లవల్లి విస్తరణ ప్రణాళికలు రూపొందిస్తున్నాం. 5 వేల నుంచి 15 వేల మంది ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నాం.

కామన్ సైట్లను కబ్జా చేశారు

నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా చేశారు. వెంచర్లలో కామన్ సైట్లు లాగేసుకుని అమ్ముకున్నారు. ఎంతో మంది చేతులు మారిపోయాయి. విజయవాడ రూరల్ మండలంలో అయితే కామన్ సైట్లు లేకుండా పోయాయి.

కొండలను కరిగించేశారు

నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ తారాస్థాయిలో జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు అక్రమ క్వారీయింగ్‌పై విజిలెన్స్ విచారణ జరిపించారు. విచారణలో ఎన్నో అంశాలు నిగ్గు తేలాయి. వాటిలో కొందరి పేర్లు బయటకు వచ్చాయి. మరికొందరు పేర్లు బయటకు రాలేదు. పూర్తి డేటా ప్రభుత్వం దగ్గర ఉంది. అక్రమాలకు పాల్పడిన వారిపై తప్పకుండా చర్యలు ఉంటాయి. అలాగే భూ కబ్జాలు, భూ రికార్డుల ట్యాంపరింగ్ వంటి వాటిపై కూడా సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.

అక్రమ కేసులు ఇష్టానుసారం పెట్టారు..

ఐదేళ్లలో ఆయన సొంత పార్టీ నేతలతో పాటు, మా పార్టీ నేతలపై కూడా ఎన్నో అక్రమ కేసులు పెట్టారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధించారు. నేను ఎమ్మెల్యేగా ఎన్నిక అయిన తర్వాత అక్రమ కేసులు ఎవరి మీద పెట్టనని చెప్పా. నా మాటకు కట్టుబడి ఉన్నా. వైసీపీ నాయకులు ఒక్కరిపై కూడా నేను అక్రమ కేసు పెట్టలేదు. వంశీ హయాంలో ఎన్ని అక్రమ కేసులు పెట్టారో అందరికీ తెలుసు.

అధికారం పోయినా దందాలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా దందాలు చేశారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన కాంట్రాక్టు పనులను వంశీ అనుచరులు కడియాల సతీష్, రఘు దక్కించుకున్నారు. భారీగా దొంగ బిల్లులు పెట్టారు. దీనిపై నేను విచారణకు డిమాండ్ చేస్తున్నా.

నాడు జగన్ మీదనే కేసు పెట్టిన వంశీ..

ఆయనకే నేడు జగన్ వత్తాసు

మినుము పంటను తొక్కుకుంటూ వెళ్లాడని జగన్ మీదనే వంశీ కేసు పెట్టాడు. అదే వంశీ అరెస్టు అక్రమం అంటూ జగన్ ట్వీట్లు చేస్తున్నాడు. కొడాలి నాని వంటి వాళ్లు ట్వీట్లతో కూతలు కూస్తున్నారు. నేనొక్కటే చెబుతున్నా.. మగాడిలా బయటకు వచ్చి మాట్లాడమంటున్నా. వంశీని నేనెప్పుడూ రాజకీయ ప్రత్యర్థిగానే చూశా. ఆయన నన్ను శత్రువుగానే చూశాడు. ఇప్పుడు కూడా వంశీ చేసిన నిర్వాకాల వల్లనే ఆయన అరెస్టు అయ్యాడు తప్పితే మేమేదో కావాలని చేయించింది కాదు.

నియోజకవర్గాన్ని గాడిలో పెడుతున్నా

నియోజకవర్గాన్ని మళ్లీ గాడిలో పెడుతున్నా. మల్లవల్లిలో కొత్తగా పరిశ్రమలు తీసుకు వచ్చి స్థానికంగా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నా. అతి త్వరలో సాకారం అవుతుంది. జాబ్ మేళాల ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తున్నా. మేథ దగ్గర ఐటీ గచ్చిబౌలిని తీసుకురావాలని ప్రయత్నం చేశా. 30 ఎకరాల భూమి అవసరమైంది. తీరా చూస్తే భూములు కొన్ని ఆక్రమణలలో ఉన్నాయని తేలింది. ఐబీఎస్ వంటి కళాశాలలను తీసుకురావాలన్నది నా ఉద్దేశ్యం. హెచ్‌సీఎల్ నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ తీసుకు వచ్చి గన్నవరం అభివృద్ధికి గతంలో కృషి చెయ్యలేదు. నేను ఆ పని చేస్తున్నా. గతంలో నేను కేడీసీసీ బ్యాంకును ఏ విధంగా అభివృద్ధి చేశానో.. అదే తరహాలో గన్నవరం నియోజకవర్గాన్ని కూడా అభివృద్ధి చేసి మోడల్‌గా నిలపాలన్నది నా ఆలోచన.

డాక్టర్ సరితకు డయాబెటిస్ ఇండియా ఫెలోషిప్ అవార్డు

విజయవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మధుమేహవ్యాధిపై విస్తృతంగా ప్రచారం చేస్తూ నివారణకు విశేష కృషి చేస్తున్న విజయవాడకు చెందిన ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణురాలు డాక్టర్ సరిత కాకానికు డయాబెటిస్ ఇండియా సంస్థ ప్రతిష్ఠాత్మక డయాబెటిస్ ఇండియా ఫెలోషిప్ అవార్డు దక్కింది. మధుమేహంపై గత 15ఏళ్లుగా పరిశోధన, అనేక అవగాహన కార్యక్రమాలను ఆమె నిర్వహిస్తున్నారు. అహ్మదాబాద్‌లో నిర్వహిస్తున్న వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ డయాబెటిస్‌లో సరిత ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పీటర్ ష్వార్జ్ నుంచి అవార్డును అందుకున్నారు.

ఏపీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా బేబీరాణి

గాంధీనగర్ : ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా వేముల బేబీరాణి, రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ, బీసీలకు చట్టసభల్లో, ఉద్యోగ, రాజకీయాల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బత్తుల నాగేశ్వరరావు, షేక్ సయ్యద్, మైలవరపు శేషు, వేముల శివ, మహమ్మద్ సలీం, షేక్ మున్నీ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షుడిగా జాన్సన్

మచిలీపట్నం టౌన్ : ఉమ్మడి కృష్ణాజిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షుడిగా ఎం.జాన్సన్ ఎన్నికయ్యారు. ఆదివారం ట్రెజరీ కార్యాలయం వద్ద జరిగిన ఎన్నికలకు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమణారెడ్డి పరిశీలకునిగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడుగా ఎం.జాన్సన్, సహాధ్యక్షుడిగా డి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా దీపక్, ఆర్థిక కార్యదర్శిగా హరీష్, ఉపాధ్యక్షులుగా బి.నాగేంద్రం, సురేష్, రమాదేవి, సుధాకర్, జాయింట్ సెక్రటరీలుగా గోపాల్‌సింగ్, రాధిక, వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ, ఖజానాశాఖలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు.

ఎడ్లబండిని ఢీకొని ఆర్టీసీ కండక్టర్ దుర్మరణం



తోట్లవల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎడ్లబండిని వెనుక నుంచి ద్విచక్రవాహనంతో ఢీకొని ఆర్టీసీ కండక్టర్ చీకుర్తి సురేష్(42) దుర్మరణం చెందిన ఘటన ఆదివారం రాత్రి తోట్లవల్లూరు రోడ్డులో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. తోట్లవల్లూరు దళితవాడకు చెందిన సురేష్ ఉయ్యూరు డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి డ్యూటీ దిగి స్కూటీపై ఇంటికి వస్తున్నాడు. అలాగే తోట్లవల్లూరుకు చెందిన కిలారపు శివప్రసాద్ ఎడ్లబండి ఉయ్యూరు కేసీపీ ఫ్యాక్టరీకి చెరకు తోలి తిరిగి వస్తోంది. యాకమూరు రైస్‌మిల్లు దాటిన తరువాత సురేష్ ఎడ్లబండిని వెనుక నుంచి ఢీకొట్టి ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ వై.చిట్టిబాబు, ఎస్ఐ అవినాష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కుటుంబసభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. సురేష్‌కి భార్య మహారాణి, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు.

సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌కు ప్రత్యామ్నాయం

(5వ పేజీ తరువాయి)

దాని కోసం వైసీపీ హయాంలో సర్వే చేసి నోటీసులుకూడా ఇచ్చారు. ఇపుడు రైల్వే శాఖ, మున్సిపల్ శాఖలు సర్వే చేయడంతో పట్టాల రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న ప్రజలు ఆందోళనలో పడ్డారు. మరో పక్క రైల్వే అధికారులు ఇప్పటికే డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు, డ్రాయింగ్, అంచనాలు సిద్ధం అయ్యాయని చెప్పారు.

రైవస్ కాల్వ మీద వంతెన

బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన రైవస్ కాల్వ మీద వంతెన వస్తుంది. వంతెనకు ఒక పక్కన నేతాజీ రోడ్డులో ర్యాంపు ఉంటుంది. ఏలూరు కాల్వ వీవీ నరసరాజు రోడ్డు నుంచి ఈ ర్యాంపు మొదలవుతుంది. మరో వైపు ర్యాంపు బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో దిగుతుంది. - రాంబాబు, వీఎంసీ ఏసీపీ

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	120,129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

28న చాంబర్ ఆఫ్ కామర్స్ అవగాహన సదస్సు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్వర్యంలో ఈ నెల 28న వ్యాపార ప్రణాళిక-వ్యాపారాభివృద్ధి వ్యూహం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విజయవాడ రీజియన్ చైర్మన్ మలినేని రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సదస్సు ఉంటుందని పాల్గొనేవారు 9848077227 నెంబరుకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

సమస్యల కల్లోలం

● కరెన్సీనగర్‌లో దోమలతో ప్రతిరోజూ యుద్ధమే ● డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త.. పారని మురుగు ● ఇరుకుగా మారిన రోడ్లు ● అధికారులు పట్టించుకోవాలని కాలనీ వాసుల వేడుకోలు



డ్రెయినేజీలో గేదెల సంచారం..

(భారతీనగర్ - ఆంధ్రజ్యోతి): రాత్రయితే చాలు ప్రతి ఒక్కరూ దోమలతో యుద్ధం చేయాల్సిందేనని కరెన్సీనగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూర్పు నియోజకవర్గంలోని 3వ డివిజన్ పరిధిలోని జాతీయరహదారికి అనుకుని, రామవరప్పాడు సెంటర్ చేరువలో ఈ కరెన్సీ నగర్ కాలనీ ఉంది. కొంతకాలంగా ఈ కాలనీలో ప్రధాన సమస్యలపై అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ప్రస్తుతం సమస్య మరింత తీవ్రతరంగా మారింది. ప్రస్తుతం కాలనీలో ప్రధాన, అంతర్గత రోడ్లో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పూడికతో నిండిపోయాయి. కృష్ణ ఎన్‌క్లేవ్, పంటకాలువ సమీపంలోని ఖాళీస్థలాల్లో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. అంతర్గత రోడ్లో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు స్థానికులను భయపెడుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతున్న పంట కాలువ, సర్వీస్ డ్రైనేజీలు, పల్లంగా మారిన పాతూరి వారి వీధి, కేతినేని వారి వీధి వంటి అంతర్గత రోడ్లు, సరిహద్దు రోడ్లపై పెరుకుపోతున్న చెత్త, అసంపూర్తిగా మారిన డ్రైనేజీ పనులు, కాలనీ అంతర్గత రోడ్డుపై రోజుల తరబడి నిల్వ ఉంటున్న బిల్డింగ్ మెటీరీయల్‌తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

విజృంభిస్తున్న దోమలు

కాలనీకి ప్రధానంగా బాయినబాబ్జీ రోడ్లో పంటకాలువ ఉంది. ఇందులో నిత్యం మురుగునీరు ప్రవహించడంతో పాటు చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి దోమలకు అవాస కేంద్రంగా మారింది. కాలనీలో మరొక పక్క కాలనీ సరిహద్దు రోడ్డు రామవరప్పాడు పంచాయతీ డ్రైనేజీల్లో నిత్యం మురుగు ప్రవహించడంతో దోమలు వృద్ధి బాగా పెరిగి పగలు, రాత్రీ తేడా లేకుండా దాడి చేస్తున్నాయి.

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

కాలనీలోని పంటకాలువతో పాటు ప్రధాన, సైడ్ డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. కాలువలు మొత్తం పూడికతో నిండి ప్రధాన డ్రైనేజీల్లో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నీరు నిల్వతో దుర్వాసన వస్తున్నాయి.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో పలువురు వాహనదారులు తమ కాలనీ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు వాహనదారులు తమ గమ్యానికి త్వరగా చేరాలనే ఉద్దేశంతో వేగంగా వస్తున్నారు. ఆ సమయంలో చిన్నారులు, వృద్ధులు బయట నడవాలంటే భయపడుతున్నారు. కాలనీ మెయిన్, ప్రధాన రోడ్లపై పలుచోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పెద్దలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారిన ఖాళీ స్థలాలు

ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు, మురుగు నీరు చేరడంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. నివాసాల మధ్యనున్న ఖాళీస్థలాల గురించి స్థల యజమానులు, అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు తమ నివాసాల్లోని చెత్త, ఇతర వ్యర్థాలను అందులో పడేయడంతో ఆయా స్థలాలు మినీ డంపింగ్ యార్డుల్లా మారుతున్నాయి.



కృష్ణా ఎన్‌క్లేవ్ సమీపంలో ఖాళీస్థలంలో పిచ్చిమొక్కలు



రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్త

పంటకాలువ డ్రెయిన్‌లో అవస్థలు

కరెన్సీనగర్ కాలనీ ప్రధాన రోడ్లలో బాయినబాబ్జీ రోడ్డు ఒకటి. ఈ రోడ్డు ఆయుష్ సెంటర్ నుంచి బల్లెం వారి వీధి (గుంటతిప్ప డ్రెయిన్) వరకు ఉంటుంది. ఈ రోడ్డు పక్కనే పంటకాలువ ప్రవహిస్తుంది. ఈ రోడ్డు మొదట్లో వెడల్పుగా ఉన్నా కనకదుర్గానగర్ కాలనీ సమీపానికి వచ్చేసరికి ఇరుకుగా మారింది. కనకదుర్గానగర్, శ్రీరామచంద్ర నగర్ కాలనీ, గణేష్ నగర్ కాలనీల్లో భవన సముదాయాలు పెరగడంతో పాటు జాతీయ రహదారులు రద్దీ పెరిగి వాహనాల రాకపోకలు ఎక్కువయ్యాయి. దీంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

విద్యతో పాటు సంప్రదాయాలు తెలుసుకోవాలి

పటమట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు దేశ సంస్కృతీ, సంప్రదాయాలను తెలుసుకొని భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా రాణించాలని కృష్ణా వర్సిటీ ప్రొఫెసర్ ఎం.బసవేశ్వరరావు అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో కాస్మిక్ కార్నివాల్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్ సేవా కార్యక్రమాల్లో పాల్గొని తమ సేవా దృక్పథాన్ని చాటుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బీ క్విజ్, స్కేల్ లాంజ్, టాలెంట్ షో, డిబేట్, ఐపీఎల్ ఆక్షన్ లాంటి పోటీలు నిర్వహించి విజేతలకు షీల్డ్ అందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వీర్రాజు, కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ సుగుణ, అకడమిక్ డైరెక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం : గద్దె

భారతీనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కూటమి బలపరిచిన ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ఉమ్మడి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ గణేష్ నగర్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరపున ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్‌కు యువత సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉందన్నారు. మండలిలో వాటిపై చర్చించి, సీఎం చంద్రబాబును ఒప్పించి పరిష్కరించగల నేత అని అన్నారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. తాడి బాబూరావు, గుళ్లపల్లి నారాయణరావు, ధనేకుల యలమందరావు, పి.సీతారామయ్య, కోటేశ్వరరావు, పాతూరి సాంబశివరావు, గద్దె రమేష్, సత్యనారాయణరాజు కోమలి పాల్గొన్నారు.



గణేష్ నగర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తదితరులు

సబ్జి కూలర్ రైతులకు ఉపయోగకరం

పటమట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైతుబజారులో మిగిలిపోయిన కూరగాయలు నాణ్యత కోల్పోకుండా రెండు, మూడు రోజులు నిల్వ చేసుకునేందుకు ఎలాంటి విద్యుత్ ఖర్చు లేకుండా కేవలం నీటితో పని చేయడం సబ్జీ కూలర్ ప్రత్యేకతని మార్కెటింగ్‌శాఖ డీఎమ్ విజయ్ సునీత పేర్కొన్నారు. ఆదివారం ఆమె పటమట రైతు బజారులో సబ్జీ కూలర్ పనితీరును పరిశీలించి మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాలకు, రైతులకు, రైతు సంఘాలకు మిగిలిన ఇతర క్యేటగిరిల వారికి 50శాతం రాయితీతో సబ్జీ కూలర్‌ను అందిస్తుందన్నారు. ఆర్‌జేడీ కె.శ్రీనివాసరావు, డీడీలు ఎమ్.దివాకర్, లావణ్య, డాట్మే కె.మంగమ్మ, రైతు బజారు ఈవో ఎం.రమేష్‌బాబు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరిపై దాడికి ఏపీడబ్ల్యూజేఎఫ్ ఖండన

కృష్ణలంక: పార్వతీపురం మన్యం, మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు చేసిన దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక ఏ వెంకం పేట నుంచి కాశీపట్నం వెళ్లే నూతన రహదారి వద్ద వేణుగోపాల్ నాయుడిని కలవడానికి వెళ్లిన విలేకరి రామారావుపై టీడీపీ నేత బూతులు తిట్టడమే కాకుండా చేయి చేసుకొన్నారన్నారు. వేణుగోపాల్ నాయుడుపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుపై జరిగిన ఈ దాడికి ఎక్కడికక్కడ నిరసన తెలపాలని ఫెడరేషన్ కమిటీలను వారు కోరారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ రాత పరీక్ష ప్రశాంతం



కృష్ణలంక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఎన్‌సీసీ సర్టిఫికెట్ రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. కాకినాడ గ్రూప్ పరిధిలో ఎన్‌సీసీ యూనిట్లకు ఆదివారం స్థానిక నలంద విద్యానికేతన్, పీబీ సిద్ధార్థ కళాశాల, ఆంధ్రా లయోలా కళాశాలలో రాతపరీక్షను నిర్వహించారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ నేతృత్వంలో పరీక్షలు జరిగాయి. శనివారం సి సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించగా ఆదివారం రాతపరీక్షను నిర్వహించారు. ఎన్‌సీసీలో మూడేళ్లపాటు శ్రమించి నేర్చుకొన్న పలు అంశాలకు సంబంధించి నిర్వహించిన పరీక్షకు క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొని పరీక్ష రాశారు. నలంద విద్యానికేతన్‌లో ఫోర్ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్ సింగ్ పర్యవేక్షణలో నిర్వహించిన రాత పరీక్షలో 16, 17 బెటాలియన్‌కు చెందిన 280 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పరీక్షకు హాజరయ్యారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ మాట్లాడుతూ నగరంలో మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామని, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పరీక్ష రాశారన్నారు.

మాజీ ప్రజాప్రతినిధుల సమస్యలు పరిష్కరించాలి

● సీఎంకు మాజీ ఎమ్మెల్సీ శివారెడ్డి లేఖ

లబ్బీపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మాజీ ప్రజాప్రతినిధుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రజాప్రతినిధుల ఫోరమ్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్టు ఫోరమ్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎంవీ శివారెడ్డి తెలిపారు. ఆదివారం హోటల్ డీవీ మానర్‌లో ఫోరమ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించామని, నాలుగేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో మాజీ ప్రజాప్రతినిధులకు ఇస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్‌లోనూ మాజీలకు పెన్షన్ విధానం అమలు, సక్రమంగా మందులు పంపిణీ, తిరుపతి వంటి దేవస్థానాలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో తగిన ప్రాధాన్యత అందించాలన్నారు. అలాగే ఢిల్లీతో పాటు ఇతర నగరాల్లో వసతి, ప్రొటోకాల్ గౌరవం, ఫోరమ్ కార్యకలాపాల నిర్వహణకు అసెంబ్లీ ప్రాంగణంలో ప్రత్యేక గది, తగిన సిబ్బంది అందించాలని కోరేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. ఈ అంశాలను లేఖ ద్వారా ముఖ్యమంత్రికి పంపాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అంబటి హరిప్రసాద్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఫోరమ్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పసల కనక సుందరరావు, ఫోరమ్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే అంబటి హరిప్రసాద్ పాల్గొన్నారు.

విజయవంతంగా ల్యారింజెక్టమీ

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్వరపేటిక కేన్సర్‌తో ప్రభుత్వాసుపత్రిలో చేరిన ఆటోడ్రైవర్ సుదర్శన్ (53)కు ఈఎన్‌టీ వైద్య శాఖాధిపతి డాక్టర్ కొణిదె రవి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.లీలాప్రసాద్, డాక్టర్ జి.బి శ్రీనివాస్, డాక్టర్ కె.ఆదిత్య ల్యారింజెక్టమీ చేశారు. ఆపరేషన్ అనంతరం రోగి ఆరోగ్యంగా ఉన్నాడన్నారు. మత్తు వైద్యుడు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ కిరణ్, డాక్టర్ సుష్మ, డాక్టర్ చరణ్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. వారందరినీ ప్రిన్సిపల్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.



సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న శ్రీనివాసరావు, పూర్ణిమ

ముగిసిన మహిళా ఉత్సవ్

మొగల్రాజపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా ఆధ్వర్యంలో వారం రోజులుగా మొగల్రాజపురం మొగల్ హాలులో నిర్వహిస్తున్న మహిళా ఉత్సవ్ ఆదివారం ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుకు వెళుతున్నారని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తులను ప్రజలకు చేరువచేయడానికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు జనశిక్షణా సంస్థాన్ చేస్తున్న కృషిని అభినందించారు. సంస్థాన్ డైరెక్టర్ ఏ పూర్ణిమ అధ్యక్షత వహించారు. అనంతరం ఉత్సవ్‌లో స్టాల్స్ నిర్వహించిన మహిళా పారిశ్రామిక వేత్తలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు బహూకరించారు. శిక్షకులు, శిక్షణార్థులు, మహిళలు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న శ్రీనివాస్, కరం కౌర్ తదితరులు

హెల్మెట్‌ధారణతో ప్రాణాలను నిలుపుకోవచ్చు

లబ్బీపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి కే శ్రీనివాస్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో బందర్ రోడ్‌లోని గేట్ వే హోటల్లో హెల్మెట్ వాడకంతో కలిగే ప్రయోజనాలపై ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ హెల్మెట్ వాడకంతో ప్రమాదాలు బారి నుంచి తప్పించుకోవచ్చని, హెల్మెట్ నాణ్యతా ప్రమాణాలు కలిగినవాటిని వినియోగించాలన్నారు. హెల్మెట్ వాడకంతో ప్రమాదాలు సంభవించినప్పుడు తలకయ్యే గాయాల నుంచి తప్పించుకోవచ్చని, ముఖ్యంగా యువత ప్రమాదాల్లో విలువైన తమ ప్రాణాలను కోల్పోతున్నారని, శ్రమ అనుకోకుండా హెల్మెట్ వాడకాన్ని తప్పనిసరి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి హెల్మెట్లను ఉచితంగా అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షురాలు కరం కౌర్, కార్యదర్శి అరుణ్ సంపత్, క్లబ్ అడ్వైజర్ పార్థసారథి, క్లబ్ సభ్యులు మురళీ గర్రె, కేపి కిషన్, కిషోర్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు

అవయవదానానికి కస్టమ్స్ కమిషనర్ దంపతుల అంగీకారం పత్రం

వన్‌టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి, ఆయన శ్రీమతితో కలిపి 36మంది కస్టమ్స్ అధికారులు అవయవదానానికి అంగీకరించటం అభినందనీయమని అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు సీతామహాలక్ష్మి అన్నారు. తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన జాతీయ కస్టమ్స్ సెలబ్రేషన్లలో భాగంగాఅధికారులు అవయవదానానికి రిజిస్టర్ అయ్యారు. దాన పత్రాలు అందజేసిన వారికి సర్టిఫికెట్లు అందించి సత్కరించారు.



జనవరి 22న, "979 పోస్టులతో" యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్- 2025 విడుదలైంది. అయితే గత ఏడాది (2024లో) వెయ్యికి పైగా పోస్టులుండగా, అంతకుముందు సంవత్సరం (2023లో) 1100లకు పైగా పోస్టులున్నాయి. అయితే మొత్తం భర్తీ చేసే సర్వీసులను ఈ సారి 23కు పెంచడం జరిగింది (గత ఏడాది 21 సర్వీసులతో నోటిఫికేషన్ ఇచ్చారు). ఈసారి ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (IRMS)ను విభజించి, ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్, ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్-ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీస్‌లుగా చేయడంతో ఈసారి భర్తీ చేసే సర్వీస్‌ల సంఖ్య 23కు పెరిగింది.

యూపీఎస్సీ సివిల్స్ ప్రిపరేషన్ ప్లాన్

తాజా నోటిఫికేషన్‌లో మార్పులు

- సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్‌కు కనీస విద్యార్హత అయిన గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు హాజరుకావచ్చు. గతంలో వీరు కేవలం ప్రిలిమినరీ వరకు మాత్రమే అవకాశం ఉండేది, మెయిన్స్ పరీక్షలకు హాజరు కావాలంటే మాత్రం గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ సమర్పించాలి. ప్రస్తుతం ఇంటర్వ్యూకి ముందు నిర్దేశిత గడువులోగా ఉత్తీర్ణత సర్టిఫికేట్ సమర్పిస్తే చాలు.
- రిజర్వేషన్లు, వయోపరిమితి సడలింపులు కోరుతున్న అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ప్రిలిమినరీ అప్లికేషన్‌లోనే సమర్పించాలి. గతంలో ఈ నియమం ప్రిలిమ్స్ దశలో లేదు.
- ఆదేవిధంగా OBCలు కుల ధృవీకరణ పత్రంతో పాటుగా, నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్‌ను కూడా దాఖలు చేయాలి. నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్ గడచిన మూడు ఆర్థిక సంవత్సరాలు(2021-22, 2022-23, 2023-245) సంబంధించినదై ఉండాలి OBC సర్టిఫికేట్ 01-04-2024 మరియు 11-02-2025 మధ్య జారీ అయినదై వుండాలి .
- EWS రిజర్వేషన్‌కు అర్హులైనవారు కూడా, 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, నిర్ణీత అధికారిచే 01-04-2024 మరియు 11-02-2025 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వ క్రైటీరియా ప్రకారం జారీ చేయబడిన ఇన్ కమ్ అండ్ అసెట్ సర్టిఫికెట్‌ను ప్రిలిమినరీ అప్లికేషన్ దశలోనే సమర్పించాల్సి వుంటుంది.
- ఈసారి "సర్వీస్ ప్రిఫరెన్స్"లను కూడా ప్రిలిమినరీ ఎగ్జామ్ అప్లికేషన్‌లోనే ఎంచుకోవాల్సి ఉంది. అదేవిధంగా "క్యాడర్ ప్రిఫరెన్స్"లను ప్రిలిమ్స్ పరీక్ష అయిన 10 రోజుల తరువాత సమర్పించాలి.
- UPSC పరీక్షకు వన్ టైమ్ రిజిస్ట్రేషన్ అనేది తప్పనిసరి. తొలిసారిగా పరీక్షకు హాజరయ్యేవారు ముందుగా UPSC వెబ్‌సైట్‌లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాలి. ఈ వన్ టైమ్ రిజిస్ట్రేషన్లో సమర్పించిన వివరాలను (డేట్ ఆఫ్ బర్త్ మినహా), సమర్పించిన తేదీ నుండి 2025 ఫిబ్రవరి 25 లోపుగా ఎప్పుడైనా సవరించుకోవచ్చు.

పరీక్ష విధానం:

భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన పోటీ పరీక్షల్లో యూపీఎస్సీ సీఎస్ఈ ఒకటి. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) మరియు ఇతర కేంద్రప్రభుత్వ సర్వీస్‌లకు అభ్యర్థులను ఎంపిక చేయడానికి యూపీఎస్సీ ఈ పరీక్షను నిర్వహిస్తుంది.

- **పరీక్ష విధానం:** యూపీఎస్సీ సీఎస్ఈ పరీక్ష మూడు దశలలో జరుగుతుంది.
- **మొదటి దశ:** ప్రిలిమినరీ ఎగ్జామినేషన్
- **రెండవ దశ:** మెయిన్ ఎగ్జామినేషన్ (మెయిన్స్)
- **మూడో దశ:** పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)
- మెయిన్స్, ఇంటర్వ్యూ మార్కులు కలిపి ఫైనల్ ర్యాంక్ లిస్టును ఇస్తారు.

ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ (ప్రిలిమ్స్): ఇది మొదటి దశ, ఇందులో రెండు ఆబ్జెక్టివ్ తరహా పేపర్లు ఉంటాయి.

జనరల్ స్టడీస్ పేపర్-1: ఇందులో హిస్టరీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ జనరల్ నాలెడ్జ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సీశాట్) పేపర్ 2: పేపర్-2లో కాంప్రహెన్షన్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, లాజికల్ రీజనింగ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, బేసిక్ న్యూమరసీ, ఇంగ్లీష్ లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి(ఒక్కో పేపర్ 200 మార్కులకి ఉంటుంది).

దిక్సూచి DIKSUCHI

- CSAT కేవలం క్వాలిఫైంగ్ పేపర్ మాత్రమే. దీనిలో తప్పనిసరిగా 200 మార్కులకి 33%/66 మార్కులు రావాలి.
- పేపర్ 1 మాత్రం కట్ ఆఫ్ మార్కులు ఉంటాయి. ప్రతి సంవత్సరం కట్ ఆఫ్ మార్కు మారుతూ ఉంటుంది.

మెయిన్స్: రాత పరీక్ష. ఇందులో తొమ్మిది పేపర్లు ఉంటాయి. ఇవి అభ్యర్థి పరిజ్ఞానాన్ని, లోతుగా పరీక్షిస్తాయి. నిజ జీవిత సంఘటనలను అభ్యర్థులు ఏ విధంగా అర్థం చేసుకోగలుగుతున్నారో అంచనా వేస్తాయి.

తప్పనిసరి పేపర్లు: పేపర్ ఏ(ఇండియన్ లాంగ్వేజ్), పేపర్ బి(ఇంగ్లిష్) ఈ రెండు పేపర్లు ఒక్కో పేపర్‌కి 300 మార్కులు ఉంటాయి. ఒక్కో పేపర్‌లో తప్పనిసరిగ్గా 75 మార్కులు సాధించాలి.

పేపర్ 1: జనరల్ ఎస్సే | **పేపర్ 2:** జనరల్ స్టడీస్-1
పేపర్ 3: జనరల్ స్టడీస్-2 | **పేపర్ 4:** జనరల్ స్టడీస్-3
పేపర్ 5: జనరల్ స్టడీస్-4 | **పేపర్ 6:** ఆప్షనల్ పేపర్ -1
పేపర్ 7: ఆప్షనల్ పేపర్-2 (ఒక్కో పేపర్ 250 మార్కులు)

పర్సనాలిటీ టెస్ట్(ఇంటర్వ్యూ): అభ్యర్థుల వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, వారి పరిపాలన సామర్థ్యాన్ని అంచనా వేస్తారు(దీనికి 275 మార్కులు).

అర్హతలు:

వయోపరిమితి: అభ్యర్థుల వయస్సు 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి(కేటగిరీలను అనుసరించి సడలింపు ఉంటుంది).

విద్యార్హతలు: బ్యాచిలర్ డిగ్రీ

ఎన్నిసార్లు రాయవచ్చు: అభ్యర్థులు తమ కేటగిరీని బట్టి (జనరల్ కేటగిరీ అభ్యర్థులు-6 సార్లు, ఓబీసీ-9 సార్లు, ఎస్సీ/ ఎస్టీ-అపరిమితం) పరిమిత సంఖ్యలో రాయవచ్చు.

ఆప్షనల్ సబ్జెక్టులు(మెయిన్స్‌కి మాత్రమే): నోటిఫికేషన్‌లోని జాబితా నుంచి ఒక ఆప్షనల్ సబ్జెక్టును ఎంచుకోవాలి.

పరీక్ష షెడ్యూలు: ప్రతి ఏడాది ఫిబ్రవరి/మార్చిలో నోటిఫికేషన్ వెలువడుతుంది. ప్రిలిమినరీ పరీక్ష మే/జూన్‌లో, మెయిన్స్ సెప్టెంబర్/అక్టోబర్‌లో, ఇంటర్వ్యూను మరుసటి సంవత్సరం ఫిబ్రవరి/మార్చిలో నిర్వహిస్తారు.

ప్రిపరేషన్: సిలబస్ చాలా విస్తృతంగా ఉంటుంది, పరీక్ష సంక్లిష్టత కారణంగా చాలా మంది అభ్యర్థులు ఏడాది లేదా అంతకంటే ఎక్కువ కాలంపాటు ప్రిపేర్ అవుతారు. చాలా మంది కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, స్టడీ మెటీరియల్, ఆన్‌లైన్ రిసోర్సెస్, కరెంట్ అఫైర్స్ అప్‌డేట్స్‌పై ఆధారపడతారు.

- ప్రిపరేషన్‌లో నిరంతరం చదవడం, రైటింగ్ ప్రాక్టీస్, ప్రాక్టీస్ ఎగ్జామ్స్ రాయాలి.
- సంక్షిప్తంగా, యుపీఎస్సీ సీఎస్ఈ అనేది భారతదేశంలోని పరిపాలనా వ్యవస్థలో ఉన్నతమైన పదవులకు అత్యంత సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేసే సవాలుతో కూడిన పరీక్ష. దీనికి క్రమశిక్షణ, అంకితభావం, విభిన్న అంశాలపై సమగ్ర అవగాహన అవసరం.

స్టడీ మెటీరియల్: మార్కెట్‌లో రకరకాల స్టడీ మెటీరియల్స్ ఉన్నాయి. ఇందులో ఆన్‌లైన్ మెటీరియల్స్ కోచింగ్‌లు అధిక సంఖ్యలో అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఎంపిక చాలా జాగ్రత్తగా ఉండాలి.



ఎం. బాలలత,
సివిల్స్ మెంటార్

షైనింగ్ కెరీర్ ఫుట్‌వేర్ డిజైనింగ్

ఒక వ్యక్తి ఆహార్యాన్ని ఉన్నతంగా రూపొందించడంలో మేకప్, దుస్తులతో సమాన ప్రాధాన్యం పాదరక్షలది కూడా. ఆకట్టుకునే బట్టలు కట్టుకున్న వ్యక్తి ఆకు చెప్పులతో తిరిగితే ఎబ్బెట్టుగా ఉంటుంది. సమయానికి అనుగుణమైన పాదరక్షలు ధరిస్తే సౌకర్యవంతంగా, హుందాగా ఉంటుంది. పాదరక్షల తయారీ అనేది ఒక పెద్ద ఇండస్ట్రీ. అందుకే భారతదేశంలో ప్రధాన రంగాల్లో లెదర్ ఇండస్ట్రీ ఒకటిగా ఎదిగింది. దేశ జాతీయ ఉత్పత్తిలో రెండు శాతం వాటా ఉన్న ఈ రంగం, దాదాపు 44 లక్షల మందిపైగా ఉద్యోగాలు కల్పిస్తోంది. లెదర్ ఇండస్ట్రీని మార్కెట్‌కు అనుగుణంగా తీర్చిదిద్దడంలో 'ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్'(ఎఫ్‌డీడీఐ)లు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.



ఇంజనీరింగ్ చదువులకు ఐఐటీ, మేనేజ్‌మెంట్ కోర్సులకు ఐఐఎమ్, దుస్తుల ఫ్యాషన్‌కు నిఫ్ట్ ఎలాగో ఫుట్‌వేర్ చదువులకు ఎఫ్‌డీడీఐ అలాంటిది. దేశ వ్యాప్తంగా హైదరాబాద్‌తో సహా నోయిడా, కోల్‌కొతా, రోహ్‌తక్, రాయ్‌బరేలీ, జోధ్‌పూర్, చెన్నై, చింద్వారా, చండీగడ్, గుణ, అంకలేశ్వర్, పట్నల్లో 12 ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో 2025-26 అకడమిక్ సంవత్సరం యూజీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ వెలువడింది. ఆల్‌ఇండియా సెలెక్షన్ టెస్ట్-2025 (ఏఐఎస్‌టీ-2025) ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

బ్యాచిలర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు:

1. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీడీఎస్): నాలుగు సంవత్సరాల కోర్సు ఇది. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి.

- బీడీఈఎస్(ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్)
- బీడీఈఎస్(ఫ్యాషన్ డిజైన్)
- బీడీఈఎస్(లెదర్, లైఫ్ స్టయిల్ అండ్ ప్రొడక్ట్ డిజైన్)

2. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ): నాలుగు సంవత్సరాల కోర్సు ఇది. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి.

- బీబీఏ(రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్)

మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు

1. మాస్టర్ ఆఫ్ డిజైన్(ఎండీఎస్): రెండు సంవత్సరాల కోర్సు ఇది. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

- ఎండీఈఎస్(ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్)
- ఎండీఈఎస్(ఫ్యాషన్ డిజైన్)

2. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ): ఎంబీఏ(రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్)

అర్హతలు: బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు ఇంటర్‌మీడియేట్, మాస్టర్ డిగ్రీ కోర్సులకు ఏదైనా డిగ్రీ పాసై ఉండాలి.

వయస్సు: బ్యాచిలర్ డిగ్రీలో చేరాలనుకునే వారి వయస్సు 25 సంవత్సరాలలోపు ఉండాలి. పీజీ కోర్సులకు వయోపరిమితి లేదు.

చివరి తేదీ: ఏప్రిల్ 20 | **ఎంట్రెన్స్ తేదీ:** మే 11
ఫలితాలు: 2025 జూన్ | **మొత్తం సీట్లు:** 2390
వెబ్‌సైట్: https://fddiindia.com/

ఐఐటీల్లో ఏఐ కోర్సులు

ఐఐటీలాంటి సంస్థల్లో చదువుకోలేక పోతున్నాం అని బాధ పడాల్సిన అవసరమే వద్దు. దేశంలోని చాలా ఐఐటీలు పలు విభాగాలకు సంబంధించిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఐఐటీ ఫ్యాకల్టీల ఆధ్వర్యంలో నడిచే ఈ కోర్సుల్లో చేరితే తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో వీటిని పొందవచ్చు. వీటికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంటుంది. తమ రెగ్యులర్ చదువులు కొనసాగిస్తూనే వీటిలో చేరవచ్చు. రాబోయే కాలం అంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌దే. దీనిని దృష్టిలో ఉంచుకుని ఐఐటీ మద్రాస్, రూర్కీలు కొన్ని కోర్సులను రూపొందించాయి.

ఐఐటీ మద్రాస్: వర్కింగ్ ప్రొఫెషనల్స్‌ను ఉద్దేశించి ఐఐటీ మద్రాస్ 'వెబ్ ఎంటెక్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' కోర్సును ప్రారంభించింది. 2025 మే 31లోపు ఈ కోర్సులో చేరవచ్చు. దీనితోపాటుగా ఏరోస్పేస్ ఇంజనీరింగ్(ఏరో స్పేస్, అమ్యునిషన్ టెక్నాలజీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ), ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ అండ్ సిస్టమ్స్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, మల్టీ మీడియా, మైక్రో ఎలక్ట్రానిక్స్), మెకానికల్ ఇంజనీరింగ్(మెకానికల్ డిజైన్, ఆటోమోటివ్ టెక్నాలజీ), ఈ మొబిలిటీ తదితర కోర్సులు ఉన్నాయి. వివరాల కోసం code.iitm.ac.in/webmtech వెబ్‌సైట్ చూడవచ్చు.

ఐఐటీ రూర్కీ: ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఏఐ, జెన్ ఏఐ, ఎజెంటిక్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్స్'లలో పీజీ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ఇది పదకొండు నెలల ప్రోగ్రామ్. లైవ్, రికార్డెడ్ సెషన్స్‌లో ఉంటుంది. ఇంజనీరింగ్ విద్యార్థులకు హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ ఉండేలా డిజైన్ చేశారు. వివరాల కోసం www.iitr.ac.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

చిత్రజ్యోతి
SINCE 1965

ఆషికి-3లో శ్రీలీల



పుష్ప-2 సినిమాలో కిస్సిక్ పాటతో అభిమానులను అలరించారు కథానాయిక శ్రీలీల. కొంతకాలంగా ఆమె బాలీవుడ్ అరంగేట్రంపై ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు అధికారిక ప్రకటన వచ్చింది. 'ఆషికీ 3' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికయ్యారు. ఇందులో కార్తిక్ ఆర్యన్ సరసన శ్రీలీల కనిపించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ టీజర్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. అనురాగ్ బసు దర్శకత్వంలో టీ సిరీస్, అనురాగ్ బసు ప్రొడక్షన్స్ బ్యానర్లపై భూషణ్ కుమార్, కృష్ణ కుమార్ నిర్మిస్తున్నారు. కాగా, టీజర్‌లో బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ 'ఆషికి-2'కి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతున్నట్లు అర్థమవుతోంది. 1990లో 'ఆషికి' మొదటి భాగం విడుదలై మన విజయం సాధించింది. ఆ తర్వాత 2013లో 'ఆషికి-2' వచ్చింది. ఈ చిత్రం దాదాపు రూ.100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా వస్తున్న 'ఆషికి-3'లో శ్రీలీల నటిస్తుండటం ఆమె అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కాగా, ఈ చిత్రాన్ని దీపావళికి విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

ఆదరణ ఆనందాన్నిస్తోంది



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తండేల్'. ఈ చిత్రానికి దక్కుతున్న ఆదరణ పట్ల చిత్రబృందం సంతోషాన్ని వ్యక్తం చేసింది. అక్కినేని అభిమానులకు సూపర్‌హిట్‌చిత్రాన్ని అందిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని ఆదివారం చిత్రబృందం తెలిపింది. నాగచైతన్య, సాయిపల్లవి నటన, చందు మొండేటి దర్శకత్వ ప్రతిభతో ఈ అద్భుతం సాధ్యమైందని పేర్కొంది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం రూ.వంద కోట్ల క్లబ్‌లో చేరిన విషయం తెలిసిందే.



అందుకోసమే ఆ చీర దాచుకున్నా

- సాయిపల్లవి

జాతీయ అవార్డు కోసం ఎదురు చూస్తున్నానని, అవార్డుల ప్రదానోత్సవానికి అమ్మమ్మ ఇచ్చిన చీర కట్టుకుని వెళ్లే సమయం కోసం వేచి చూస్తున్నానని సాయిపల్లవి తెలిపారు. తన అభినయంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్న ఈ భామ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో జాతీయ అవార్డు కోసం ఎదురుచూడటం వెనక ఉన్న బలమైన కారణాన్ని వివరించారు. 'జాతీయ అవార్డు అందుకోవాలని ఎంతో ఆశగా ఉంది. నాకు 21 ఏళ్ల వయసు ఉన్నప్పుడు మా అమ్మమ్మ ఓ చీర ఇచ్చి, నా పెళ్లిలో కట్టుకోమ్మంది. అప్పటికి నేనింకా సినిమాల్లోకి రాలేదు. కనుక పెళ్లి చేసుకునేటప్పుడు కట్టుకుందామనుకున్నా. ఆ తర్వాత మూడేళ్లకు సినిమాల్లో నటించడం మొదలు పెట్టా. నా తొలి చిత్రం 'ప్రేమమ్'లో నటిస్తున్నప్పుడే ఏదో ఒక రోజు జాతీయ స్థాయి అవార్డును అందుకోగలననే నమ్మకం ఏర్పడింది. ఆ రోజు అమ్మమ్మ ఇచ్చిన చీర కట్టుకుని అవార్డుల ప్రదానోత్సవానికి హాజరవ్వాలని నిర్ణయించుకున్నా. అవార్డును అందుకున్నా... అందుకోకపోయినా చీర కట్టుకోవాలనే ఒత్తిడి ఉండనే ఉంటుంది' అని చెప్పారు సాయిపల్లవి. కాగా, 'గార్గి' చిత్రానికి గాను జాతీయ అవార్డు వస్తుందని సాయిపల్లవి అభిమానులు ఎంతగానో ఆశించారు. చివరకు నిరాశే ఎదురైంది.

మల్లయుద్ధం నేపథ్యంలో



తమిళ హీరో శివకార్తికేయన్, దర్శకుడు మురుగదాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'ఎస్‌కె23'(వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంలో సప్త సాగర దాచె ఎల్లో(సప్త సాగరాలు దాటి) ఫేమ్ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో చెన్నైలో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో మల్లయుద్ధం నేపథ్యంలో సాగే పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రం టైటిల్‌ను నేడు ప్రకటించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

తొలి తెలుగు మహిళా నిర్మాత
కృష్ణవేణి అస్తమయం

తెలుగు వారి ఆరాధ్య నటుడు నందమూరి తారకరామారావును వెండితెరకు పరిచయం చేసిన సినిమా 'మనదేశం'. జాతీయోద్యమ స్ఫూర్తిని కళ్లకు కట్టిన మొట్టమొదటి చిత్రరాజం కూడా ఇదే.! ఈ చిత్ర నిర్మాత, కథానాయకి, తెలుగు సినిమా చరిత్రకు నూరు వసంతాల సజీవ సాక్షి, ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత మేకా కృష్ణవేణి ఆదివారం కన్నుమూశారు.




తెలుగు సినిమా రంగంలో తొలితరం నాయిక, తొలి మహిళా నిర్మాతగా ఖ్యాతి గడించిన మేకా కృష్ణవేణి ఆదివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. తెలుగు సినిమా చరిత్రలో ఆమెది ఓ ప్రత్యేక అధ్యాయం. తొలితరం నటిగా, గాయనిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా తనదైన ముద్రను వేశారు కృష్ణవేణి. 1924, డిసెంబర్ 24న పశ్చిమ గోదావరి జిల్లా పంగిడి గ్రామంలో కృష్ణవేణి జన్మించారు. బాల్యం నుంచి నాటకాలంటే కృష్ణవేణికి ఆసక్తి ఎక్కువ. బాల తారలతో 'అనసూయ' చిత్రాన్ని రూపొందించాలని భావించిన దర్శకులు సి. పుల్లయ్య రాజమండ్రిలో కృష్ణవేణి నటించిన 'తులాభారం' నాటకాన్ని చూసి టైటిల్ రోల్‌కు ఆమెను ఎంపిక చేశారు. అప్పుడు కృష్ణవేణి వయసు పది సంవత్సరాలు. ఈ సినిమా నిర్మాణం మొత్తం కోల్‌కతాలో జరిగింది. ఆ తర్వాత ఆమె తిరిగి రాజమండ్రి వచ్చి నాటకాలు వేయడం ప్రారంభించారు. అదే సమయంలో ఆమె తండ్రి డాక్టర్ కృష్ణారావు కన్నుమూశారు. దాంతో తల్లి, చిన్నానల ప్రాపకంలో పెరిగింది. 1937లో సి.ఎస్.ఆర్. ఆంజనేయులు ఆమెను ప్రోత్సహిస్తూ చెన్నయ్ తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆమె 'తుకారం' సినిమాలో నటించారు. అలా కొన్ని చిత్రాలలో బాల నటిగా రాణించారు.

'కచదేవయాని'తో హీరోయిన్‌గా

కృష్ణవేణి హీరోయిన్ గా నటించిన తొలి చిత్రం 'కచదేవయాని' 1938లో వచ్చింది. ఆ తర్వాత ఆమె దాదాపు ఇరవై సినిమాలలో నటించారు. 1939లో 'మహానంద' చిత్రంలో నటిస్తుండగా ప్రసిద్ధ దర్శక నిర్మాత మీర్జాపురం రాజా తో పరిచయం అయ్యింది. అది ప్రేమగా మారి 1940లో వారు విజయవాడలో వివాహం చేసుకున్నారు. వివాహానంతరం భర్త కోరిక మేరకు కృష్ణవేణి బయటి చిత్రాలలో నటించలేదు. సొంత చిత్రాలలోనే నటించారు. అలానే తమ శోభనాచల స్టూడియోస్ వ్యవహారాలను పర్యవేక్షించారు. అదే బ్యానర్ లో పలు చిత్రాలను నిర్మించారు. ఈ బ్యానర్ లో వచ్చిన తొలి సాంఘిక చిత్రం 'జీవనజ్యోతి' ద్వారానే చదలవాడ నారాయణరావు హీరోగా పరిచయం అయ్యారు. నటిగా కెరీర్ ప్రారంభించినప్పటి నుంచీ కృష్ణవేణి తన పాటలను తానే పాడుకున్నారు. విశేషం ఏమంటే ఆమె 'కీలుగుర్రం' సినిమాలో అంజలీదేవికి ప్లేబ్యాక్ పాడారు. త్రిపురనేని గోపీచంద్ 'లక్ష్మమ్మ' చిత్రాన్ని మొదట మాలతీతో మొదలు పెట్టినా ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. దానిని శోభనాచల స్టూడియోస్ టేకోవర్ చేసింది. దాంతో అందులో కృష్ణవేణి నాయికగా నటించారు. ఈ సినిమాకు పోటీగా అంజలీదేవి నాయికగా 'శ్రీ లక్ష్మమ్మ కథ' మొదలైంది. రెండూ పోటాపోటీగా జనం ముందుకు వచ్చాయి. అయితే కృష్ణవేణి నటించిన 'లక్ష్మమ్మ' చిత్రానికే జనాధరణ దక్కింది. ఇక 1947లో వచ్చిన 'గొల్లభామ' నటిగా కృష్ణవేణికి అఖండ కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెట్టింది. కేవలం కథానాయిక పాత్రలే కాకుండా భిన్నమైన పాత్రలను చేయాలని తపించారు. ఆమె 'తిరుగుబాటు' సినిమాలో వ్యాంప్ పాత్రను పోషించారు.

'మనదేశం'తో ఎన్టీఆర్‌కు తొలి అవకాశం

1942లో కృష్ణవేణి, మీర్జాపురం రాజా దంపతులకు అనూరాధాదేవి జన్మించారు. ఆమె పేరుతో ఎం.ఆర్.ఎ. అనే బ్యానర్ ను స్థాపించి, ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో కృష్ణవేణి 'మనదేశం' చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ద్వారానే ఎన్టీఆర్ చిత్రసీమకు పరిచయం అయ్యారు. బెంగాలీ భాషలో వచ్చిన 'విప్రదాసు' నవల ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఘంటసాల, రమేశ్ నాయుడుని సంగీత దర్శకులుగా పరిచయం చేశారు, పి. లీల, జిక్కీ లను గాయనీ మణులుగా, ఎర్రా అప్పారావును దర్శకుడిగా జనం ముందుకు తీసుకొచ్చింది కృష్ణవేణి! తొలితరం నటీమణులలో అత్యధిక పారితోషికం తీసుకున్న వ్యక్తి కూడా ఆమె. అప్పట్లోనే రూ.45 వేల పారితోషికం తీసుకున్నారామె. నటిగా కృష్ణవేణి చివరగా 'సాహసం' సినిమా చేశారు. అలానే నిర్మాతగా ఆమె చివరి చిత్రం 1957లో వచ్చిన 'దాంపత్యం'. ఆమె కుమార్తె అనూరాధాదేవి తల్లి అడుగుజాడల్లో నడుస్తూ పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. సినిమా రంగానికి కృష్ణవేణి అందించిన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రఘుపతి వెంకయ్య నాయుడు అవార్డుతో సత్కరించింది. ఇటీవల విజయవాడలో జరిగిన 'మనదేశం' వజ్రోత్సవ వేడుకల్లోనూ కృష్ణవేణి పాల్గొన్నారు. ఆ వేదికపై భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సత్కరించారు. ఆదివారం మహా ప్రస్థానంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.



సినీ నిర్మాత, నటి కృష్ణవేణి మృతి బాధాకరమని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కృష్ణవేణి తెలుగు సినీకీర్తిని దశదిశలా చాటారని కొనియాడారు. కృష్ణవేణి మృతికి సంతాపం తెలిపారు.



"నటీమణి, సినీ నిర్మాత కృష్ణవేణి గారి మరణం నన్ను బాధించింది. 'మనదేశం' చిత్రంతో ఎన్టీఆర్‌ను చిత్రరంగానికి పరిచయం చేసి కళారంగానికి వారు చేసిన సేవ మరువలేనిది"

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



"ఎన్టీఆర్ నట జీవితానికి తొలి అవకాశమిచ్చిన కృష్ణవేణి గారి మృతి బాధాకరం. నటి, నిర్మాత, స్టూడియో అధినేతగా ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించారు. ఆమె మృతి వ్యక్తిగతంగా మాకు తీరని లోటు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను"

- నందమూరి బాలకృష్ణ



తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తొలి మహిళా నిర్మాతగా గుర్తింపు పొందిన కృష్ణవేణి తుదిశ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

- ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

స్క్రీన్ టైమ్ తగ్గించాలంటే...

మొబైల్‌తో ఎక్కువ సమయం గడపడం వల్ల ప్రతి ఒక్కరి జీవితంలో డిజిటల్ స్క్రీన్ టైమ్ పెరిగిపోయింది. దీంతో శారీరక, మానసిక సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ స్క్రీన్ టైమ్‌ను ఎలా తగ్గించుకోవాలో తెలుసుకుందాం!

- నోటిఫికేషన్ ఆప్షన్‌ను సెట్‌చేసి పెట్టుకోవడం వల్ల అవి వచ్చిన ప్రతిసారీ చేస్తున్న పనిని ఆపి మొబైల్ చూడాలనిపిస్తుంది. అందుకే పని పూర్తయ్యే వరకూ ఈ ఆప్షన్‌ను ఆపి ఉంచుకోవడం మంచిది. దీంతో ఏకాగ్రతగా పనిచేసుకోగల్గుతాం.
- రంగులతో డిస్‌ప్లే ఉంటే తరచూ మొబైల్ చూడాలనిపిస్తుంది. అదే బ్లాక్ అండ్ వైట్ థీమ్‌లోకి మారిస్తే మనకు తెలియకుండానే మొబైల్ నుంచి ధ్యాస మళ్లుతుంది.
- భోజనం చేసే సమయంలో, రాత్రి పడుకునేటప్పుడు మొబైల్‌ను సాధ్యమైనంత దూరంలో ఉంచాలి. కుటుంబ సభ్యులతో, చుట్టుపక్కలవారితో మాట్లాడుతూ ఉంటే మొబైల్ గుర్తుకు రాదు.



- ప్రతి రోజూ కొంత సమయాన్ని డిజిటల్ బ్రేక్‌గా నిర్ణయించుకుని అనుసరించాలి. ఈ సమయంలో అత్యవసరమైతే తప్ప మొబైల్‌ను ముట్టుకోవద్దు. దీనివల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది.
- రాత్రిపూట మొబైల్‌లో అలారం సెట్ చేయవద్దు. దీనికోసం గడియారాన్ని ఉపయోగించడం మంచిది. బెడ్‌రూమ్‌లో మొబైల్ ఫోన్ ఉంచవద్దు.
- తరచూ వార్తాపత్రికలు, లేదా పుస్తకాలు చదువుతూ ఉంటే మొబైల్ చూసే అలవాటు నుంచి బయటపడవచ్చు. దీనివల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది.
- సోషల్ మీడియా వాడకాన్ని తగ్గించుకోవాలి. ఎక్కువగా రీల్స్ ఫొటోలు, మెసేజ్‌లు షేర్ చేసేవారిని మ్యూట్‌లో పెడితే కొంతవరకూ ప్రయోజనం ఉంటుంది.
- ఇష్టమైన మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్ నేర్చుకోవడం, మంచి పుస్తకాలు చదవడం, పిల్లలతో కలిసి ఆటలాడడం, వ్యాయామం చేయడం, ధ్యానం, నడక, గార్డెనింగ్ లాంటివి అలవాటు చేసుకుంటే డిజిటల్ స్క్రీన్ టైమ్‌ని తగ్గించుకోవచ్చు.

పెరుగుతో ఫేషియల్...

ముఖం అందంగా కనిపించాలని మహిళలు ఫేషియల్ చేయించుకుంటూ ఉంటారు. ప్రతిసారీ పార్లర్‌కి వెళ్లకుండా ఇంట్లో వుండే పెరుగుతో స్వయంగా ఫేషియల్ చేసుకుని ముఖాన్ని కాంతివంతంగా మార్చుకోవచ్చు. ఆ వివరాలు తెలుసుకుందాం!

- ముందుగా ముఖాన్ని సున్నిపిండితో శుభ్రం చేసుకోవాలి. ఒక గిన్నెలో రెండు గంటెల పుల్లని పెరుగును తీసుకుని చెంచాతో బాగా కలిపి చిక్కని మిశ్రమంలా చేయాలి. దీనిని వేళ్లతో కొద్దిగా తీసుకుంటూ ముఖమంతా పట్టించి అయిదు నిమిషాలు సున్నితంగా మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత చల్లని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే చర్మానికి తగినంత తేమ అంది ముఖం మెరుపు సంతరించుకుంటుంది. పెరుగులో ఉండే లాక్టిక్ యాసిడ్... నుదుటిపై ముడుతలు, గీతలు రాకుండా కాపాడుతుంది. అంతేకాదు బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేసి ముఖానికి సహజ కాంతిని అందిస్తుంది.
- ఒక గిన్నెలో రెండు గంటెల పెరుగు, ఒక చెంచా కాఫీ పొడి, రెండు చెంచాల పంచదార వేసి కలపాలి. పెరుగులో పంచదార కరగడానికి ముందే ఈ మిశ్రమాన్ని వేళ్లతో ముఖమంతా పట్టించాలి. నుదురు, చెంపలు, ముక్కు భాగాల్లో కింది నుంచి పైకి వేళ్లతో సున్నితంగా రుద్దాలి. ఈ మిశ్రమం చక్కని స్క్రబ్‌లా పనిచేసి చర్మ రంధ్రాలను శుభ్రం చేస్తుంది. చర్మం మీద పేరుకున్న మృతకణాలన్నీ తొలగిపోతాయి. తరచూ ఇలా చేస్తూ ఉంటే ముఖం మీద బ్లాక్ హెడ్స్, మొటిమలు రావు. ఎండ వల్ల కలిగే నలుపుదనం కూడా తగ్గిపోతుంది.
- చిన్న గిన్నెలో ఒక గంటె పెరుగు, ఒక గంటె టమాటా గుజ్జు వేసి బాగా కలపాలి. మెత్తని బ్రష్ సహాయంతో ముఖంపై కింది నుంచి పైకి దిశలో ఈ మిశ్రమాన్ని పట్టించాలి. కళ్ల మీద గుండ్రంగా తరిగిన టమాటా ముక్కలు పెట్టుకోవాలి. కళ్లు మూసుకుని అరగంట విశ్రాంతి తీసుకోవాలి. తరవాత చల్లని నీళ్లతో ముఖం కడుక్కోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే ముఖం మీద చర్మం బిగుతుగా మారి నున్నగా ఆరోగ్యంగా కనిపిస్తుంది.



విజేత



ఐదు పదులు దాటిన వయసులో పరుగు మొదలుపెట్టారు. అరవైల్లో పోటీల బరిలోకి దిగారు. ఇప్పుడు తొంభై ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహంతో... సరికొత్త 'ట్రాక్' రికార్డులు నెలకొల్పుతున్నారు. కేరళలో ఇటీవల జరిగిన 'జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్'లో మూడు పతకాలు మెడలో వేసుకున్నారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో 'పరుగుల బామ్మ'గా పేరుపొందిన... ముత్యం లక్ష్మితో 'నవ్య' మాటామంతి.

ఈ బామ్మ క్రీడా ముత్యం

"మూడు దశాబ్దాలు దాటిపోయాయి... నేను పోటీల్లోకి దిగి. అప్పుడు నాకు యాభై ఎనిమిదేళ్లు. పరుగు మొదలుపెట్టినప్పుడు... ఇంటి పట్టునే కూర్చొని మనవళ్లతో ఆడుకొనే వయసులో ఆటలేంటని అన్నవారూ ఉన్నారు. అందుకు నేను చిన్నబుచ్చుకోలేదు. అది వారి అభిప్రాయం. నేనేంటో, నా సామర్థ్యం ఏంటో నాకు తెలిసినప్పుడు... ఎవరో ఏదో అన్నారని బాధ పడుతూ కూర్చోవడంలో అర్థంలేదు. అందుకే నాకు నచ్చిన దారిలో నేను అడుగులు వేశాను. ఇవాళ మాస్టర్స్ అథ్లెట్‌గా, 'పరుగుల బామ్మ'గా మీ అందరి మన్ననలు పొందుతున్నాను. అనకాపల్లి జిల్లా చోడవరం మాది. ఏడో తరగతి వరకే చదువుకున్నాను. మావారు శ్రీనివాసరావు సర్పంచ్‌గా పని చేసేవారు. మాకు ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. పెద్ద కొడుకు పదవీ విరమణ పొందాడు.

రిటైర్మెంట్ వయసులో...

పిల్లలంతా పెద్దవారైపోయారు. పెళ్లిళ్లు చేసుకున్నారు. ఇంట్లో ఖాళీగా ఉండడం ఎందుకని రిటైర్మెంట్ వయసులో నడక మొదలుపెట్టాను. తరువాత చిన్న చిన్న పరుగు, నడక పందేల్లో పాల్గొనేదాన్ని. ఆరు పదులు దగ్గరపడుతున్న వయసులో ఏదో సాధించాలని నేను పడుతున్న తపన చూసి స్థానికులు నన్ను ప్రోత్సహించారు. వారందరి ప్రోద్బలంతో 1993లో తొలిసారి జిల్లా స్థాయి పరుగు పోటీలకు వెళ్లాను. అందులో పతకాలు గెలిచాను. అది నాలో ఎనలేని ఉత్సాహం నింపింది. ఇక అక్కడి నుంచి వెనుదిరిగి చూడలేదు. క్రమంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పోటీపడుతూ వచ్చాను. పతకాలు గెలవడం ఒక ఆనవాయితీగా మారిపోయింది.

గాయంతో బ్రేక్ పడినా...

ఐదేళ్ల కిందటి వరకు నేను పరుగు పోటీల్లో పాల్గొనేదాన్ని. అయితే ఒకరోజు ఇంట్లో జారి పడ్డాను. కాలు విరిగింది. ఇక క్రీడలు వద్దని కొందరు సలహా ఇచ్చారు. కానీ నేను పరుగు పోటీలను పక్కన పెట్టి... జావెలిన్ త్రో, డిస్క్ త్రో, షార్ట్‌పుట్ ఎంచుకున్నాను. సాధన మొదలుపెట్టాను. నైపుణ్యం సాధించాను. నాపై నాకు నమ్మకం కుదిరడంతో, బరిలోకి దిగాను. దానికి ముందు 2010లో కౌలాలంపూర్‌లో జరిగిన 'ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌'లో స్వర్ణ, రజత పతకాలు గెలుచుకున్నాను.

నడకే నన్ను నడిపిస్తోంది...

ఇటీవల కేరళలో కేరళలో ముగిసిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో మూడు విభాగాలు... షాట్‌పుట్, డిస్క్ త్రో, జావెలిన్ త్రోల్లో పాల్గొన్నాను. అందులో రెండు స్వర్ణ పతకాలు, ఒక రజతం నెగ్గాను. జాతీయ స్థాయిలో నేను సాధించిన పతకాలు ఎన్నో ఉన్నాయి. ఏ పోటీకి వెళ్లినా పతకం లేకుండా తిరిగి వచ్చిన సందర్భాలు అరుదు. తొమ్మిది పదుల వయసులో కూడా ఇంత ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండటానికి కారణం... నడక. నా జీవితంలో నడక ఒక భాగమైపోయింది. స్థానికంగా ఎక్కడికైనా సరే... నడిచే వెళతాను. తప్పనిసరి అయితే తప్ప వాహనాలు ఎక్కను.

ఇంటి వంట...

వయసు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్య సమస్యలు కూడా పెరుగుతుంటాయి. అందుకే క్రమబద్ధమైన ఆహార నియమాలను నా జీవనశైలిలో చేర్చుకున్నాను. ప్రత్యేకమైన ఆహారం ఏమీ ఉండదు కానీ... ఉదయం అల్పాహారం తీసుకోను. మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం... అంతే. రాత్రి ఏమీ తినను. ఉదయం, సాయంత్రం... రెండుసార్లు కాఫీ తాగుతాను. ఏదైనా ఇంటి వంటే. బయటవి అస్సలు ముట్టుకోను. ఇతర ప్రాంతాలకు వెళ్లినా అక్కడ వంట చేసుకొంటాను. ఇది మా అమ్మ నుంచి వచ్చిన అలవాటు. ఇంట్లో వండిన ఆహారం తినడంవల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. నా ఈ ప్రయాణంలో ఎన్నో కష్టాలు. అడుగడుగునా సవాళ్లు. ఆటపై ఇష్టంతోనే వీటన్నిటినీ అధిగమించి, రాణించగలుగుతున్నాను. సాధించాలన్న తపన ఉండాలే కానీ... వయసు అడ్డంకి కాదని చెప్పడానికి నేనే ఒక ఉదాహరణ."



> **ప్రోత్సాహం అవసరం...**
>
> మాది సాధారణ మధ్యతరగతి కుటుంబం. గతంలో చోడవరం తహసీల్దారుగా పని చేసిన శైలజ నాకు ఇంటి స్థలం మంజూరు చేశారు. అందులో చిన్న ఇల్లు కట్టుకొని నివసిస్తున్నాను. పిల్లలు అందరూ విశాఖపట్టణంలో ఉంటున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నాలుగు వేల వృద్ధాప్య పింఛను మినహా నాకు వేరే ఆధారం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో క్రీడాకారుల పింఛన్ కింద ఏడాదికి ఆరు వేలు వచ్చేది. విభజన తరువాత అదీ ఆపేశారు. దాతల సహకారంతో ఈవెంట్లకు వెళుతున్నాను. ఈ వయసులో కూడా పోటీల్లో పాల్గొంటున్నానంటే క్రీడలపై నాకున్న మక్కువ. ఇంకా ఏదో సాధించాలన్న తపన. ప్రభుత్వం నుంచి కూడా ప్రోత్సాహం లభిస్తే, నాలాంటి మరెందరో క్రీడాకారులు ముందుకు వస్తారు.

• వి.జోజిబాబు, చోడవరం

అమ్మ మనసు
అమృతం పంచుతోంది!

తల్లిపాలకు నోచుకోని శిశువుల అవస్థలు చూసి విచిత్ర సెంథిల్ కుమార్ అమ్మ మనసు చలించిపోయింది. తమిళనాడులోని తిరుప్పూర్‌కు చెందిన ఆమె తనవంతు ప్రయత్నంగా ప్రారంభించిన 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్' నాలుగువేల లీటర్లకి పైగా చనుబాలను సేకరించి, ఎంతోమంది పిల్లలకు జీవనాధారంగా నిలుస్తోంది.



ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలి. మన దేశం తరఫున ఆడాలి... విద్యార్థిగా ఉన్నప్పుడు విచిత్ర సెంథిల్‌కుమార్ కల ఇది. ఆమె కాలేజీ, యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్లకు కెప్టెన్‌గా ఉన్నారు. కోయంబత్తూర్ జిల్లా మహిళా ఫుట్‌బాల్ జట్టులో సభ్యురాలుగా 1999-2002 మధ్య అనేక విజయాల్లో కీలకపాత్ర పోషించారు. రాష్ట్ర జట్టుకు ఆమెను పరిగణనలోకి కూడా తీసుకున్నారు. కానీ గాయాల కారణంగా... ఆటకు దూరం కావలసి వచ్చింది. "కానీ ఎలాంటి పరిస్థితుల్లోనైనా లక్ష్యాన్ని సాధించడానికి నన్ను నేను సిద్ధం చేసుకోవడం, ఎలాంటి అవరోధాలనైనా పట్టుదలతో అధిగమించి ముందుకు సాగడం లాంటివి నాకు క్రీడలే నేర్పించాయి" అని చెబుతున్నారు 41 ఏళ్ల విచిత్ర. ఆమె స్వస్థలం తమిళనాడులోని చిన్నకలిపాళ్యం. క్రీడల తరువాత ఆమెకు చాలా ఇష్టమైన పని... అవసరంలో ఉన్నవారికి సాయం చెయ్యడం. ఈ విషయంలో తండ్రి మరుదాచలం ఆమెకు స్ఫూర్తి. పేద కుటుంబాల్లోని పిల్లల చదువుకు ఆయన సాయం చేసేవారు. ఆయన అండతో ఎందరో పెద్ద చదువులు చదివి, ఉన్నతోద్యోగాలు సంపాదించుకున్నారు. తండ్రి బాటనే అనుసరించిన విచిత్ర... ప్రభుత్వ పాఠశాలలోని పేద పిల్లలకు ట్యూషన్ ఫీజులు కట్టేవారు. "చిన్న చిన్న పనులు చేస్తూ బతుకు సాగించే కుటుంబాలు... తమ పిల్లల్ని బాగా చదివించాలనుకుంటాయి. కానీ ఆర్థిక పరిస్థితుల వల్ల అది చాలాసార్లు సాధ్యం కాదు. దానికోసం పాకెట్ మనీని వారి ఫీజుల కోసం ఖర్చు చేసేదాన్ని. ఈ సంగతి తెలిసి మా నాన్న నా పాకెట్ మనీని రెట్టింపు చేశారు. "మంచి పని చేస్తున్నావు. ఇంకా డబ్బు కావాలంటే అడుగు" అన్నారు. ఆ మాట విని ఉద్వేగాన్ని ఆపుకోలేక ఏడ్చేశాను" అని గుర్తు చేసుకున్నారు విచిత్ర.

అంతగా పట్టించుకోని పెద్ద సమస్య...

"వివాహం తరువాత తిరుప్పూర్‌లో స్థిరపడ్డాక కూడా సేవా కార్యక్రమాలను కొనసాగించాను. దీనికి నా భర్త సెంథిల్ కుమార్ అన్ని విధాలుగా మద్దతిచ్చారు. పిల్లల చదువుకు సాయం చెయ్యడంతో పాటు... గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధుల కోసం నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వెయ్యికి పైగా క్యాటరాక్ట్ సర్జరీలు చేయించాం. ఇవన్నీ నేను, నా కుటుంబం, కొద్దిమంది స్నేహితులు కలిసి చేసిన కార్యక్రమాలు. కానీ 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్' నా పరిధిని పెంచింది. సేవా భావం ఉన్న ఎందరో మహిళలను నాకు పరిచయం చేసింది" అంటారు విచిత్ర. 2021లో... ఆమెలో ఈ ఆలోచనకు బీజం పడింది. "అప్పుడు నేను నెలల బిడ్డకు తల్లిని. నా స్నేహితురాలు ఒకరు ఫోన్ చేసి "ఈరోడ్‌లో ఒక శిశువుకు తల్లిపాలు కావాలి. ఇవ్వగలవా?" అని అడిగింది. అలా అడగడం నాకు ఆశ్చర్యం అనిపించింది. అయితే చనుబాలు ఆ శిశువుకు కేవలం పోషకాహారం మాత్రమే కాదనీ, జీవనాధారం అనీ తెలుసుకున్నాక 'సరే' అన్నాను. అక్కడికి వెళ్ళిన తరువాత... వైద్యుల ద్వారా చాలా విషయాలు విన్నాను.. తల్లిపాలకు దూరమైన పిల్లల రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉంటుంది. అలెర్జీలు, జీర్ణ సంబంధమైన ఇబ్బందులు పెరుగుతాయి. ఉబ్బసం లాంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కొందరు పిల్లలకు పోతపాలు పడవు. దీనివల్ల వారు తీవ్ర అనారోగ్యాలకు గురవుతారు. కొన్నిసార్లు ప్రాణాపాయ స్థితి కూడా



ఏర్పడవచ్చునని తెలిశాక.... 'ఇది మనం అంతగా పట్టించుకోని పెద్ద సమస్య' అని అర్థమయింది. అప్పుడే చనుబాల బ్యాంక్ ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది"అంటారు విచిత్ర. ప్రసవించిన తల్లులకు, వారి శిశువులకు ఆ బ్యాంక్ అందుబాటులో ఉండాలని ఆమె అనుకున్నారు. తిరుప్పూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి యాజమాన్యాన్ని కలిసి, తన ప్రతిపాదనను వారికి వివరించారు. వారి అంగీకారంతో... అదే ఏడాది 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్' ఏర్పాటు చేశారు. పాలిచ్చే తల్లులు... వారి మిగిలిన పాలను ఈ బ్యాంకుకు దానం చేస్తే... ఎందరో చిన్నారులకు ప్రాణదానం చేసినట్టవుతుందని ప్రచారం చేశారు.

వారి ఉదారతే ఎక్కువ...

"తమ పిల్లల కోసం ఉద్దేశించిన పాలను ఇతరులకు ఇవ్వడం చాలామందికి ఇష్టం ఉండదు. అంతేకాదు... ఈ విషయంలో ఎన్నో అపోహలు, అనుమానాలు, మూఢ నమ్మకాలు ఉన్నాయి. ఈ అవరోధాలన్నిటినీ మెల్లగా దాటుతూ వచ్చాం" అని అంటారు విచిత్ర. తనది చిత్తశుద్ధి కలిగిన ప్రయత్నం అనే విశ్వాసాన్ని కలిగించడం కోసం... తల్లులను ఆమె స్వయంగా కలిశారు. వారి ఇంటికి వెళ్ళి, వారికి, వారి కుటుంబ సభ్యులకు 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్' గురించి, వారు విరాళంగా ఇచ్చే పాల ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. క్రమంగా దాతల సంఖ్య పెరిగింది. ఎంతోమంది ఉత్సాహంగా ముందుకువచ్చారు. "ఒక మహిళ కేవలం తొమ్మిది నెలల్లోనే 117 లీటర్ల చనుబాలను ఈ బ్యాంక్‌కు అందించారు. నేను చేసే పని మీద మహిళలకు ఏర్పడిన నమ్మకానికి ఇదొక నిదర్శనం" అని చెప్పారు విచిత్ర. గత నాలుగేళ్లలో... నాలుగు వేల లీటర్లకు పైగా చనుబాలను ఆమె సేకరించారు. నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు, తల్లితండ్రులు వదిలేసిన శిశువులు, అనారోగ్యం వల్ల, ఇతర కారణాల వల్ల చనుబాలు ఇవ్వలేని తల్లుల సంతానం... ఇలా ఎందరో ఈ బ్యాంక్ నుంచి ప్రయోజనం పొందుతున్నారు. "ప్రజలతో మమేకమై, వారి విశ్వాసాన్ని పొందే సామర్థ్యం ఆమెకు ఉంది. పసి ప్రాణాలను కాపాడాలనే ఆమె తపన అందరికీ స్ఫూర్తిదాయకం" అంటారు తిరుప్పూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి వైద్యులు. "ఇది తల్లులకు, బిడ్డలకు మాత్రమే కాదు, కుటుంబాలకు, సమాజానికి సంబంధించిన సమస్య కూడా. అందరం కలిస్తేనే ప్రపంచంలో మార్పు సాధ్యమవుతుంది. ఇందులో నేను చేసిన దానికన్నా... ఎందరో మాతృమూర్తుల ఉదారతే ఎక్కువ. నేను ఇద్దరు పిల్లల తల్లిని. అమ్మ మనసు, అమ్మ కష్టాలు మరో అమ్మకే తెలుస్తాయి. మా 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్'ను నడిపిస్తున్నది, పిల్లలకు తమ పాల రూపంలో అమృతాన్ని పంచుతున్నది అలాంటి అనేక మాతృ హృదయాలే" అని చెబుతున్నారు విచిత్ర.

పరీక్షల సమయంలో...

పరీక్షల సమయంలో పిల్లలు సహజంగానే ఒత్తిడి, ఆందోళనకు గురవుతూ ఉంటారు. వీటినుంచి విశ్రాంతి లభించాలంటే రోజుకు కనీసం ఎనిమిది గంటలు నిద్రపోవాలని నిపుణులు చెబుతున్నారు. పరీక్షలంటే భయపడకుండా పిల్లలు హాయిగా పడుకోవడానికి పాటించాల్సిన చిట్కాల గురించి తెలుసుకుందాం!



- పరీక్షలు దగ్గరకు రాగానే పిల్లలు రాత్రిపూట పడుకునే సమయాన్ని నిర్దేశించాలి. ఎలాంటి పరిస్థితుల్లోనైనా దానికి కట్టుబడి ఉండేలా చూసుకోవాలి. మరుసటి రోజు ఉదయమే నిద్రలేపాలి. లేదంటే రాత్రికి త్వరగా పడుకోరు.
- పడుకునే సమయానికి రెండు గంటల ముందే భోజనం పూర్తి చేయించాలి. గంట తరవాత గోరువెచ్చని పాలు, అరటిపండు, వాల్‌నట్ లాంటివి ఇస్తే పిల్లలు వెంటనే నిద్రపోతారు.
- టీ, కాఫీలను పిల్లలకు అలవాటు చేయవద్దు. వీటిలో ఉండే కెఫిన్ వల్ల సరిగా నిద్ర పట్టదు.
- పడుకునే ముందు మొబైల్ లేదా టీవీని చూడనివ్వకూడదు. గదిలో వెలుతురు లేకుండా నిశ్శబ్దంగా ఉండేలా చూడాలి.
- పరీక్షల గురించి అతిగా ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండడాన్ని పిల్లలకు అలవాటు చేయాలి. సాయంత్రం పూట కొద్దిసేపు ధ్యానం, శ్వాస వ్యాయామాలు చేయిస్తే పిల్లలు వెంటనే నిద్రపోతారు.
- బడిలో చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు చదువుకుంటూ హోమ్ వర్క్‌లు పూర్తిచేసేలా పిల్లలను ప్రోత్సహించాలి. దీని వల్ల పరీక్షలంటే ఆందోళన తగ్గి ప్రశాంతంగా పడుకుంటారు.
- తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు, తాజా పళ్లు, కూరగాయలతో పాటు పోషకాహారాన్ని పిల్లలకు తినిపించాలి. ఎటువంటి అనారోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే పిల్లలు ప్రశాంతంగా నిద్రించగల్గుతారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. పరీక్షలు బాగా రాస్తారు.

ఇంటికి అందాన్నిచ్చే సోఫాలు

ఇంటిని ఆకర్షణీయంగా మార్చడంలో సోఫా సెట్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. కూర్చోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా ఉంటూ విలాసవంతంగా కనిపించే సోఫాలు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అత్యధికంగా ఆదరణ పొందుతున్న సోఫా సెట్లు ఇవే...



కర్వ్ సోఫా

ఇది అర్ధ చంద్రాకారంలో ఉంటుంది. వంపు ఎదురుగా అద్దంతో ఉన్న టీపాయ్‌ని అమరిస్తే చాలా గ్రాండ్‌గా కనిపిస్తుంది. విశాలమైన డ్రాయింగ్ రూమ్‌లో ఈ సోఫా సెట్ వేస్తే క్లాసీ లుక్ వస్తుంది.

ఎల్ సోఫా



ఎల్ ఆకారపు సోఫా... హాల్ అందాన్ని పెంచుతుంది. మ్యాచింగ్ కుషన్‌లను పెడితే గ్రాండ్ లుక్ వస్తుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఇలా అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.



బెడ్ సోఫా

దీనికి అన్ని వర్గాల్లో అధిక డిమాండ్ ఉంది. సోఫాలా ఉపయోగించుకుంటూనే బెడ్ మాదిరి మార్చవచ్చు. సింగిల్ బెడ్‌రూమ్ ఉన్న ఇళ్లకు ఇది అనుకూలంగా ఉంటుంది. హాల్, డ్రాయింగ్ రూమ్, లివింగ్ రూమ్, స్టడీ రూమ్‌లలో వేసుకోవచ్చు. లేత రంగులో ఉన్న సోఫా కవర్ వేస్తే ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

సర్క్యులర్ సోఫా



విశాలమైన హాల్‌లో ఈ సోఫాసెట్ చక్కగా అమరుతుంది. సోఫా చివరల్లో వృత్తాకారపు అమరికలు ఉంటాయి. ఫ్లోరింగ్‌కు మ్యాచ్ అయ్యే కలర్ ఎంచుకుంటే హాల్ లేదా డ్రాయింగ్ రూమ్‌కి స్టయిలిష్ లుక్ వస్తుంది.



రాయల్ సోఫా

ఇది పెద్ద సైజు సింహాసనంలా కనిపిస్తుంది. అందమైన నగిషీ వర్క్‌తో పొడవైన మెత్తని కుషన్లతో పేరుకు తగ్గట్టు రాజసం ఉట్టిపడుతూ ఉంటుంది. ఈ సోఫాసెట్‌ని వేస్తే హాల్ మొత్తం రాయల్ లుక్‌తో మెరిసిపోతుంది.

అడ్జస్టబుల్ సోఫా



దీనిని పలు విధాలుగా మార్చుకునే వీలుంటుంది. ఒకవైపు దివాన్ కాట్‌లా, మరోవైపు ఎల్ సోఫా లేదా సర్క్యులర్ సోఫాలా వేసుకోవచ్చు. విశ్రాంతి తీసుకోవడానికి అనువుగా ఉంటుంది. అవసరాన్ని బట్టి సోఫాను సర్దుబాటు చేసుకునే వీలుంది.



వాల్ సోఫా

విశాలమైన డ్రాయింగ్ రూమ్ లేదా హాల్‌లో మూడు గోడల వెంబడి ఈ సోఫా సెట్‌ను అమర్చుకోవచ్చు. ఫ్లోర్ మీద పరచిన కార్పెట్‌కి మ్యాచ్ అయ్యేలా కుషన్స్, కర్టెన్స్ అమరిస్తే రిచ్ లుక్ వస్తుంది. లోనికి ప్రవేశిస్తూనే అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది.

ఉప్పల్‌లో 9 వైజాగ్‌లో 2



- 12 డబుల్ హెడర్‌లు
- మార్చి 22న ప్రారంభం
- మే 25న ఈడెన్‌లో ఫైనల్

ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ విడుదల

ప్లేఆఫ్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం

న్యూఢిల్లీ: మండు వేసవిలో క్రికెట్ ప్రేమికులను ఉర్రూతలూగించే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పూర్తి షెడ్యూల్‌ను బీసీసీఐ వెల్లడించింది. ఈ లీగ్ 18వ సీజన్ మార్చి 22 నుంచి ఆరంభమై మే 25న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. ఇందులో భాగంగా 65 రోజుల పాటు దేశంలోని 13 నగరాల్లో మొత్తంగా 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడనున్నాయి. ఆరంభ, ఫైనల్ మ్యాచ్‌లకు కూడా ఈడెన్ గార్డెన్స్ వేదిక కానుంది. ఇక షెడ్యూల్‌లో 12 డబుల్ హెడర్ (ఒకే రోజు రెండు) మ్యాచ్‌లున్నాయి. ఎప్పటిలాగే వైజాగ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్, ధర్మశాలను పంజాబ్ కింగ్స్, గువాహటిని రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలు తమ రెండో హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకున్నాయి. దీంతో ఆయా వేదికల్లో రెండేసి మ్యాచ్‌లు జరుగనుండగా, ధర్మశాల మాత్రం మూడు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుంది. వైజాగ్‌లో మార్చి 24న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, 30న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఢిల్లీ జట్టు తలపడనుంది.

గతేడాది ఉప్పల్ మైదానం ఏడు లీగ్ మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వగా.. ఈసారి ఆ సంఖ్య పెరిగింది. ఎందుకంటే ప్లేఆఫ్స్‌లో భాగంగా క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్‌లు ఇక్కడ జరుగనుండడమే. దీంతో హైదరాబాద్‌లో జరిగే మొత్తం మ్యాచ్‌ల సంఖ్య తొమ్మిదికి పెరిగింది. ఇక మార్చి 23న ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ జట్టు రాజస్థాన్ రాయల్స్‌తో తమ ఆరంభ మ్యాచ్‌ను ఆడనుంది. అలాగే క్వాలిఫయర్ 2, ఫైనల్ మ్యాచ్‌లకు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదిక కానుంది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి	వేదిక	సమయం
మార్చి 23	రాజస్థాన్	హైదరాబాద్	మ.3.30
మార్చి 27	లఖ్‌నవూ	హైదరాబాద్	రా.7.30
మార్చి 30	ఢిల్లీ	విశాఖపట్నం	మ.3.30
ఏప్రిల్ 03	కోల్‌కతా	కోల్‌కతా	రా.7.30
ఏప్రిల్ 06	గుజరాత్	హైదరాబాద్	రా.7.30
ఏప్రిల్ 12	పంజాబ్	హైదరాబాద్	రా.7.30
ఏప్రిల్ 17	ముంబై	ముంబై	రా.7.30
ఏప్రిల్ 23	ముంబై	హైదరాబాద్	రా.7.30
ఏప్రిల్ 25	చెన్నై	చెన్నై	రా.7.30
మే 02	గుజరాత్	అహ్మదాబాద్	రా.7.30
మే 05	ఢిల్లీ	హైదరాబాద్	రా.7.30
మే 10	కోల్‌కతా	హైదరాబాద్	రా.7.30
మే 13	బెంగళూరు	బెంగళూరు	రా.7.30
మే 18	లఖ్‌నవూ	లఖ్‌నవూ	రా.7.30

జోరుగా భారత్ ప్రాక్టీస్



దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు శనివారమే దుబాయ్‌లో అడుగుపెట్టింది. ఈనెల 20న బంగ్లాదేశ్‌తో తొలి మ్యాచ్ ఆడనుండగా, దీనికి ముందు జట్టుకు ఎలాంటి వామప్ మ్యాచ్ లేదు. అయితే విశ్రాంతి తీసుకోకుండా ఆదివారం మధ్యాహ్నం నుంచే స్థానిక ఐసీసీ అకాడమీలో ప్రాక్టీస్ ఆరంభించింది. బోర్డు కొత్త నిబంధనల ప్రకారం జట్టులో ఏ ఒక్కరికీ ఐచ్ఛిక ప్రాక్టీస్ అంటూ లేకపోవడంతో కెప్టెన్ స్థాయి నుంచి జూనియర్ ప్లేయర్ వరకు అంతా విధిగా నెట్స్‌లో పాల్గొన్నారు. ఇటీవలే పునరాగమనం చేసిన వెటరన్ పేసర్ షమి.. కెప్టెన్ రోహిత్, విరాట్, గిల్‌లకు బౌలింగ్ చేశాడు. ఆరంభంలో తన బౌలింగ్ కోచ్ మోర్కెల్‌తో సంభాషించాడు. ఈనేపథ్యంలో తన లెంగ్త్‌ను సరి చూసుకోవడం కనిపించింది.



పంత్

కోలుకున్న పంత్

వికెట్ కీపర్ రిషభ్ పంత్ కు నెట్స్‌లో స్వల్ప గాయమైంది. హార్దిక్ ఆడిన షాట్ నేరుగా పంత్ మోకాలికి తాకింది. దీంతో తను బాధతో విలవిల్లాడగా ఫిజియో కమలేష్ చికిత్స చేశాడు. అటు పాండ్యా కూడా పరుగున వచ్చి పంత్‌ను పరిశీలించాడు. అయితే పంత్ గాయం సీరియస్ కాకపోవడం ఊరటనిచ్చింది. ఫిజియో చికిత్స తర్వాత తను ప్యాడ్స్ ధరించి బ్యాటింగ్ ప్రాక్టీస్ సాగించాడు.

భారత్ మ్యాచ్‌లకు అదనపు టిక్కెట్లు

చాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడే మ్యాచ్‌లకు ఫుల్ డిమాండ్ నెలకొంది. దీంతో ఐసీసీ అదనపు టిక్కెట్లను కేటాయించింది. ఇందులో పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్ టిక్కెట్లయితే బుధవారం గంటవ్యవధిలోనే అమ్ముడవడం విశేషం. కివీస్‌తో పాటు తొలి సెమీస్ మ్యాచ్ టిక్కెట్ల అమ్మకాలు మాత్రం నెమ్మదిగా సాగుతున్నాయి.

గుజరాత్ ఖాతా తెరిచింది

ఆరు వికెట్లతో యూపీపై గెలుపు

వడోదరా: తొలి మ్యాచ్‌లో 200 పరుగులు చేసి భంగపడిన గుజరాత్ జెయింట్స్.రెండో పోరులో ఆల్‌రౌండ్ షోతో విజయం అందుకుంది. డబ్ల్యూపీఎల్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో జెయింట్స్ ఆరు వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌ని ఓడించింది. తద్వారా పాయింట్ల ఖాతా తెరిచింది. తొలుత యూపీ 20 ఓవర్లలో 143/9 స్కోరు సాధించింది. దీప్తీశర్మ (27 బంతుల్లో 6 ఫోర్లతో 39), ఉమా ఛెత్రి (24) రాణించగా.. చివర్లో అలానా కింగ్ (14 బంతుల్లో 2 ఫోర్లు, సిక్సర్‌తో 19 నాటౌట్) బ్యాట్ ఝుళిపించింది. ప్రియా మిశ్రా 3, డాటిన్, గార్డనర్‌లో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో గుజరాత్ 18 ఓవర్లలో 144/4 స్కోరు చేసి నెగ్గింది. ఆష్లే గార్డనర్ (32 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 52) మెరుపు హాఫ్ సెంచరీ చేసింది. హర్లీన్ డియోల్ (34 నాటౌట్), డాటిన్ (33 నాటౌట్) సత్తా చాటారు. ఎక్లెస్టోన్ రెండు వికెట్లు తీసింది. గార్డనర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. వారియర్స్‌కిది తొలి మ్యాచ్.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ × బెంగళూరు
రాత్రి 7.30 నుంచి

సంక్షిప్తస్కోర్లు

యూపీ వారియర్స్: 20 ఓవర్లలో 143/9 (దీప్తీ శర్మ 39, ఉమా ఛెత్రి 24, అలానా కింగ్ 19 నాటౌట్, శ్వేత 16, కిరణ్ 15, ప్రియా మిశ్రా 3/25, డాటిన్ 2/34, గార్డనర్ 2/39).

గుజరాత్ జెయింట్స్: 18 ఓవర్లలో 144/4 (గార్డనర్ 52, హర్లీన్ 34 నాటౌట్, డాటిన్ 33 నాటౌట్, వోల్వార్ట్ 22, ఎక్లెస్టోన్ 2/16).

అబ్బాయిలకు గెలుపు.. అమ్మాయిలకు ఓటమి

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ హాకీ ప్రొ లీగ్‌లో ఆదివారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. పురుషుల జట్టు గెలుపొందగా, మహిళల బృందం నిరాశపరిచింది. హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత పురుషుల బృందం 2-0తో స్పెయిన్‌ను చిత్తుచేసింది. అభిషేక్ రెండు గోల్స్‌ను మన్‌దీప్ (32వ), దిల్‌ప్రీత్ (39) సాధించారు. భారత అమ్మాయిల జట్టు మూటాలో 1-2తో ఇంగ్లండ్ చేతిలో ఓటమిపాలైంది. నిర్ణీత సమయానికి ఇరు జట్లు 2-2తో సమంగా నిలిచాయి. దీంతో అనివార్యమైన షూటౌట్‌లో ఇంగ్లండ్ ఫలితం రాబట్టింది.

ముంబై × విదర్భ



ముంబై కెప్టెన్ రహానె

గుజరాత్‌తో కేరళ ఢీ
నేటినుంచే రంజీ సెమీస్



విదర్భ సారథి అక్షయ్

నాగ్‌పూర్: డిఫెండింగ్ చాంపియన్ ముంబై.. విదర్భ జట్టు మధ్య రంజీట్రోఫీ సెమీఫైనల్ సోమవారం ఇక్కడ ప్రారంభం కానుంది. యశస్వీ జైస్వాల్ గాయంతో మ్యాచ్ నుంచి వైదొలగినా ముంబై పటిష్ఠంగానే కనిపిస్తోంది. కెప్టెన్ రహానె, శివమ్ దూబే, శార్దూల్ ఠాకూర్ వంటి స్టార్లతో ఆ జట్టు కళకళలాడుతోంది. అయితే ఈ సీజన్‌లో ముంబై టాపార్డర్ కాకుండా లోయరార్డర్ బ్యాటర్లు భారీ స్కోర్లతో జట్టును ఆదుకుంటున్నారు. ఇక సెమీస్‌లో టాపార్డర్ కూడా రాణిస్తే ముంబైకి తిరుగుండదు. మరోవైపు కరుణ్ నాయర్, కెప్టెన్ అక్షయ్‌తో కూడిన విదర్భ ఫ్రంట్‌లైన్ బ్యాటింగ్ విభాగం ఈ సీజన్‌లో పరుగుల వరద పారిస్తోంది. ఈనేపథ్యంలో సెమీస్ పోరు రసవత్తరంగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. అహ్మదాబాద్‌లో జరిగే మరో సెమీస్‌లో గుజరాత్.కేరళతో తలపడనుంది.

కుర్రాళ్లూ.. సైకిల్ వాడండి

క్రీడామంత్రి సూచన

ముంబై: ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం సాధ్యమైనంత వరకు సైకిళ్లపై ప్రయాణించడాన్ని అలవాటు చేసుకోవాలని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవ్య యువతకు సూచించారు. ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ఆదివారమిక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. 'ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా యువతకు చెబుతున్నా. వీలైనంత వరకు సైకిళ్లపై ప్రయాణించండి. దీనివల్ల మీరు ఆరోగ్యంగా ఉండడమే గాకుండా పర్యావరణానికి మేలు చేసినవారవుతారు' అని మాండవ్య తెలిపారు.

రెండో వన్డేలో ఐర్లాండ్ గెలుపు

హరారే: ఆతిథ్య జింబాబ్వేతో తొలి వన్డేలో ఓడిన ఐర్లాండ్ రెండో మ్యాచ్‌లో గొప్ప ప్రతిఘటన ప్రదర్శించింది. ఆదివారం జరిగిన పోరులో కాంఫర్ (3/13, 63 పరుగులు) ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టడంతో ఐర్లాండ్ ఆరు వికెట్లతో గెలిచింది. మొదట జింబాబ్వే 49 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. వెస్లీ మెధెవెరె (61), సికిందర్ రజా (58) రాణించారు. ఛేదనలో స్టిర్లింగ్ (89) కెప్టెన్ ఇన్నింగ్స్‌ను తోడు కాంఫర్ అర్ధ శతకంతో సత్తా చాటడంతో ఐర్లాండ్ 48.4 ఓవర్లలోనే 249/4 స్కోరు చేసి గెలిచింది.

గాయాల జాబితా చాంతాడంత!



చాంపియన్స్ ట్రోఫీ 2 రోజుల్లో..



స్టార్క్ కమిన్స్

అన్ని జట్ల నుంచి స్టార్ క్రికెటర్లు బరిలో ఉంటేనే మెగా టోర్నమెంట్లు మజా పంచుతాయి. మ్యాచ్‌లు పోటాపోటీగా సాగి ఫ్యాన్స్‌లో ఉద్వేగం, ఉత్కంఠం నింపుతాయి. అటు నిర్వాహకులకు ఇటు టోర్నమెంట్ స్పాన్సర్లకు కావాల్సింది అదే కదా! కానీ బుధవారం నుంచి జరిగే ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో పలు జట్లను..అటీ స్టార్ ఆటగాళ్ల గాయాలు బెదరపెడుతోంది. తాజాగా టీమిండియా పేసర్ బుమ్రా గాయంతో టోర్నీకి దూరమవ్వడం, ఈనేపథ్యంలో చాంపియన్స్ ట్రోఫీనుంచి గాయాలతో వైదొలగిన క్రికెటర్లపై ఓ లుక్కేద్దాం..

కమిన్స్, స్టార్క్: భారత్‌తో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ సందర్భంగా గాయపడిన ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే జట్టు కెప్టెన్ కమిన్స్ చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. ఈనేపథ్యంలో అతడి స్థానంలో నాయకత్వం బాధ్యతను స్మిత్ చేపట్టాడు. కెప్టెన్ దూరం కావడం కంగారూల అవకాశాలకు బాగా దెబ్బ తీయవచ్చు. కమిన్స్‌తోపాటు పేసర్ హాజెల్‌వుడ్, ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ సేవలనూ ఆసీస్ కోల్పోయింది. ఊహించని రీతిలో 34 ఏళ్ల హాజెల్‌వుడ్ ఈ టోర్నీకి దూరమయ్యాడు. స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ సేవలనూ ఆసీస్ కోల్పోనుంది. అయితే స్టార్క్ గాయంతో కాకుండా వ్యక్తిగత కారణాలతో టోర్నీలో ఆడదలచలేదని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది.

సయీమ్ అయూబ్: పాకిస్థాన్ బ్యాటర్ సయీమ్ అయూబ్ పాదం గాయంతో దూరమయ్యాడు. గత నెలలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ సందర్భంగా అతడికి ఆ గాయమైంది.

జాకబ్ బెథెల్: 21 ఏళ్ల ఇంగ్లండ్ బ్యాటింగ్ సంచలనం బెథెల్ తొడ కండర గాయంతో తప్పుకొన్నాడు. భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌లో రెండో మ్యాచ్‌లో అతడు గాయపడ్డాడు.

నోకియా: కీలకమైన టోర్నీల సందర్భంగా దక్షిణాఫ్రికా పేసర్ నోకియాను గాయాల రూపంలో దురదృష్టం వెన్నాడుతుంటుంది. ఈసారి వెన్ను గాయంతో అతడు వైదొలగాల్సి వచ్చింది.

అల్లా గజన్‌ఫర్: 18 ఏళ్ల అఫ్ఘానిస్థాన్ స్పిన్నర్ గజన్‌ఫర్ కూడా వెన్ను గాయంతో తప్పుకోవాల్సి వచ్చింది. 11 వన్డేల్లో ఆడిన అతడు 21 వికెట్లు పడగొట్టడం విశేషం.

వీరూ అనుమానమే

ఇంకా..న్యూజిలాండ్‌కు చెందిన రచిన్ రవీంద్ర ముక్కునుంచి పాక్ సిరీస్‌లో పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్‌లో ఫీల్డింగ్ సందర్భంగా ఆనూహ్యంగా గాయపడ్డాడు. క్యాచ్ అందుకునే క్రమంలో ఫ్లడ్‌లైట్ల కాంతి నేరుగా కళ్లలో పడడంతో బంతి గమనాన్ని కచ్చితంగా అంచనా వేయలేకపోయాడు. అది రచిన్ నుదిటిపై తగలడంతో గాయపడ్డాడు. ఇక పేసర్ ఫెర్గూసన్ కండర గాయంతో బాధపడుతున్నాడు. అలాగే గాయాలపాలైన ఇంగ్లండ్ కీపర్, బ్యాటర్ జేమీ స్మిత్ కూడా చాంపియన్స్ ట్రోఫీలో ఆడడం అనుమానంగా ఉంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

బిజినెస్

ఆల్ ఇన్ వన్ బీమా పాలసీ!

బీమా విస్తార్ పేరుతో ఏప్రిల్‌లో విడుదల



న్యూఢిల్లీ: ఇకపై జీవిత, ఆరోగ్య, ప్రమాద, స్థిరాస్తి బీమా పథకాలను విడివిడిగా కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. వీటన్నింటికీ కవరేజీ కల్పించేందుకు ఆల్ ఇన్ వన్ ఇన్సూరెన్స్ పాలసీ 'బీమా విస్తార్' త్వరలో అందుబాటులోకి రానుంది. ఈ పథకం తుది విధివిధానాలపై భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ), ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ సారథులు ఈ నెల 13-14 తేదీల్లో జరిగిన 9వ వార్షిక బీమా మంథన్ కార్యక్రమంలో ఓ అంగీకారానికి వచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో బీమా విస్తార్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఐఆర్‌డీఏఐ తెలిపింది. దేశంలో అందరికీ బీమా కవరేజీని లక్ష్యంగా చేసుకుని బీమా విస్తార్ ముఖ్యోద్దేశం. అందుకోసం ఈ పథకానికి గ్రామీణ స్థాయి వరకు ప్రాచుర్యం కల్పించాలని ఐఆర్‌డీఏఐ భావిస్తోంది.

ఏప్రిల్‌లో బీమా వాహక్ పోర్టల్ సైతం షురూ: దేశవ్యాప్తంగా మహిళలను బీమా ఏజెంట్లుగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన కార్యక్రమమే బీమా వాహక్. వీరి కోసం అభివృద్ధి చేస్తున్న వెబ్ పోర్టల్ దాదాపు పూర్తి కావచ్చిందని, ఈ ఏప్రిల్ నుంచి అందుబాటులోకి రానుందని ఐఆర్‌డీఏఐ వెల్లడించింది.

రూ.లక్ష కోట్లు వెనక్కి

ఈ ఏడాది ఇప్పటికే ఎఫ్‌పీఐలు వెనక్కి తీసుకున్న మొత్తం ఇది

గడిచిన రెండు వారాల్లో రూ.21,272 కోట్ల ఉపసంహరణ.. ట్రంప్ టారి్ఫల వడ్డనే కారణం

న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడుల పెద్ద ఎత్తున తరలిపోతున్నాయి. ఈ నెలలో గడిచిన రెండు వారాల్లో ఎఫ్‌పీఐలు నికరంగా రూ.21,272 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. గత నెలలో ఏకంగా రూ.78,027 కోట్లు తరలిపోయాయి. అంటే, ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐలు దాదాపు రూ.లక్ష కోట్ల (రూ.99,299 కోట్లు) పెట్టుబడులను తరలించారు. అమెరికా సుంకాల వడ్డింపుతో అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితి పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. మరోవైపు డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు నిరాశపరచడం, రూపాయి క్షీణత మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీసింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక డాలర్ మరింత బలపడింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్ ఇండెక్స్ కాస్త తగ్గుముఖం పడితే ఎఫ్‌పీఐలు మళ్లీ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. అయితే బాండ్ మార్కెట్లో మాత్రం ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడులను కొనసాగించారు. గత రెండు వారాల్లో దాదాపు రూ.1,500 కోట్లకు పైగా ఇన్వెస్ట్ చేశారు.

అరబిందో చైనా ప్లాంట్ నుంచి యూరప్‌కు ఉత్పత్తుల సరఫరా

ఏప్రిల్ నుంచి ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా చైనాలోని తన ప్లాంట్ నుంచి యూరప్‌కు ఉత్పత్తుల సరఫరాను ఏప్రిల్ నుంచి ప్రారంభించనుంది. అరబిందో ఫార్మా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) సంతానమ్ సుబ్రమణియన్ ఈ విషయాన్ని తెలిపారు. 2024 నవంబరు చివరి వారంలో కంపెనీ చైనా ప్లాంట్‌లో కార్యకలాపాలను ప్రారంభించింది. ఉత్పత్తిని క్రమంగా పెంచుతోంది. ఈ యూనిట్‌లో తయారు చేసే ఉత్పత్తులను ప్రధానంగా యూరప్ మార్కెట్‌కు సరఫరా చేయనుంది. ఇందుకు యూరోపియన్ నియంత్రణ మండలి నుంచి అవసరమైన అనుమతులు కూడా లభించాయని సుబ్రమణియన్ వెల్లడించారు. ఈ ప్లాంట్ నుంచి అమెరికా మార్కెట్‌కు సరఫరా చేయనున్నట్లు, అందుకు యూఎస్ఎఫ్‌డీఏ నుంచి అవసరమైన అనుమతులను కూడా పొందనున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే 2-3 ఏళ్లలో కంపెనీ ఆదాయంలో గణనీయ వాటా చైనా ప్లాంట్ నుంచి సమకూరవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బజాజ్ కన్స్యూమర్ చేతికి విశాల్ పర్సనల్ కేర్

డీల్ విలువ రూ.120 కోట్లు

bajaj CONSUMER CARE — Banjara's

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఎఫ్ఎంసీజీ సంస్థ విశాల్ పర్సనల్ కేర్‌లో 100 శాతం వాటాలను రూ.120 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు బజాజ్ కన్స్యూమర్ కేర్ ప్రకటించింది. రెండు విడతల్లో ఈ వాటాలను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది. తొలుత 49 శాతం వాటా, అనంతరం మిగిలిన 51 శాతం వాటాను దక్కించుకోనున్నట్లు తెలిపింది. 1991లో కార్యకలాపాలు ప్రారంభించిన విశాల్ పర్సనల్ కేర్‌కు ఉన్న విస్తృత డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ద్వారా దక్షిణాది మార్కెట్లో తమ ఉత్పత్తులను మరింత చేరువ చేసే అవకాశం లభించనుందని బజాజ్ కన్స్యూమర్ కేర్ ఎండీ జైదీప్ నంది తెలిపారు. అలాగే, విశాల్ పర్సనల్ కేర్‌కు చెందిన హెయిర్ అండ్ స్కిన్ కేర్ ఉత్పత్తుల బ్రాండ్ 'బంజారా'స్‌ను ఉత్తరాది మార్కెట్‌కు పరిచయం చేయనున్నట్లు ఆయన చెప్పారు. కాగా, బజాజ్ కన్స్యూమర్ కేర్ ఫ్లాగ్‌షిప్ బ్రాండ్‌గా బజాజ్ ఆల్మండ్ డ్రాప్స్ ఉంది. అలాగే ఫేషియల్ కిట్స్, హెర్బల్ పౌడర్స్, అలోవెరా జెల్స్, షాంపూలు, హెయిర్‌కేర్ పౌడర్స్ సహా పలు రకాల ఉత్పత్తులను విక్రయిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (వెక్ 100 గుడ్లు)



17న తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	455
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	91
వరంగల్	80	గుంటూరు	90
కరీంనగర్	80	ఒంగోలు	90
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	75
కర్నూలు	80	నెల్లూరు	80
విశాఖపట్నం	83	అనంతపురం	80
గోదావరి	91		

23,300 ఎగువన బుల్లిష్

(ఫిబ్రవరి 17-21 తేదీల మధ్య వారానికి)



డా. భవనరాగం అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో టెక్

నిఫ్టీ గత వారం 23,569-22,775 పాయింట్ల మధ్యన కదలాడి చివరకు 630 పాయింట్ల నష్టంతో 22,929 పాయింట్ల వద్ద క్లోజైంది. ఈ వారం 23,300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 23,250 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 22,600
నిరోధ స్థాయిలు: 23,150, 23,250, 23,350 (23,050 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,700, 22,600, 22,500 (22,800 దిగువన బేరిష్)

- **బంధన్ నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్ ఫండ్**
బంధన్ మ్యూచువల్ ఫండ్.. నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ పథకం. ఈ ఫండ్‌కు నిఫ్టీ నెక్స్ట్ 50 టీఆర్ఐ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్‌ కనీస పెట్టుబడి రూ.1,000. ముగింపు తేదీ ఈ నెల 25.
- **యూనియన్ ఎంఎఫ్.. గోల్డ్ ఈటీఎఫ్**
యూనియన్ మ్యూచువల్ ఫండ్.. రెండు కొత్త ఫండ్ పథకాలను ప్రారంభించింది. యూనియన్ గోల్డ్ ఈటీఎఫ్, యూనియన్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్) పేరుతో వీటిని తీసుకువచ్చింది. ఇందులో గోల్డ్ ఈటీఎఫ్ ఓపెన్ ఎండెడ్ పథకం. దేశీయంగా బంగారం ధరలను ట్రాక్ చేస్తూ ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్స్ కనీస పెట్టుబడి రూ.1,000. ముగింపు తేదీ ఈ నెల 24.

పుల్‌బ్యాక్ ర్యాలీకి చాన్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. గత వారం వరుసగా పతనమవడంతో ఈసారి పుల్‌బ్యాక్ లేదా కౌంటర్ ర్యాలీకి అవకాశాలు కనిపిస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ఆదేశాలపై స్పష్టత వస్తే సూచీలు నిలకడగా సాగే వీలుంది. నిఫ్టీ మరోసారి కీలకమైన 22,900 స్థాయికి చేరుకుంది. సూచీకి ఇక్కడ బలమైన మద్దతు ఉంది. గత వారం అన్ని రంగాల షేర్లు పతనబాటలో సాగాయి. ప్రస్తుతం బ్యాంక్, ఫైనాన్స్, ఆటో, వినియోగ రంగాల షేర్లు కొంత పటిష్ఠతను సూచిస్తున్నాయి. అయితే సూచీలు స్థిరత్వం దేరే వరకు మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

హెచ్‌సీఎల్ టెక్: డిసెంబరు త్రైమాసిక ఫలితాల తర్వాత ఈ కౌంటర్‌లో కరెక్షన్ జరిగింది. జీవితకాల గరిష్ఠం నుంచి 18 శాతం వరకు పతనమయ్యాయి. ప్రస్తుతం కీలకమైన రూ.1,700 స్థాయిలో బేస్ ఏర్పడుతోంది. ఇప్పటికే రిలేటివ్ స్ట్రెంత్ బలంగానే ఉంది. గత శుక్రవారం రూ.1,711 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,700/1,680 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,770/1,820 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,650 స్థాయిని స్టాప్‌లా్‌స్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ కార్డ్స్: నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. జనవరి నుంచి అప్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. సెప్టెంబరు నాటి గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. రిలేటివ్ స్ట్రెంత్, డెలివరీ, వాల్యూమ్ సైతం పెరుగుతోంది. గత శుక్రవారం రూ.859 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.825/830 శ్రేణిలో ప్రవేశించి రూ.875/880 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.800 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా్‌స్‌గా పెట్టుకోవాలి.

కార్ట్రేడ్: మెరుగైన ఫలితాలు ప్రకటించడం, ఈపీఎస్ క్రమంగా పెరుగుతుండటంతో ఈ షేరుపై ఇన్వెస్టర్ల ఆసక్తి పెరిగింది. పైగా ఏప్రిల్ నాటి స్థాయిని బ్రేక్ చేయడం, రిలేటివ్ స్ట్రెంత్ పెరగడం శుభపరిణామాలు. గత శుక్రవారం రూ.1,567 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,550/1,530 శ్రేణిలో ప్రవేశించి రూ.1,665 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,500 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా్‌స్‌గా పెట్టుకోవాలి.

గాడ్‌ఫ్రే ఫిలిప్స్: జీవితకాల గరిష్ఠం నుంచి 50 శాతం వరకు పతనమైన ఈ షేరు మళ్లీ పుంజుకుంటోంది. రూ.4,200 స్థాయి నుంచి టర్న్ అరౌండ్ అయ్యాయి. ఈపీఎస్, సేల్స్ బాగా పెరిగాయి. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.5,999 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.5,850 వద్ద పొజిషన్ తీసుకుని రూ.6,250/6,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.5,800 స్థాయిని స్టాప్‌లా్‌స్‌గా పెట్టుకోవాలి.

హిందాల్కో: జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ షేరు 27 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. ప్రస్తుతం ఈ షేరు కీలకమైన మద్దతు స్థాయి వద్ద టర్న్ అరౌండ్ అయ్యింది. ప్రైస్ యాక్షన్ బలంగా ఉంది. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.606 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.590/580 స్థాయిలో ప్రవేశించి రూ.660/675 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.550 స్థాయిని స్టాప్‌లా్‌స్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్: పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ — 23,100 ఎగువన నిలదొక్కుకుంటేనే..



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పూర్తిగా బేరిష్ ట్రెండ్‌లో సాగుతూ 630 పాయింట్ల నష్టంతో 22,930 వద్ద క్లోజైంది. టెక్నికల్‌గా చూస్తే నిఫ్టీ కీలక స్థాయి అయిన 22,800కి స్వల్ప ఎగువన ఉంది. సానుకూలత కోసం మార్కెట్ ఇక్కడ కచ్చితంగా రికవరీ కావాల్సి ఉంటుంది. పాజిటివ్ ఇండికేషన్ కోసం ఇక్కడ కొద్ది రోజులు నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.


బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్ కోసం తదుపరి నిరోధ స్థాయి అయిన 23,100 ఎగువన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధ స్థాయిలు 23,300, 23,600.

బేరిష్ స్థాయిలు: ఏదైనా బలహీనత సూచిస్తే తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 22,800. ఇక్కడ కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనతను సూచిస్తుంది. తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 22,400.

బ్యాంక్ నిఫ్టీ: ఈ వారంలో ఈ సూచీ సానుకూలత కోసం కీలకమైన 49,000 ఎగువన కన్సాలిడేట్ కావాల్సి ఉంటుంది. రికవరీ సాధిస్తే ప్రధాన నిరోధం 49,600 ఎగువన ఉంటుంది. ఇక్కడ నిలదొక్కుకుంటే తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 50,000. బలహీనతను సూచిస్తే మాత్రం 48,700 వద్ద మద్దతు స్థాయిలు ఉంటాయి.

పాటర్న్: మార్కెట్ 22,800 వద్ద డబుల్ బాటమ్ ప్యాటర్న్‌కు స్వల్ప ఎగువన ఉంది. ఇక్కడ బ్రేక్‌డౌన్ అయితే మరింత డౌన్‌సైడ్ బ్రేకౌట్ ప్యాటర్న్‌ను సూచిస్తుంది. అప్రమత్తంగా ఉండాలి. 23,100 వద్ద నిరోధం ఉంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,040, 23,100
మద్దతు	22,870, 22,800



రాష్ట్రంలో గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) రోగులు పెరుగుతున్నారు. లక్షణాలు తీవ్రంగా ఉన్న వారికి ఇమ్యునోగ్లోబలిన్ ఇంజెక్షన్ ఇస్తే ప్రాణాలు కాపాడవచ్చు..! గుండె పోటు మరణాలను తగ్గించేందుకు టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్స్ చాలా కీలకం. వీటితోపాటు హీమోఫీలియా రోగులకు ఫ్యాక్టర్ ఇంజెక్షన్లు, షుగర్ రోగులకు ఇన్సులిన్.. ఇలా రోగులకు ప్రాణాధారమైన ఇంజెక్షన్లేవీ ప్రభుత్వాస్పత్రుల్లో ఉండడం లేదు. దాదాపు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లోనూ ఇంజెక్షన్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

ఇంజెక్షన్లు లేవు..!

ప్రభుత్వాస్పత్రుల్లో సూది మందుల కొరత

- జీబీఎస్ చికిత్సలో కీలకమైన ఇమ్యునోగ్లోబలిన్
- గుంటూరులో తప్ప మరెక్కడా దొరకని వైనం
- టెనెక్టెప్లేస్, ఫ్యాక్టర్, ఇన్సులిన్లకూ కరువే
- బయట కొనుక్కోవాలంటున్న వైద్యులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఓవైపు జీబీఎస్ కేసులు.. మరోవైపు నానాటికీ పెరిగిపోతున్న గుండె జబ్బులు.. మధుమేహ బాధితులు.. ఇలాంటి కీలక సమయంలో అందరి అవసరాలకూ కావలసిన ఇంజెక్షన్ల కొరత ప్రభుత్వాస్పత్రులను వేధిస్తోంది. ప్రజారోగ్యం దృష్ట్యా అత్యవసర మందులు, ఇంజెక్షన్లను ప్రభుత్వం అందుబాటులో ఉంచుకోవాలి. కానీ.. ప్రస్తుతం రాష్ట్రంలో రెండు నెలలుగా ఇంజెక్షన్ల కొరత నెలకొంది. రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) నుంచి సరిపడా సప్లయ్ లేక ప్రభుత్వాస్పత్రుల్లో కీలకమైన ఇంజెక్షన్లు అందుబాటులో ఉండడం లేదు. దీంతో వైద్యులు కొంతమంది రోగులకు వాటిని బయట కొనుక్కోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా జీబీఎస్ చికిత్సలో కీలకమైన ఇమ్యునోగ్లోబలిన్, షుగర్ రోగులకు కావాలసిన ఇన్సులిన్లు, హీమోఫీలియా రోగులకిచ్చే ఫ్యాక్టర్ ఇంజెక్షన్లతోపాటు పాటు స్టెమి కార్యక్రమంలో ఉపయోగించే టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ల కొరత అధికంగా ఉంది. ప్రస్తుతం జీబీఎస్ వ్యాప్తి కలకలం రేపుతోంది. దీని నివారణకు ఉపయోగించే ఇంజెక్షన్లలో ఇమ్యునోగ్లోబలిన్ ఒకటి. ఇలాంటి సమయంలో ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచుకోవాలి. అయితే గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో మాత్రమే ఇమ్యునోగ్లోబలిన్ ఇంజెక్షన్లను అధికారులు స్థానికంగా కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతున్నారు. మిగిలిన ఆస్పత్రుల్లో మాత్రం వీటి కొరత తీవ్రంగా ఉంది. వీటి సరఫరాలో ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు విఫలమవుతున్నారు. దీంతో పాటు షుగర్ రోగులకు ఉపయోగించే ఇన్సులిన్ కొరత కూడా ఉంది. దీని ధర మార్కెట్లో అధికంగా ఉంటుంది. కాబట్టి సాధారణ ప్రజలు వాటిని కొనుగోలు చేసి వాడలేని పరిస్థితి. అలాగే ప్రభుత్వాస్పత్రుల్లో హీమోఫీలియా రోగులకు ఉపయోగించే ఫ్యాక్టర్ ఇంజెక్షన్లను డయాలసిస్ రోగులకు కూడా ఇస్తున్నారు. వీటికి కూడా కొరత ఏర్పడింది. ఏపీఎంఎస్ఐడీసీ నుంచి డిమాండ్‌కు తగ్గ సప్లయ్ లేకపోవడంతో వైద్యులు కూడా చేతులెత్తేస్తున్నారు.

స్టెమీలోనూ అంతే...

గుండె సంబంధిత సమస్యలు వచ్చినప్పుడు వెంటనే స్పందించి, రోగులను ప్రాణాపాయం నుంచి కాపాడేందుకు ఆరోగ్యశాఖ స్టెమీ-ఏపీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా ఎవరికైనా రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టి గుండె పోటు వచ్చినప్పుడు వెంటనే టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు. ఈ ఇంజెక్షన్ ధర కూడా చాలా ఎక్కువ. గతంలో ఈ ఇంజెక్షన్ హృద్రోగులకు మాత్రమే ఉపయోగించేవారు. ప్రస్తుతం న్యూరాలజీ, గ్యాస్ట్రో, జనరల్ మెడిసిన్ విభాగాల రోగులకూ వాడుతున్నారు. సాధారణంగానే ఈ ఇంజెక్షన్ల కొరత తీవ్రంగా ఉంటుంది. ఇప్పుడు మిగిలిన విభాగాల రోగులకు కూడా వాడడంతో కొరత మరింత ఎక్కువైంది. టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ సరఫరా చేసే కంపెనీకి ఏపీఎంఎస్ఐడీసీ భారీగా బకాయిలు పడినట్లు తెలుస్తోంది. దీంతో సదరు కంపెనీ ఇంజెక్షన్ల సరఫరా పూర్తిస్థాయిలో చేయడం లేదు.

విశాఖలో పింక్ సఖీ శారీ వాక్

- పాల్గొన్న సినీనటి గౌతమి

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భయాన్ని వీడి పోరాడితే క్యాన్సర్‌ను అధిగమించడం సాధ్యమేనని ప్రముఖ సినీ నటి, లైఫ్ అగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి పేర్కొన్నారు. క్యాన్సర్ రహిత సమాజం రావాలని ఆమె ఆకాంక్షించారు. విశాఖ బీచ్ రోడ్డులో ఆదివారం క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ 'పింక్ సఖీ శారీ వాక్' నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమి మాట్లాడుతూ.. క్యాన్సర్‌పై కొన్ని అపోహలున్నాయని, దీనిపై అవగాహన పెంచుకుంటే భయాన్ని అధిగమించవచ్చని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గురుద్వార్ సత్సంగ్ అధ్యక్షుడు పీఎస్ ఆనంద్, ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి ఎన్ఎస్ రాజు, రవీంద్ర, వరుణ్ గ్రూప్ సంస్థల చైర్మన్ ఎస్పీ ప్రభుకిశోర్ తదితరులు పాల్గొన్నారు.



పింక్ సఖీ శారీ వాక్ సందర్భంగా మాట్లాడుతున్న సినీ నటి గౌతమి, చిత్రంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, తదితరులు

జీబీఎస్‌తో జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

జాగ్రత్తలు వహించాలని వైద్యులు సూచిస్తున్నారు. కరోనాలో గరిష్ఠంగా 2 శాతం ప్రపంచ సగటు మరణాల రేటు ఉండగా, జీబీఎస్‌లో 7 శాతం ఉంది. జీబీఎస్ ఎంత వేగంగా మానవ శరీరాన్ని దెబ్బతీస్తుందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో నమోదైన రెండు మరణాలూ సరైన సమయానికి వైద్యం అందకపోవడం వల్లే సంభవించాయి. శ్రీకాకుళం జిల్లాల్లో ఆరేళ్ల బాలుడు జీబీఎస్ బారినపడినప్పుడు నాలుగైదు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకువెళ్లారు. ఆ ఆస్పత్రులు వ్యాధిని గుర్తించడంలో జాప్యం చేయడంతో చివరికి ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే శరీరంలో జరగాల్సిన నష్టం జరిగి ప్రాణం పోయింది. తాజాగా ప్రకాశం జిల్లా మహిళను కూడా ఇలాగే నాలుగైదు ఆస్పత్రులకు తీసుకెళ్లి, చివరికి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. అయితే, అప్పటికే తగిన వైద్యం అందించడంలో జాప్యమై ఆమె కూడా మరణించారు. కాబట్టి ఎవరిలోనైనా జీబీఎస్ లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రులను సంప్రదించడం మేలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో అయితే వెంటనే జీబీఎస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వైద్యం ప్రారంభిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ప్రస్తుతం ఈవ్యాధి నిర్ధారణ పరీక్షలను ఆరోగ్యశాఖ చేపడుతోంది.

లక్షణాలు ఇవీ..

జీబీఎస్ లక్షణాలు అందరికీ ఒకేలా ఉంటాయని చెప్పలేం. కొంత మందికి దగ్గు, జ్వరంతో పాటు వెంటనే కాళ్లు పట్టేయడం జరుగుతోంది. కొంత మందికి విరేచనాలతో లక్షణాలు ప్రారంభమవుతున్నాయి. ఏదైనా చివరికి నరాల మీద ప్రభావం చూపి, శరీరంలోని నాడీవ్యవస్థను దెబ్బతీస్తుంది. ముఖ్యంగా నరాల సమస్యలున్నవారు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. జీబీఎస్ శరీరంలోకి ప్రవేశించగానే సాధారణ వ్యాధి లక్షణాలతో ప్రారంభమై జలుబు, దగ్గు, విరేచనాలు, కాళ్లు పట్టేయడం తదితర లక్షణాలు మొదలవుతాయి. ఆ సమస్యలను తగ్గించడానికి మన శరీరంలో యాంటీబాడీలను సిద్ధం చేస్తుంది. ఈ యాంటీబాడీలు అధికంగా ఉత్పత్తి కావడంతో అవి తిరిగి శరీరాన్ని డ్యామేజ్ చేస్తాయి. యాంటీబాడీలు శరీరంలోని మొత్తం నరాల వ్యవస్థపై దాడి చేయడం ప్రారంభించి నెమ్మదిగా మెదడుపై ప్రభావం చూపుతాయి. శ్వాస సంబంధిత సమస్యలు, నీరసం ఏర్పడతాయి.. ఇదంతా కేవలం 10 నుంచి 15 రోజుల వ్యవధిలోనే జరిగిపోతుంది. కాబట్టి న్యూరాలజీ సమస్యలున్న వారు అత్యంత జాగ్రత్తగా ఉండాలి.

చిన్నారులు, వృద్ధులపై ప్రభావం

జీబీఎస్ ఎక్కువగా చిన్నారుల, వృద్ధులపై ప్రభావం చూపుతోంది. చాలా మంది చిన్నారులు తమకు వచ్చే అనారోగ్య సమస్యలను స్పష్టంగా చెప్పలేరు. కాబట్టి తల్లిదండ్రులు పిల్లలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. ముఖ్యంగా చిన్నారులకు ఆహారంలో పాలు ఇచ్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పాల వల్ల ఎక్కువగా జీబీఎస్ ఎఫెక్ట్ అవుతోంది. కాబట్టి బాగా వేడి చేసిన పాలను మాత్రమే చిన్నారులకు అందించాలి. మంచినీళ్లను కూడా కాచి చల్లార్చినవి వాడితే మంచిది.

అంటువ్యాధి కాదు కానీ..

ఇది అంటు వ్యాధి కాదు. కానీ, ఏ రూపంలో శరీరంలోకి ప్రవేశిస్తుందో చెప్పలేని పరిస్థితి. కాబట్టి చిన్నారులు, వృద్ధులతో పాటు ప్రతి ఒక్కరూ కరోనా సమయంలో పాటించిన జాగ్రత్తలు మొత్తం పాటించాలి. పెద్ద వయసు వారు కూడా చాలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

అన్ని రాష్ట్రాల్లోనూ కేసులు

దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ జీబీఎస్ కేసులు నమోదవుతున్నాయి. ఇది ప్రమాదకరమైన సిండ్రోమ్ కాదని ప్రభుత్వం చెబుతోంది. కానీ, కేసుల సంఖ్య పెరిగిపోతోంది. గుజరాత్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కేసుల సంఖ్య అధికంగా ఉంది. తాజాగా ఏపీలోనూ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం ఇప్పటి వరకూ 59 కేసులు నమోదయ్యాయి. అయితే, ఇంకా ఎక్కువగానే కేసులు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇంజెక్షన్ల కొరత..

జీబీఎస్‌కు అందించే వైద్యంలో ఉపయోగించే ఇమినోగ్లోబినిస్ థెరిపి ఇంజెక్షన్ల్ కొరత ఎక్కువగా ఉంది. ప్రభుత్వం గుంటూరు, కాకినాడ, కర్నూలు, విశాఖపట్నం వంటి ముఖ్యమైన ఆస్పత్రుల్లో ఈ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో దీన్ని రూ.30 వేలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంజెక్షన్ డిమాండ్ పెరిగే కొద్ది ప్రైవేటు ఆస్పత్రులు దీన్ని వ్యాపారంగా మార్చేసే అవకాశం ఉంది. కరోనా సమయంలో రెమిడిస్‌వేర్‌ను కూడా ఇలానే బ్లాక్ చేసి రూ.లక్షలకు అమ్మేశారు. అప్పుడంటే ఒకటి లేదా రెండు ఇంజెక్షన్లు చేస్తే సరిపోయేవి. కానీ, జీబీఎస్ రోగికి ఐదారు ఇంజెక్షన్లు అవసరమవుతాయి. కాబట్టి ప్రభుత్వం రంగంలోకి దిగి ఇంజెక్షన్లు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. మరణాల శాతం ఎక్కువగా ఉన్న జీబీఎస్‌పై ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటే మంచిదని వైద్యులు అంటున్నారు.


కమలమ్మ


ప్రకాశం జిల్లా అలసందలపల్లిలో కమలమ్మ ఇంటిని పరిశీలిస్తున్న డీపీవో వెంకటనాయుడు, అధికారులు

ప్రకాశం జిల్లాలో మహిళ మృతి

- కొమరోలు మండలం అలసందలపల్లి మహిళ మృతి
- గ్రామంలో క్లోరినేషన్.. వైద్య శిబిరాల ఏర్పాటు
- గుంటూరులోనూ ఒకరి పరిస్థితి విషమం
- జీజీహెచ్‌లో ఇప్పటి వరకు ఎనిమిది కేసులు

గుంటూరు మెడికల్, కొమరోలు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో గులియన్ బారే సిండ్రోమ్(జీబీఎస్) కలకలం రేగింది. కొమరోలు మండలం అలసందలపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ బైళ్ల కమలమ్మ(50) ఈ మహమ్మారి బారిన పడి ఆదివారం మృతి చెందారు. ఆమె ఈనెల 2వ తేదీ రాత్రి ఒక్కసారిగా అనారోగ్యం బారిన పడ్డారు. కండరాల నొప్పితో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు తొలుత గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం వైద్యుల సిఫారసు మేరకు ఈనెల 3వ తేదీన గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు రక్తపరీక్షలు నిర్వహించగా జీబీఎస్ బారినపడినట్లు తేలింది. దీంతో న్యూరాలజీ విభాగం ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటిలేటర్‌పై ఉంచారు. ఇమ్యునో గ్లోబిలిన్ ఇంజెక్షన్లు కూడా ప్రారంభించారు. అయితే వ్యాధి తీవ్రత కారణంగా కోలుకోలేకపోయిన కమలమ్మ ఆదివారం తుది శ్వాస విడిచారు. ప్రకాశం జిల్లా కలెక్టర్‌కు ఆ సమాచారం అందడంతో వెంటనే జిల్లా, డివిజన్, మండల స్థాయి వైద్యారోగ్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో సూపర్ క్లోరినేషన్ చేయించారు. గ్రామంలో రెండు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు చేస్తున్నారు. మరోవైపు సమీప గ్రామాల ప్రజలను కూడా అప్రమత్తం చేశారు. కాగా, కమలమ్మకు భర్త వెంకటయ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలో ఇది రెండో జీబీఎస్ మరణం. గత వారం శ్రీకాకుళం జిల్లాలో యుగందర్ అనే బాలుడు జీబీఎస్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా గుంటూరు నగరంలోని ఇందిరా ప్రియదర్శిని కాలనీకి చెందిన ఆశీర్వాదం(50) ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో స్ట్రోక్ ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. శనివారం మరో వ్యక్తి జీబీఎస్ లక్షణాలతో గుంటూరు జీజీహెచ్‌లో చేరగా, వైద్య పరీక్షల్లో జీబీఎస్ నిర్ధారణ అయ్యింది. ఈ సీజన్‌లో గుంటూరు జీజీహెచ్‌లో ఇది ఎనిమిదో జీబీఎస్ కేసు.

వాయిదాల 'నవోదయం 2.0'

- నాటుసారా నిర్మూలన ధ్యేయం
- ఆ దిశగా కార్యక్రమం రూపకల్పన
- నాలుగుసార్లు ప్రారంభం వాయిదా
- రాష్ట్రంలో భారీగా పట్టుబడుతున్న సారా
- 8 నెలల్లో 50 వేల లీటర్లు స్వాధీనం

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాటుసారా నిర్మూలన, ప్రజల్లో అవగాహన కోసం రూపొందించిన 'నవోదయం 2.0' కార్యక్రమం ప్రారంభం వాయిదాల పర్వంగా సాగుతోంది. గత రెండు నెలల వ్యవధిలో ఇప్పటి వరకు ఈ కార్యక్రమం ప్రారంభించేందుకు నాలుగుసార్లు ప్రయత్నాలు జరిగాయి. కానీ, అనివార్య కారణాలతో నాలుగుసార్లు వాయిదా వేశారు. తాజాగా ఒంగోలులో నవోదయం-2.0 ప్రారంభించాలని నిర్ణయించారు. కానీ, ఇప్పుడు కూడా ఇది వాయిదా పడింది. దీంతో అసలు నవోదయం ఇప్పట్లో ప్రారంభమవుతుందా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. వాస్తవానికి నవోదయం-2.0 కార్యక్రమాన్ని సంక్రాంతి పండుగకు ముందే ప్రారంభించాలనుకున్నారు. కానీ, పండుగ నేపథ్యంలో సిబ్బందిని సమీకరించడం కష్టమవుతుందని భావించి.. జనవరి 29న ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే, ఆ రోజు కూడా వాయిదా పడి.. 31వ తేదీకి మారింది. అయితే.. అప్పుడు కూడా వివిధ కారణాలతో వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 15(శనివారం) ప్రారంభించాలని తేదీ ఖరారు చేశారు. కానీ, ఒంగోలులో సీఎం చంద్రబాబు వేరే కార్యక్రమంలో పాల్గొంటున్న నేపథ్యంలో మళ్లీ వాయిదా వేశారు. 19న ప్రారంభించాలని తాజాగా కసరత్తు చేస్తున్నారు. అయితే, కీలక కార్యక్రమం ప్రారంభోత్సవం ఇన్నిసార్లు వాయిదా పడటంపై విమర్శలు వస్తున్నాయి. గత 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో నాటుసారా నిర్మూలనకు నవోదయం కార్యక్రమాన్ని అమలుచేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో నాటుసారా భారీగా పెరిగింది. ఇప్పటికీ ఆ ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో అప్పటి నవోదయంకార్యక్రమానికి కొనసాగింపుగా ఈసారి నవోదయం 2.0ను రూపొందించారు. కానీ, రెండు నెలల నుంచి ఈ కార్యక్రమం పట్టాలెక్కకుండా వాయిదాలు పడుతూ వస్తోంది. ఇన్ని వాయిదాలపై ఎక్సైజ్ సిబ్బందిలోనూ అసహనం వ్యక్తమవుతోంది.

జగన్ హయాంలో..

గత జగన్ ప్రభుత్వంలో నాటుసారా స్థావరాలు జోరుగా విస్తరించాయి. అవే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక ఎనిమిది నెలల కాలంలో నాటుసారా విక్రయాలపై 6,701 కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో 3,009 మందిని నిందితులుగా చేర్చారు. 51,143 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. అదేసమయంలో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 25,93,542 లీటర్ల బెల్లం ఊటను, 17,499 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. 222 వాహనాలను సీజ్ చేశారు.

ఠారెత్తించిన ఎండ

- కర్నూలులో 38.2 డిగ్రీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మధ్యభారతం మీదుగా వీచిన పొడిగాలులతో రాష్ట్రంలో ఆదివారం ఎండ ఠారెత్తించింది. రాయలసీమ, కోస్తాలో పలుచోట్ల ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతీవ్రతతో వాతావరణం వేడెక్కింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలో అత్యధికంగా కర్నూలులో 38.2 డిగ్రీలు నమోదైంది. కోస్తాలో పలుప్రాంతాల్లో ఉదయంపూట పొగమంచు కురిసింది. శివారు ప్రాంతాలు, ఏజెన్సీలో రాత్రిపూట చలి తీవ్రత కొనసాగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా కుంతలంలో తొమ్మిది డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో అక్కడక్కడా పొగమంచు కురుస్తుందని, కోస్తా, రాయలసీమలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

రీ సర్వే రచ్చ

(మొదటి పేజీ తరువాయి)

అత్యధిక ఫిర్యాదులు	
మ్యుటేషన్ సమస్యలపై	94,324
భూమి విస్తీర్ణంలో తేడాలు	88,758
రెవెన్యూ రికార్డుల్లో తప్పుల సవరణకు	71,059
ల్యాండ్ పార్సిల్ విభజన	54,958
పట్టాదారు పాసుపుస్తకాల సమస్య	29,948

చుట్టుముడతాయి. గత జగన్ ప్రభుత్వంలో జరిగింది ఇదే. జగన్ అధికారంలోకి వచ్చేనాటికి కొన్ని సమస్యలున్నాయి. అందులో భూ వివాదాలు కొన్ని. వాటిని ఆయన పరిష్కరించాల్సింది పోయి భూముల సర్వే పేరిట కొత్తగా ప్రతి ఇంటికో భూ వివాదాన్ని సృష్టించారు. రీ సర్వే ఉద్దేశం మంచిదే అయినా ఆచరణే చెత్తగా ఉంది. అధికారులు చట్టబద్ధమైన సర్వే చేయలేదు. సర్వే సరిహద్దుల చట్టం ప్రకారం ప్రతి దశలో రైతులను భాగస్వాములను చేసి, వారి ఆమోదంతో సర్వే చేపట్టాలి. కానీ రైతుల ప్రమేయం లేకుండానే సర్వే చేసినట్లుగా రికార్డులు తయారు చేశారు. ఆ తప్పులను రైతులపై రుద్దారు. లెక్కలేనన్ని తప్పులను సరిదిద్దడం ఇప్పుడు కూటమి సర్కారు బాధ్యతగా మారింది. గతేడాది జూన్ 15 నుంచి ఈనెల 6 వరకు గ్రామ సభలు, రెవెన్యూ సదస్సులు, ప్రజావేదిక, ప్రజాప్రతినిధులు, పార్టీల ఆఫీసులు, మంత్రులు, సీఎంఓకు వచ్చిన ఫిర్యాదులన్నీ దాదాపు 7,42,301. ఇందులో రీ సర్వేతో వచ్చిన సమస్యలపైనే ఎక్కువగా ఉన్నాయి. మొత్తం ఫిర్యాదులను క్రోడీకరించగా టాప్-5 జాబితాలో రెవెన్యూ అంశాలే ఉన్నాయి.

రైతులకు కొత్త సమస్యలు

జగన్ ప్రభుత్వం 100ఏళ్ల తర్వాత చరిత్రాత్మకమైన సర్వే చేస్తున్నామంటూ ఆర్భాటం చేసింది. సర్వే సరిహద్దుల చట్టం-1923 ప్రకారం సర్వేకు ముందు రైతుకు నోటీసు ఇవ్వాలి. సర్వే చేసిన తర్వాత మరో నోటీసు ఇచ్చి లిఖితపూర్వకంగా రైతు ఆమోదం తీసుకోవాలి. ఒకవేళ సర్వే రిపోర్టుపై రైతుకు భిన్నాభిప్రాయం ఉంటే మరోసారి సర్వే చేయాలి. లేదంటే రీసర్వే అప్పీల్ డిప్యూటీ తహశీల్దార్ వద్ద పిటిషన్ వేయాలి. ఇవన్నీ చట్టప్రకారం చేయాలి. కానీ జగన్ సర్కారు అధికార యంత్రాంగాన్ని తొందరపెట్టింది. ఈ ప్రాజెక్టు పేరు చెప్పి ఎన్నికల్లో లబ్ధిపొందాలని భావించి త్వరగా రీ సర్వేను ముగించాలని ఒత్తిడి చేసింది. ఫలితంగా అధికారులు నిబంధనలు పాటించకుండా రీ సర్వే రికార్డులు తయారు చేశారు. దీంతో రైతుల భూముల విస్తీర్ణం, సరిహద్దుల్లో తేడాలు వచ్చాయి. పాసుపుస్తకాల్లో పేర్లు, సర్వే నంబర్, సరిహద్దుల్లో తేడాలు వచ్చాయి. వాటిని పరిష్కరించాల్సిన రెవెన్యూ, సర్వే అధికారులు చేష్టలుడిగిపోయారు. జగన్ ప్రభుత్వ ఉద్దేశాలకు అనుగుణంగా రీ సర్వే అద్భుతంగా సాగుతోందని, రంగురంగుల చిత్రాలు, గ్రాఫిక్స్‌తో కూడిన తప్పుడు నివేదికలు ఇచ్చారు. రీ సర్వేలో లోపాలు, తప్పులున్నాయని ఎత్తిచూపొద్దని, ప్రభుత్వానికి నివేదించొద్దని కలెక్టర్, జేసీ, సర్వే, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేశారు. లక్షల మంది రైతులు ఇబ్బందులకు కారకుడైన ఓ అధికారి సర్వే నుంచి తప్పుకొని చల్లగా రాష్ట్రం నుంచి జారుకున్నారు.

ఇప్పుడైనా చిత్తశుద్ధిగా పనిచేస్తారా?

జగన్ సర్కారు రాష్ట్రంలో 17,600 గ్రామాలకు గాను 8,680 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసింది. ఆ గ్రామాల్లోనే లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ఇన్ని సమస్యలకు కారణమైంది రెవెన్యూ శాఖనే. ఇప్పుడు రైతుల ఫిర్యాదులను పరిష్కరించాల్సింది కూడా అదే శాఖనే. గతంలో జరిగిన తప్పులకు అధికారులపై ప్రభుత్వం ఏ చర్యలూ తీసుకోలేదు. ఇప్పుడయినా అధికారులు చిత్తశుద్ధితో రైతుల ఫిర్యాదులు పరిష్కరిస్తారా? లేక కాగితాల్లోనే పరిష్కారం చూపిస్తారా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. లక్షల్లో వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నట్లుగా సిబ్బంది చెబుతున్నారు. వేగంగా పరిష్కరించేంత సిబ్బంది ఇప్పుడు రెవెన్యూ శాఖ వద్ద లేరు. తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐ, ఇతర సిబ్బంది కొరత భారీగా ఉంది. కాబట్టి సమస్య పరిష్కారమే అజెండాగా దిశానిర్దేశం చేయాలని, టార్గెట్‌లు పెడితే మళ్లీ కాగితాలపై పరిష్కారం చూపే ప్రమాదం ఉందని సీనియర్ అధికారులు చెబుతున్నారు.

పెట్టుబడులకు ఏపీ అనుకూలం

- చేనేతరంగ అభివృద్ధికి టెక్స్‌టైల్ పాలసీ
- దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలతో మంత్రి సవిత

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో చేనేతరంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబు టెక్స్‌టైల్ పాలసీ తీసుకొచ్చారని, పెట్టుబడులకు రాష్ట్రం అనువైన ప్రాంతమని బీసీ సంక్షేమ, చేనేత జౌళ్ల శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ భారత్ టెక్స్-2025 కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. దేశ విదేశాలకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు తక్షణ అనుమతులు, రాయితీలు ఇవ్వడంతో పాటు భూకేటాయింపులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు చంద్రబాబు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రపంచంలోనే మేలైన పట్టు, చేనేత వస్త్రాలు తమ రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నాయని, వాటి మార్కెటింగ్‌కు రాష్ట్రంతో పాటు దేశంలోని పలు నగరాల్లో చేనేత ఎగ్జిబిషన్లు, ఎక్స్‌పోలు నిర్వహిస్తున్న తెలిపారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వారికి 365 రోజుల పని కల్పించే లక్ష్యంతో టెక్స్‌టైల్ పార్కులు, వీవర్ శాలలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి చెప్పారు. నూలు కొనుగోలుపై 15 శాతం మేర రాయితీ అందిస్తున్నామన్నారు. చేనేత వస్త్రాల వినియోగంపై పెరుగుతున్న మక్కువను దృష్టిలో పెట్టుకుని అమెజాన్, మింత్రా, ఫ్లిప్‌కార్ట్, జియోమార్ట్ వంటి ఏడు ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌లలో 20 ఆప్కో షోరూమ్‌ల ద్వారా డోర్ డెలివరీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఏపీ చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, ఆప్కో ఎండీ పావనమూర్తి పాల్గొన్నారు.


భారత్ టెక్స్-2025లో మంత్రి సవిత

ఏటా 20 శాతం అప్పులు!

- మరోవైపు ఆదాయంలోనూ కోత
- నీతి ఆయోగ్ నివేదికలో దిగువన రాష్ట్రం
- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ వెల్లడి


ప్రసంగిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్, వేదికపై లక్ష్మణరావు, లక్ష్మణరెడ్డి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్‌లో 18 రాష్ట్రాలలో ఏపీ 17వ స్థానంలో ఉందని రాష్ట్ర ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పీవీ రమేశ్ తెలిపారు. గుంటూరులో ఆదివారం 'ఆంధ్రాలో ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేదెలా?' అనే అంశంపై జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఆరోగ్య స్థితిపై నీతి ఆయోగ్ ఇచ్చిన నివేదికలోని అంశాలను వివరించారు. అప్పుల సూచీలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని, అప్పులు తీర్చే విషయంలో వెనుకబడిందని తెలిపారు. 2014 నుంచి 2023 వరకు ఏటా 20 శాతం అదనంగా అప్పులు చేయాల్సి వచ్చిందని నివేదిక వెల్లడించినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఏటా రాబడి 6 శాతం వరకు తగ్గుతూ వచ్చిందన్నారు. గత 10 సంవత్సరాలలో రాష్ట్ర బడ్జెట్‌లో మూలధన వ్యయం 4 శాతానికే పరిమితమైందన్నారు. సదుద్దేశంతో ఏర్పాటు చేసిన సీఎఫ్ఎంఎస్ విధానం దారి తప్పిందన్నారు. ప్రస్తుతం దిగజారిన వ్యవస్థలో ప్రజలను కుల, మత, ప్రాంతాల వారీగా విభజించే విష సంప్రదాయాన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. మాజీ మంత్రి, టీడీపీ నేత డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. ప్రధాన పార్టీలు గెలుపు కోసం ఉచితాలను ప్రకటిస్తున్నాయని అన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి వంటి వాటినే ప్రజలు కోరుకుంటున్నారని, ఉచితాలను కాదని వివరించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 31 జలవనరుల ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని, తద్వారానే సంపద సృష్టి జరుగుతుందన్నారు. చర్చా గోష్ఠిలో 'నేస్తం' సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయరెడ్డి, రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు షోకాజ్

- ఈ నెల 22న విశాఖ జేసీ ఎదుట హాజరుకావాలని కలెక్టర్ ఆదేశాలు
- విశాఖలో ప్రభుత్వ భూ రికార్డుల ట్యాంపర్ వ్యవహారంలో కదలిక


మధురవాడలో రెవెన్యూ అధికారులు రికార్డులను ట్యాంపర్ చేసిన ప్రభుత్వ భూముల్లో ఇది ఒకటి

విశాఖపట్నం/కొమ్మాది, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో భూముల రికార్డులను స్కానింగ్ చేసి భద్రపరిచే క్రమంలో వాటిని ట్యాంపర్ చేసిన వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. రికార్డులు స్కానింగ్ చేసే సమయంలో మోసపూరితంగా వ్యవహరించిన ఏడుగురు అధికారులు, ఉద్యోగులకు ప్రభుత్వం తాజాగా షోకాజ్ నోటీసులు జారీచేసింది. ఈ నెల 22న విశాఖపట్నం జాయింట్ కలెక్టర్(జేసీ) ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. రెవెన్యూ రికార్డులు పాడైపోతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రికార్డులను స్కానింగ్ చేసి భద్రపరచాలని 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విశాఖ రూరల్ మండలంలోని భూముల రికార్డులను సర్వే శాఖ స్కానింగ్ చేసింది. ఈ క్రమంలో 2004 నుంచి 2007 మధ్య స్కానింగ్ చేసేటప్పుడు మధురవాడలో సర్వే నంబర్లు 367, 368, 369, 370, అదేవిధంగా కొమ్మాది, పరదేశిపాలెంలో పలు ప్రభుత్వ భూముల రికార్డులు మార్చేశారు. రెవెన్యూలో కొందరు అధికారులు, రియల్టర్లు కలిసి.. రికార్డుల్లో ప్రభుత్వ భూమి బదులు కొందరు వ్యక్తుల పేర్లు నమోదు చేశారు. క్లాసిఫికేషన్‌లో జిరాయితీగా పేర్కొంటూ ట్యాంపర్ చేశారు. తర్వాత సదరు రికార్డుల్లో ఉన్న వ్యక్తులు, వారి తరఫున రియల్టర్లు రంగ ప్రవేశం చేసి భూముల స్వాధీనానికి ప్రయత్నించారు. సర్వే నంబరు 367లో కొన్ని నిర్మాణాలు చేపట్టడంతో అధికారులు అప్రమత్తమై రికార్డులు పరిశీలించినపుడు ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తించారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించారు. దీంతో ప్రైవేటు వ్యక్తులు కోర్టుకు వెళ్లారు. సుమారు 10 నుంచి 12 ఏళ్ల నుంచి వివాదం కొనసాగుతూనే ఉంది. కాగా, ప్రభుత్వ భూముల రికార్డులు ట్యాంపరింగ్ వ్యవహారంలో 2004 నుంచి 2007 వరకు కలెక్టరేట్‌లోని ఎఫ్-సెక్షన్‌లో పనిచేసిన అధికారులు/ఉద్యోగులు మొత్తం ఏడుగురికి తాఖీదులు ఇచ్చారు. అప్పటి ఎఫ్ సెక్షన్ సూపరింటెండెంట్లుగా పనిచేసి ప్రస్తుతం పలుచోట్ల డిప్యూటీ కలెక్టర్లుగా ఉన్న పి. ధర్మచంద్రారెడ్డి, ఎస్‌డీ అనిత, డి. ప్రమీలాగాంధీ, కె. సుబ్బారావు సహా ఇతర ఉద్యోగులకు నోటీసులు పంపారు.



జల్లికట్టులో ఎద్దును నిలువరించేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

జల్లికట్టు.. రారెత్తేట్టు! 40 మందికి గాయాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరిలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. చంద్రగిరి పరిసర ప్రాంతాల నుంచి భారీగా ఎద్దులను తీసుకొచ్చారు. వాటి కొమ్ములు చెలిగి, రంగులు వేసి, కొప్పులను తొడిగి, రాజకీయ నాయకులు, సినీనటులు, దేవుళ్ల ఫొటోలు, రంగుల కాగితాలు అతికించిన చెక్క పలకలతోపాటు, నగదు, విలువైన వస్తు సామగ్రిని వాటికి కట్టారు. వీధిలో గుంపులుగా ఎద్దులను వదలడంతో వాటిని నిలువరించి కొమ్ములకున్న బహుమతులను చేజిక్కించుకునేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ క్రమంలో సుమారు 40 మందికి గాయాలయ్యాయి. అక్కడే ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రంలో వీరికి వైద్యం అందించారు. తీవ్ర గాయాలైన వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

యువకుడి వైద్యానికి మంత్రి లోకేశ్ భరోసా

» 'ఎక్స్'లో పోస్టుకు స్పందన



'ఎక్స్'లో పోస్టుకు స్పందించిన లోకేశ్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడి వైద్యానికి మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు. బాధితుడి సమస్యను ఓ టీడీపీ కార్యకర్త 'ఎక్స్' ద్వారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. కర్నూలు నగరం గడ్డ స్ట్రీట్‌కు చెందిన పి.నవాస్ ఖాన్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. అతడి కిడ్నీ పాడైపోయిందని హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించగా, కొడుక్కి తన కిడ్నీ ఇవ్వడానికి తండ్రి సిద్ధమయ్యారు. ఈ చికిత్సకు రూ.13 లక్షలు, అనంతరం 6నెలల పాటు ఇంజెక్షన్లు, మందులు, తదితర వాటికి మరో రూ.12 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. లోకేశ్ కార్యాలయం నుంచి ఆదివారం నవాస్ ఖాన్‌కు ఫోన్ వచ్చింది. ప్రభుత్వం నుంచి రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఆర్థికసాయం అందిస్తుందని, వివరాలు పంపాలని కోరారు. దీంతో లోకేశ్‌కు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్య రంగాలకు మొండిచేయి

» దేశవ్యాప్త ఆందోళనలు, నిరసనలకు శ్రీకారం: సీపీఎం

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దేశ సంపద, వనరులను దోచి పెట్టడమే వికసిత భారత్ లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విమర్శించారు. 'బడ్జెట్ కేటాయింపు-సవాళ్లు' అనే అంశంపై ఆదివారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే విధంగా కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. పేదరికం, నిరుద్యోగం, ఆహార కొరత, రైతు ఆత్మహత్యలు వంటి సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు బడ్జెట్‌లో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పేదరికంతో అమెరికాకు వెళ్లిన భారత పౌరులను సంకెళ్లతో పంపిస్తే ప్రశ్నించే ధైర్యం కూడా ప్రధాని మోదీ చేయకపోవటం సిగ్గుచేటన్నారు. ఆంధ్రప్రదేశ్‌కూ బడ్జెట్‌లో తగిన కేటాయింపులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేకపోగా విభజన హామీలు కూడా కేంద్రం నెరవేర్చలేదని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వామపక్షాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపట్టబోతున్నట్లు తెలియచేశారు.

850 కోట్ల మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసం

» 'ఫాల్కన్ ఇన్వాయిస్'కు చెందిన ఇద్దరి అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మీ పెట్టుబడికి అధిక రాబడి అంటూ మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసానికి పాల్పడి పెట్టుబడిదారులకు రూ.850 కోట్ల మేర ఎగ్గొటిన ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ ప్లాట్‌ఫామ్‌కు చెందిన ఇద్దరిని సైబరాబాద్ ఆర్థిక నేర విభాగం(ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేశారు. క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు, ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ ప్లాట్‌ఫామ్ బిజినెస్ హెడ్ పవన్ కుమార్ ఒదేల, క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫాల్కన్ క్యాపిటల్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కావ్య నల్లూరిని అదుపులోకి తీసుకున్నామని సైబరాబాద్ ఈఓడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ ఆదివారం ప్రకటించారు. ప్రధాన నిందితులు, 'ఫాల్కన్' ఎండీ అమర్‌దీప్ కుమార్, సీఈవోలు ఆర్యన్ సింగ్, యుగేందర్ సింగ్.. పవన్ కుమార్, కావ్య నల్లూరితో కలిసి ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో మొబైల్ యాప్, వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. తమ సంస్థలో పెట్టుబడి పెడితే 45 నుంచి 180 రోజుల వ్యవధిలో 11 నుంచి 22 శాతం మేర లాభంతో విడతలవారీగా తిరిగిస్తామని ప్రచారం చేశారు. 2021 నుంచి డిపాజిట్ల సేకరణ మొదలుపెట్టి 6,979 మంది నుంచి రూ.1,700 కోట్లు సేకరించారు. ఇందులో రూ.850 కోట్లను డిపాజిటర్లకు వెనక్కి ఇచ్చారు. మరో రూ.850 కోట్లు చెల్లింపులు చెయ్యాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి 15న వీరు కార్యాలయాన్ని మూసేయగా.. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో జరిగిన మోసం బయటికొచ్చింది.

జగన్ నివాసం వద్ద గడ్డి 'దహనం'పై సందేహాలు

» పోలీసులు రెండుసార్లు నోటీసులిచ్చినా సీసీ ఫుటేజీ ఇవ్వని వైసీపీ కార్యాలయం

» కెమెరాలు సరిగా పని చేయడం లేదని ఆ పార్టీ నేతల వివరణ

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిలోని మాజీ సీఎం జగన్ నివాసం వద్ద గడ్డి దహనం ఘటనలో సొంత పార్టీ వారి ప్రమేయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జగన్ నివాసం వద్ద ఉన్న రెండు సీసీ కెమెరా ఫుటేజీ ఇవ్వాలని పోలీసులు రెండు దఫాలు నోటీసులు ఇచ్చినా ఇంతవరకు ఇవ్వకపోవడంతో అనుమానాలకు బలం చేకూరుతోంది. ఈ నెల 5న జగన్ నివాసం బయట గార్డెనింగ్ వద్ద ఎండిపోయిన గడ్డి కాలిపోయింది. దీనిపై వైసీపీ నాయకులు రాద్ధాంతం చేశారు. ఏదో కుట్ర చేస్తున్నారంటూ ఆరోపించారు. వైసీపీ నేతల ఆరోపణలపై ప్రభుత్వం కూడా సీరియ‌స్‌గా స్పందించింది. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి, అందుకు కారణాలు వెలికితీసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పోలీసులు ఘటన మిస్టరీ ఛేదించాలని ప్రయత్నిస్తున్నారు. ముందుగా ఆ రోడ్డులో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించారు. గడ్డి దహనమైన ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఈ ఘటనకు దారి తీసిన కారణాలు వెల్లడి కాలేదు. ఈ నెల 7న జగన్ నివాసం వద్ద ఉన్న రెండు సీసీ కెమెరా ఫుటేజీలను ఇవ్వాల్సిందిగా పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే వైసీపీ నుంచి కాని, జగన్ నివాసం నుంచి కాని ఏ స్పందనా రాలేదు. దీంతో ఈ నెల 10న మరోసారి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆ మరుసటి రోజు 11వ తేదీన వైసీపీ నాయకులు పోలీసులను కలిసి జగన్ నివాసం వద్ద ఉన్న సీసీ కెమెరాలు సరిగా పనిచేయడం లేదని చెప్పారు. ఐదో తేదీన జగన్ నివాసం వద్ద విజయవాడ కార్పొరేటర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వైసీపీ కార్పొరేటర్లు ఎవరెవరు వచ్చారో తెలియజేశారు. ఏవైనా వివరాలు కావాలంటే చెబుతామని, సీసీ కెమెరా ఫుటేజీ మాత్రం లేదని చెప్పారు. దీంతో వైసీపీ నేతల వ్యవహారంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



తాడేపల్లిలోని మాజీ సీఎం జగన్ నివాసం వద్ద దహనమవుతున్న గడ్డి (ఫైల్)

హై సెక్యూరిటీ జోన్‌లో...

మాజీ సీఎం జగన్ నివాసం హై సెక్యూరిటీ జోన్‌లో ఉంది. అక్కడ ఆకతాయిలు లేదా రాజకీయ ప్రత్యర్థులు గడ్డి దహనం చేసేందుకు సాహసం చేసే అవకాశమే ఉండదు. అంతేగాక మాజీ సీఎం ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు తప్పనిసరిగా పని చేస్తాయని పోలీసులు అంటున్నారు. గడ్డి దహనానికి సంబంధించిన దృశ్యాలు తప్పనిసరిగా రికార్డయి ఉంటాయని భావిస్తున్నారు. గడ్డి దహనం జరిగిన దృశ్యాలను ఇప్పటికే వారు చూసి ఉంటారని, అందువల్లే ఆయా ఫుటేజీలను ఇవ్వడానికి వెనుకాడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వంశీ బ్యారక్‌కు పరదా!

» విజయవాడ జిల్లా జైలులో భద్రతా చర్యలు

» నేడు న్యాయాధికారి ముందుకు సత్యవర్ధన్



విజయవాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బ్యారక్‌కు అధికారులు పరదాలు కట్టినట్లు తెలిసింది. భద్రతా చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో న్యాయస్థానం రిమాండ్ విధించగా, జైలు అధికారులు ఆయనకు ఒకటో నంబరు బ్యారక్‌లో గదిని కేటాయించారు. అందులో ఉన్న వంశీ ఇతర ఖైదీలకు కనిపించకుండా కటకటాల వద్ద పరదా కట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇతర ఖైదీలెవరూ వంశీ ఉన్న బ్యారక్ వైపు వెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. బ్యారక్ వద్ద ఉన్న సీసీ కెమెరాల ద్వారా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

కోర్టుకు సత్యవర్ధన్ వాంగ్మూలం

ముదునూరి సత్యవర్ధన్‌ను న్యాయాధికారి ముందు సోమవారం ప్రవేశపెట్టడానికి పోలీసులు రంగం సిద్ధం చేశారు. వంశీ ప్రణాళికలతో ఆయన అనుచరులు తనను బెదిరించి కిడ్నాప్ చేశారని, టీడీపీ కార్యాలయంపై జరిగిన కేసులో తనకు సంబంధం లేదని చెప్పించారని సీఆర్పీసీ 161 ప్రకారం సత్యవర్ధన్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. ఈ వాంగ్మూలాన్ని సీఆర్పీసీ 164 కింద న్యాయాధికారి ముందు చెప్పాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి పోలీసులు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌కు లేఖ రాశారు. సత్యవర్ధన్ నుంచి 164 వాంగ్మూలాన్ని నమోదు చేసుకునేందుకు కోర్టును కేటాయించాలని పేర్కొన్నారు. దీనిపై సీఎంఎం కోర్టు సోమవారం నిర్ణయం తీసుకుని కోర్టును కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

వంశీతో జగన్ ములాఖత్ రేపు?

విజయవాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మంగళవారం విజయవాడలోని జిల్లా కారాగారానికి రానున్నారు. రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీని ఆయన పరామర్శిస్తారని తెలిసింది. ప్రస్తుతం జగన్ బెంగళూరులో ఉన్నారు. ఆయన మంగళవారం గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా గాంధీనగర్‌లోని జైలుకు వెళ్తారని సమాచారం.

స్మగ్లర్లపై సినిమా తీస్తే ఏం ఉపయోగం?

» మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు వైరల్

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్మగ్లర్ల మీద సినిమాలు తీయడం వల్ల సమాజానికి ఏం ఉపయోగమని మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. శనివారం ఆయన నంద్యాల జిల్లా కేంద్రంలోని గురురాజా పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ఓటీటీల్లో వస్తున్న సినిమాలు యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. పూలన్‌దేవి, వీరప్పన్ లాంటి స్మగ్లర్‌లపై సినిమాలు తీసి కోట్ల రూపాయలు గడిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి సినిమాల వల్ల సమాజానికి ముప్పే తప్ప ఎలాంటి ఉపయోగమూ లేదన్నారు. సమాజానికి ఉపయోగపడే మంచి సినిమాలు తీయాలని మంత్రి సూచించారు.

తిరుపతిలో నేటి నుంచి ఐటీసీఎక్స్-2025



» హాజరుకానున్న సీఎం చంద్రబాబు, గోవా, మహారాష్ట్ర సీఎంలు కూడా..

తిరుపతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దేవాలయాల సదస్సుకు తిరుపతి వేదికగా నిలిచింది. ఆలయ నిర్వహణకు సంబంధించి వినూత్న విధానాలు, ఉత్తమ పద్ధతులను అన్వేషించడం, స్థిరమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటుచేయడం, డిజిటలైజేషన్, ఆలయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను పెంపొందించడం వంటి వ్యూహాలపై దృష్టి సారించడమే లక్ష్యంగా ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో(ఐటీసీఎక్స్) సదస్సు జరగనుంది. తిరుపతిలోని ఆశా కన్వెన్షన్ సెంటర్లో సోమవారం జరిగే ప్రారంభ సభకు సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్, కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి సీఆర్ ముకుంద్, పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. దేవాలయ పరిపాలన, నిర్వహణకు సంబంధించి జరగనున్న ఐటీసీఎక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా ఆలయాల ప్రతినిధులు హాజరుకానున్నట్లు టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్‌కులకర్ణి, ఎక్స్‌పో చైర్మన్, మహారాష్ట్ర మండలి చీఫ్ విప్ ప్రసాద్ లాడ్ చెప్పారు.

తెలంగాణలో హైటెక్ కోర్టు!

» అధునాతన హంగులతో భవన సముదాయం



తెలంగాణ హైకోర్టు నూతన భవన సముదాయం డిజైన్

హైదరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు నూతన భవన సముదాయం అత్యంత విశాలంగా, అధునాతనమైన సౌకర్యాలతో నిర్మాణం కానుంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 100 ఎకరాల్లో హైకోర్టు నూతన భవనాన్ని రూ.2,583 కోట్ల వ్యయంతో నిర్మించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. భవన సముదాయం నిర్మాణం కోసం ప్రాథమికంగా రూపొందించిన నమూనా 'ఆంధ్రజ్యోతి'కి లభించింది. ఈ నమూనా ప్రకారం.. వందెకరాల్లో 36,52,840 చ.అ. విస్తీర్ణంలో 10 బ్లాకులతో భవన సముదాయాన్ని నిర్మించనున్నారు. ప్రధాన కోర్టు భవనాన్ని 8.4 లక్షల చ.అ. విస్తీర్ణంలో 6 అంతస్తుల్లో నిర్మించాలని ప్రతిపాదించారు. అడ్వొకేట్ జనరల్ ఉండే బ్లాక్‌నూ 6 అంతస్తులతో 2.32 లక్షల చ.అ. నిర్మించనున్నారు. న్యాయవాదుల చాంబర్‌ను 1.58 లక్షల చ.అడుగుల్లో 5 అంతస్తులతో నిర్మించనున్నారు. రికార్డుల భద్రత కోసం 60 వేల చ.అడుగుల్లో లోయర్, జీ ప్లస్ వన్ రూపంలో ఒక బ్లాక్‌ను, 42,500 చ.అడుగుల్లో ఆడిటోరియం బ్లాక్‌ను జీ ప్లస్ వన్‌గా నిర్మించనున్నారు. ప్రధాన న్యాయమూర్తి బంగళాను 35,530 చదరపు అడుగుల్లో, ఆయన సెక్రటేరియట్‌ను 7,260 చ.అడుగుల్లో నిర్మిస్తారు. 63మంది జడ్జిల క్వార్టర్స్ కోసం 2.67లక్షల చ.అడుగుల స్థలాన్ని కేటాయించారు. 96,500 చ.అడుగులతో జడ్జిల స్టాఫ్ క్వార్టర్స్, 14 వేల చ.అడుగులతో క్లబ్ హౌస్ నిర్మించనున్నారు. ఒకేసారి 2800 వాహనాలు పార్క్ చేసేలా 9,33,640 చ.అడుగుల స్థలం కేటాయించారు. భవన నిర్మాణానికి 'ఆంధ్రజ్యోతి'కి లభించిన ప్రాథమిక నమూనాతో పాటు మరో రెండు నమూనాలు కూడా పరిశీలిస్తున్నారు. వీటిలో ఒకదాన్ని ఖరారు చేశాక పనుల నిర్వహణకు టెండర్లు పిలుస్తారు.

ఇద్దరు టీటీడీ మాజీ ముఖ్యులకు లుకౌట్ నోటీసులు?!

» ఒకరు అధికారి.. మరొకరు పాలకమండలి సభ్యుడు

» అనుమానితుల బ్యాంకు ఖాతాలు, నగదు లావాదేవీలపై సిట్ దృష్టి

తిరుపతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ తయారీకి నాణ్యతలేని నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన సిట్ అధికారులు టీటీడీలో ఇదివరకు కీలకంగా వ్యవహరించిన ఇద్దరిపై లుకౌట్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. గత వైసీపీ హయాంలో టీటీడీలో పనిచేసిన ఓ కీలక అధికారితోపాటు, పాలకమండలికి చెందిన ఓ ముఖ్యవ్యక్తికి నోటీసులు జారీ కానున్నాయి. కల్తీ నెయ్యి సరఫరా ఒప్పందాల్లో ఇప్పటికే సిట్ అధికారులు వీరిద్దరి పాత్రను ప్రాథమికంగా నిర్ధారించుకున్నారని, వారు తప్పించుకునే వీలులేకుండా ముందు జాగ్రత్తగా లుకౌట్ నోటీసులు జారీ చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. గతంలో టీటీడీ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించిన పాలకమండలి సభ్యుడొకరు గత వైసీపీ హయాంలో టీటీడీ ముఖ్య అధికారితో అత్యంత సన్నిహితంగా మెలిగినట్టు సిట్ గుర్తించింది. వారి మధ్య పరిచయం బంధుత్వంగా మారే పరిస్థితి కూడా కనిపించింది. ఆ వ్యక్తి నెయ్యి సరఫరాకు సంబంధించిన డెయిరీల తరఫున టీటీడీతో ఒప్పందాలు కుదర్చడంలో కీలక పాత్ర పోషించినట్టు భావిస్తోంది. ఆ దిశగా వారి ఖాతాలను, ఖాతాల ద్వారా జరిగిన లావాదేవీలను పరిశీలిస్తోంది.



డెయిరీల నిర్వాహకులు, మధ్యవర్తులు, టీటీడీకి చెందిన అధికార, అనధికారుల మధ్య జరిగిన ఫోన్ కాల్ డేటాను సేకరించి విశ్లేషించే పనిలో పడింది.

తిరస్కరించిన నెయ్యి ట్యాంకర్లనూ తిరిగి తెప్పించుకున్నారా?

కేసు దర్యాప్తులో సిట్ అధికారులు ఆసక్తికరమైన అంశాన్ని గుర్తించినట్టు సమాచారం. నెయ్యి నాణ్యంగా లేదని టీటీడీ ల్యాబ్ రిపోర్టు ఇచ్చినప్పటికీ పాలకమండలికి చెందిన ఓ కీలక వ్యక్తి జోక్యం చేసుకుని ఆ విభాగం నిపుణులతో నెయ్యి నాణ్యత బాగుందంటూ లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ ఇప్పించి దాని ఆధారంగా వెనక్కి పంపిన ట్యాంకర్లను తిరిగి రప్పించి నెయ్యి తీసుకున్నట్టు తెలిసింది. ఆ నెయ్యికి టీటీడీ నుంచీ బిల్లులు బ్యాంకు ద్వారా కాకుండా నగదు రూపంలో చెల్లింపులు చేసినట్టు సిట్ గుర్తించిందని తెలిసింది.

నిందితుల బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

కల్తీనెయ్యి కేసులో నిందితుల బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ జరగనుంది. ఈ నెల 9న కల్తీ నెయ్యి కేసులో ఏ2 నుంచీ ఏ5 దాకా నిందితులు రాజశేఖరన్, పొమిల్ జైన్, విపిన్ జైన్, వినయ్‌కాంత్ చావడాను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తిరుపతి జ్యుడిషియల్ కస్టడీలో వున్న వారికి బెయిల్ కోసం వారి తరపు న్యాయవాదులు 10న పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై నేడు కోర్టు విచారించనుంది. గత 14 శుక్రవారం నుంచీ ఐదు రోజుల పాటు నిందితులను విచారణ నిమిత్తం సిట్ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. ఈ కస్టడీ 18న మంగళవారం ముగియనుంది. దీంతో నేడు బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే!.

నిందితులకు రుయాలో వైద్య పరీక్షలు

కల్తీ నెయ్యి సరఫరా కేసులో అరెస్టయి కస్టడీలో ఉన్న నలుగురు నిందితులనూ ఆదివారం వైద్య పరీక్షల నిమిత్తం తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు అందరి ఆరోగ్యం బాగానే ఉందని నిర్ధారించారు. అయితే హృదయ సంబంధ సమస్య ఉన్నట్లుగా భావిస్తున్న ఏ2 నిందితుడు ఏఆర్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖరన్‌కు మాత్రం సంబంధిత మందులు వాడాల్సిందిగా సూచించారు. అనంతరం నిందితులను తిరిగి సిట్ కార్యాలయానికి తరలించారు.

7 లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తున్నాం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించేలా నాయకులంతా సమష్టిగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలతో ఆదివారం సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ప్రతి ఎన్నికా మనకు పరీక్షవంటిదే. మూడు పార్టీల అభ్యర్థులు కలిసికట్టుగా పనిచేయాలి. క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ ఓటర్లను చైతన్యపర్చాలి. ఐదేళ్ల విధ్వంసపాలనలో గాడితప్పిన వ్యవస్థలను గాడిలో పెట్టి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నాం' అన్నారు. ఎన్నికలకు 10 రోజుల సమయం మాత్రమే ఉందని, మూడు పార్టీల నేతలు కూటమి ధర్మాన్ని పాటిస్తూ ఎన్నికల నియామావళిని ఉల్లంఘించకుండా విజయం కోసం పనిచేయాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కన్నా ఈ ఎన్నికల్లో వచ్చే మెజారిటీ మెరుగ్గా ఉండాలన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలపై మంత్రులకు దిశానిర్దేశం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు(ఫైల్)

నిరుపయోగంగా ఉద్యోగుల హెల్త్‌కార్డులు: కేవీ శివారెడ్డి

విజయవాడ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 16: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల హెల్త్‌కార్డులు నిరర్థకంగా పడిఉన్నాయని, వీటిపై రిఫరల్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందడం లేదని జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగులు ప్రతినెలా తమ వంతు భాగస్వామ్యాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తున్నా, ప్రభుత్వం నుంచి తమకు చెల్లింపులు జరగడం లేదంటూ ఆస్పత్రుల యాజమాన్యాలు వైద్యసేవలు అందించడంలేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ల్యాబ్ టెక్నీషియన్స్ రాష్ట్ర సమావేశం గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో ఆదివారం జరిగింది. శివారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్‌లోని ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లకు ప్రమోషన్ చానల్ ఏర్పాటుచేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ల్యాబ్ టెక్నీషియన్స్ రాష్ట్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణు, ఎంఎస్ మూర్తి, ఎన్జీవో సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఆదివారం తెల్లారితే చాలు.. చికెన్ షాపుల ముందు నాన్‌వెజ్ ప్రియులు క్యూకట్టేస్తారు. బోన్‌లెస్-బోన్‌విత్ అంటూ.. వ్యాపారులు సైతం క్షణం తీరిక లేకుండా గడిపేస్తారు! కానీ.. ఈ ఆదివారం చికెన్ దుకాణాలపై 'బర్డ్‌ఫ్లూ' ప్రభావం స్పష్టంగా కనిపించింది. రాష్ట్ర వ్యాప్తంగా చికెన్ వ్యాపారాలు డీలా పడి వ్యాపారులు కటకటలాడారు. తిరుపతిలోని లీలామహల్ సర్కిల్‌లో ఉన్న చికెన్ దుకాణాలు.. కొనుగోలు దారులు లేక బోసి పోగా.. పక్కనే ఉన్న చేపల మార్కెట్ మాత్రం మాంసాహార ప్రియులతో కిటకిటలాడింది!! - తిరుపతి, ఆంధ్రజ్యోతి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.